
Dwaraka
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 206 | బుధవారం 17-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

పెత్తనం కోసమే...



ఎన్‌ఎంసీ బిల్లుపై సర్వత్రా ఆగ్రహం

- 60 శాతం ఫీజులు పెంచుకునే ఆస్కారం
- ఇష్టారాజ్యంగా కళాశాలలు
- ఆయుర్వేదం, హోమియోలకు అల్లోపతి హోదా..?
- బిల్లును వ్యతిరేకిస్తున్న వైద్యులు, విద్యార్థులు
- ఎంసీఐనే కొనసాగించాలని డిమాండు

విశాలాంధ్ర : అన్నీ వ్యవస్థలపై తన గుప్పిట్లో తెచ్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర సర్కారు కన్ను ఇప్పుడు వైద్య రంగంపై పడింది. అందులో భాగంగానే ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్).మార్పులకు నడుం బిగించింది. వైద్యరంగంలో సంస్కరణలు తెస్తామనీ, లోపాలను సరిదిద్దుతామంటూ కేంద్రం కొత్తగా బిల్లు తీసుకొనిరాబోతోంది. దీనిపై సర్వత్రా ఆగ్రహం పెల్లుబుకుతోంది. వైద్యవృత్తిని భ్రష్టు పట్టించే విధంగా ఉన్న ఈ బిల్లును వెంటనే సవరించాలనీ లేదా ప్రస్తుతం ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)నే కొనసాగించాలని, కావాలంటే దాన్లో సంస్కరణలు చేపట్టాలని దేశవ్యాప్తంగా ఉన్న వైద్యులు డిమాండు చేస్తున్నారు. అయితే ఈ బిల్లును ప్రస్తుతం స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపారు. దీంతో వైద్యులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

ఎంసీఐ అంటే..

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో 25 మంది సభ్యులు డాక్టర్లే ఉంటారు. ఐదేళ్లకొకసారి ఎన్నికల్లో డాక్టర్లందరూ పాల్గొని సభ్యులను ఎన్నుకుంటారు. దీన్లో ఉన్న నిబంధన ప్రకారం వైద్య కళాశాలలకు 15శాతం ఫీజులను పెంచుకునే అవకాశం ఉంటుంది. కొన్ని మాత్రమే ప్రయివేటు వైద్య కళాశాలలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇక ఆయుర్వేదం, హోమియోపతి వైద్యవిధానాలు వేరేవేరేగా ఉంటాయి.

ఇప్పుడేం చేస్తారు...

ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న బిల్లు ఎన్‌ఎంసీ అంటే నేషనల్ మెడికల్ కౌన్సిల్. ఇందులో 25మంది సభ్యులు ఉంటారు. 20మంది ఇతర రంగాలకు ప్రాతినిధ్యం

లోపాలను సవరించాలి

ఎన్‌ఎంసీ ఓ లోపాల పుట్ట. డాకర్లతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఎన్‌ఎంసీ ఏర్పాటుతో భవిష్యత్తులో వైద్య రంగం ప్రమాదంలో పడుతుంది. రోగులకు సేవలు దూరమవుతాయి. రాజకీయ జోక్యం పెరుగుతుంది. ఎంసీఐని ప్రక్షాళన చేసి ఎన్‌ఎంసీని రద్దు చేయాలి.

– డాక్టర్ రవిశంకర్, ఐఎంఏ, హైదరాబాద్ అధ్యక్షులు

- మిగతా 2 లో

బీజేపీలో మరో చిచ్చు

ఎన్‌కౌంటర్ చేస్తారేమో..



- సర్కార్‌పై వీహెచ్‌పీ అధ్యక్షుడి ఆరోపణ
- ఒక రోజంతా కనిపించని తొగాడియా
- స్పృహ తప్పిన స్థితిలో ఆస్పత్రిలో చేరిక

జైపూర్ : బీజేపీలో మరోసారి చిచ్చురేగింది. పార్టీలో అంతర్గత వైరుధ్యాలు, ఘర్షణలు ఇటీవల పలుమార్లు బయట పడుతున్నాయి. తాజాగా వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తొగాడియా రూపంలో అవి బయటపడ్డాయి. కేంద్రప్రభుత్వం, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు తనపై కుట్రపన్ని ఎన్‌కౌంటర్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని తీవ్ర ఆరోపణలు చేసినట్లు మీడియా వార్తా కథనాలు వెలువడ్డాయి. హిందుత్వవాదిగా మతాల మధ్యన వైరుధ్యాలను సృష్టించడంలో ముందు పీఠికన నిలిచే తొగాడియా మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకొని ఆశ్చర్యపరిచారు. మరిన్ని వివరాలు త్వరలో చెబుతానని అన్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

ఒక రోజంతా ఆచూకీ తెలియకుండా స్పృహతప్పిన పరిస్థితిలో తిరిగి కనిపించిన విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా మంగళవారం మీడియా ముందు దాదాపు కన్నీటి పర్యంతమయ్యారు. 'నా గొంతు నొక్కేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌లో తనను చంపేందుకు వ్యూహరచన జరిగినట్టు తెలియడంతో ఆఫీసు నుంచి పారిపోయానని చెప్పారు. 'దశాబ్దం క్రితం నాటి పాత కేసులో నన్ను టార్గెట్ చేశారు. రాజస్థాన్ పోలీసులు నన్ను అరెస్టు చేసేందుకు వచ్చారు. ఎన్‌కౌంటర్‌లో చంపేందుకు ప్లాన్ చేసినట్టు ఎవరో నాతో చెప్పారు' అని ఆయన మీడియాకు వివరించారు. 'నా గొంతు వినిపించకుండా చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. రామమందిరం, గోవధ నిషేధ చట్టం, రైతుల సంక్షేమ పథకాలు తదితర అంశాలపై నేను మాట్లాడాను. ఇందువల్లే నా గొంతు నొక్కాలనుకుంటున్నారు' అంటూ తీవ్రారోపణలు చేశారు. ఎవరు దాడి చేయాలనుకున్నారని అడిగినప్పుడు సాక్ష్యాలతో సహా మరోసారి బహిరంగంగానే చెబుతానని ఆయన సమాధానమిచ్చారు.

కాగా, తొగాడియా ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే తన ఆరోగ్యం మెరుగయ్యేంత వరకూ ఆసుపత్రిని వదిలి వెళ్లనని తొగాడియా స్పష్టం చేశారు. జడ్-ప్లస్ కేటగిరి భద్రత కలిగిన తొగాడియా సోమవారం ఉదయం పల్దీలోని వీహెచ్‌పీ ప్రధాన

- మిగతా 2 లో

కోడే గెలిచింది

- కోర్టు ఉత్తర్వులు, పోలీసు ఆంక్షలు బేఖాతర్
- వెయ్యికిపైగానే బరుల ఏర్పాటు
- చేతులు మారిన రూ.750 కోట్లు
- గోదావరి జిల్లాల్లోనే భారీగా పందేలు
- కృష్ణాలోనూ తక్కువేమీ కాదు
- విశాఖజిల్లాలోనూ కోడి పందేలు
- ఫ్లడ్‌లైట్లు పెట్టి మరీ పందేల నిర్వహణ



విశాలాంధ్రబ్యూరో – అమరావతి

మళ్లీ కోడిదే పైచేయి అయింది. హైకోర్టు ఉత్తర్వులు, పోలీసుల ఆంక్షల ముందు కత్తి కట్టిన కోడే చివరకు గెలుపొందింది. కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తామంటూనే హైకోర్టు ఉత్తర్వులను నిర్వాహకులు బేఖాతరు చేశారు. సంక్రాంతి సంప్రదాయం పేరుతో మూడు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ ఎత్తున కోడి పందేలు జరిగాయి. కోస్తా జిల్లాల్లో విజయనగరం, విశాఖపట్నం తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాలో రేయింబవళ్లు కోడి పందేలు నిర్వహించారు. అనధికార అంచనా ప్రకారం వెయ్యికిపైగా కోడి పందేల బరులను ఏర్పాటు చేయగా, లక్షలాది కోళ్ల పందేలలో పాల్గొన్నాయి. హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తామంటూ పోలీసులు ఆదివారం మధ్యాహ్నం వరకు పందేలు జరగకుండా అడ్డుకున్నారు. అయితే సంప్రదాయం ప్రకారం కత్తులు కట్టకుండా డింకీ పందేలు వేసేందుకు ఉన్నతాధికారులు అనుమతించటంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు బరులను వదిలిపెట్టేశారు. దీంతో పలు చోట్ల ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేసి మరీ పందేలు నిర్వహించారు. రాష్ట్రంలో శనివారం నుంచి మంగళవారం వరకు కోడి పందేలు జరిగాయి. కోడి పందేల నిర్వాహకులు, ప్రజా ప్రతినిధుల ఒతిళ్ల ముందు కోర్టు ఉత్తర్వులు, పోలీసు ఆంక్షలు అమలుకు నోచుకోలేదు. సగటున రోజుకు రూ. 200 కోట్ల నుంచి రూ.300 కోట్ల మేర డబ్బులు చేతులు మారాయి. గత ఏడాది సంక్రాంతికి కోడి పందేల్లో రూ.500 కోట్ల మేర పందేలు జరగ్గా, ఈసారి రూ.750 కోట్లపైనే డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. ఉభయ గోదావరి జిల్లాల్లో

- మిగతా 2 లో

పరిష్కారానికి కసరత్తు



- ఆ నలుగురితో సీజేఐ భేటీ
- పలు కీలక అంశాలపై చర్చ
- వివాదం సర్దుమణగలేదు : మాట మార్చిన అటార్నీ

విశాలాంధ్ర –న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సుప్రీంకోర్టు వివాదం పరిష్కారానికి కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్రా మంగళవారం నలుగురు అసంతృప్త జడ్జీలు జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎంబీ లోకుర్, జస్టిస్ కురియన్ జోసఫ్‌తో భేటీ అయ్యారు. కోర్టు కార్యకలాపాలకు ముందుగానే వీరు సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. మరికొందరు జడ్జీలు కూడా ఈ సమావేశానికి హాజరైనట్టు సమాచారం. సుప్రీంకోర్టులో పాలనా వ్యవహారాలు గాడి తప్పాయని ఆరోపిస్తూ సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ఈనెల12న మీడియాతో మాట్లాడడం తెలిసిందే. అయితే, సుప్రీంకోర్టు వివాదం ఇంకా ముగియలేదని, దీని పరిష్కారానికి మరో మూడ్నాలుగు రోజులు పడుతుందని అటార్నీ జనరల్ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యాయని నిన్న చెప్పిన ఆయన నేడు మాటమార్చడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం

- మిగతా 2 లో



మళ్లీ భగ్గుమన్న పెట్రోల్

లీటర్ రూ.75.37


- రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు
- వినియోగదారుల్లో దడ
- తల్లడిల్లిన సగటుజీవి

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: పెట్రోల్, డీజిల్ ధరలు భగ్గుమన్నాయి. ఎప్పుడూ లేనంతగా రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయి. ఇప్పటికే అధిక ధరలతో తల్లడిల్లుతున్న వాహనదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో ఆర్థిక భారం పడింది. డీజిల్ రేటు రూ. 67.08గా ఉండగా.. పెట్రోల్ రేటు రూ.75.37కు చేరి దడ పుట్టిస్తున్నది. అంతంతమాత్రం జీతాలతో జీవనం వెళ్లదీస్తున్న సామాన్య కుటుంబాలకు, వాహనదారులకు భారంగా పరిణమించింది. అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు ఎప్పటికప్పుడు పెరగడంతో దాని ప్రభావం పెట్రోల్, డీజిల్‌పై పడింది. ఇప్పటికే జీఎస్టీ వల్ల పన్నుల భారంతో సగటు జీవి తల్లడిల్లుతున్నాడు. నిత్యావసర వస్తువులు ముఖ్యంగా కూరగాయలు, పండ్లు వంటివి వివిధ రాష్ట్రాల నుంచి రవాణా

- మిగతా 11 లో

పోలవరంపై
అవినీతి ఫిర్యాదు

వివరణ కోరిన కేంద్రం


PMO Reference
Sub: Large Scale corruption and irregularities in the execution of Polavaram Project - reg.
Yours faithfully
(Dr.R.K.Gupta)
Member Secretary

విశాలాంధ్ర, అమరావతి : పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఓ రిటైర్డ్ ఉద్యోగి ప్రధానమంత్రికి ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుపై ప్రధానమంత్రి కార్యాలయం తీవ్రంగా స్పందించింది. రిటైర్డ్ ఉద్యోగి చేసిన ఫిర్యాదుపై విచారించి వివరణ ఇవ్వాలంటూ పోలవరం పరియోజన ప్రాధికార సంస్థను ఆదేశించింది. ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశానుసారం పోలవరం పరియోజన ప్రాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఆర్.కె.గుప్తా రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ చీఫ్ ఇంజనీర్‌ను వివరణ కోరుతూ లేఖ రాశారు. ఆ ఫిర్యాదుపై విచారణ జరిపి తగు సమాధానం ఫిర్యాదుదారునికి కూడా పంపాలని ఆదేశించారు. ఏపీకి సంబంధించి చిన్న ఫిర్యాదు అందినా ప్రధానమంత్రి ఉపేక్షించరన్నది ఈ వ్యవహారంతో అర్థమౌతుంది. పై వ్యవహారానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్రంలో గతంలో నిర్మించిన పట్టిసీమ తరహాలోనే గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు మళ్ళించేందుకు పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం

- మిగతా 2 లో

ఇదీ లోకం!



హజ్ యాత్రికులకు
సబ్సిడీ రద్దు

- ఈ ఏడాది నుంచే అమలు

7లో

ఖాఫ్ పంచాయితీలు
చట్టవిరుద్ధం

- పరువు హత్యలపై సుప్రీం ఆగ్రహం

9లో

జైళ్లలో 3 లక్షల మంది విచారణ ఖైదీలు

పట్టు కోసం బీజేపీ తహతహ...

- ప్రత్యేక గవర్నర్‌ను నియమించండి
- రాజ్‌నాథ్‌సింగ్‌కు ఏపీ అధ్యక్షుడు హరిబాబు లేఖ
- విభజనచట్టంలో ఉందన్న ఎంపీ
- ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావనే లేదు
- రాష్ట్రంలోనూ చిచ్చుపెట్టే ప్రయత్నమేనంటున్న విశ్లేషకులు
- విభజన హామీలు అమలు చేయాల్సిందే : సీపీఐ రామకృష్ణ



విశాలాంధ్రబ్యూరో అమరావతి/విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్‌లో తన మార్కు కనిపించేందుకు బీజేపీ తహతహలాడుతోంది. రాష్ట్రంలో మిత్రపక్షం టీడీపీ అధికారంలో ఉండటంతో బీజేపీ మాట ఎక్కడా చెల్లుబాటు కావటంలేదు. ఈ నేపథ్యంలో ఏవిధంగానైనా రాష్ట్రంలో పట్టు పెంచుకోవాలనే ఉద్దేశంతో ఉన్న బీజేపీ అనేక ప్రయత్నాలు చేస్తోంది. తాను చెప్పిన మాటే నెగ్గాలంటే అనుకూలమైన గవర్నర్ ఉండాలని బీజేపీ భావిస్తోంది. అందులో భాగంగానే ఇటీవల ఆ పార్టీ శాసనసభా పక్షం నేత పీ విష్ణుకుమార్ రాజు గవర్నర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణా, ఏపీకి గవర్నర్‌గా వ్యవహరిస్తున్న ఈఎస్ఎల్ నరసింహన్‌ను తప్పించి రాష్ట్రానికి కొత్త గవర్నర్‌ను నియమిండాలని మీడియా సమావేశం పెట్టి మరీ డిమాండు చేశారు. ఇక ఈసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖపట్నం ఎంపీ కంభంపాటి హరిబాబు స్వయంగా రంగంలోకి దిగారు. రాష్ట్రానికి ప్రత్యేకంగా గవర్నర్‌ను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఆయన మంగళవారం లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన

- మిగతా 11 లో

ఇజ్రాయిల్ గుర్తింపు సస్పెన్షన్‌కు పాలస్తీనా ఓటు

జెరూసలేం : ఇజ్రాయిల్ గుర్తింపును సస్పెండు చేసేందుకు పాలస్తీనా విముక్తి సంస్థ (పిఎల్‌ఒ) తగిన చర్యలు తీసుకోవాలని పాలస్తీనా సెంట్రల్ కౌన్సిల్ కోరింది. సోమవారం సెంట్రల్ కౌన్సిల్ సమావేశమై ఈమేరకు తీర్మానించి పీఎల్‌ఓకు బాధ్యత అప్పగించినట్టుగా జెరూసలేం పోస్టు తెలియజేసింది. పలు ఒప్పందాలపై సంతకాలు చేయకముందు 1993లో పిఎల్‌ఒ ఇజ్రాయిల్‌ను గుర్తించింది. ఆ తరువాత పాలస్తీనా అథారిటీని ఏర్పాటు చేశారు. 1967లో నిర్ధారించిన పాలస్తీనా సరిహద్దులను ఇజ్రాయిల్ గుర్తించేవరకు ఆ దేశ గుర్తింపును సస్పెండు చేయాలని పాలస్తీనా సెంట్రల్ కౌన్సిల్ నిర్ణయించి బాధ్యతను పీఎల్‌ఓ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అప్పగించింది. ఇందుకు ఎలాంటి గడువును విధించలేదు. భద్రతకు సంబంధించి కూడా ఇజ్రాయిల్‌తో సహకరించబోమని పాలస్తీనా సెంట్రల్ కౌన్సిల్ ప్రకటించింది. అంతకుముందు పాలస్తీనా రాజధానిగా అబూడియాస్‌ను ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. అబూడియాస్ జెరూసలేం శివారు ప్రాంతాలలోగల పాలస్తీనా పట్టణం. ఈ పట్టణంలో అల్-కుడాస్ యూనివర్సిటీ ఉంది. దేశంలోని యూనివర్శిటీలలో ఇది అతి పెద్దది. పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్‌ను జెరూసలేం లేకపోతే ఏం చేస్తారని ఒక విలేకరి ప్రశ్నించగా అబోడియాస్‌ను ఇజ్రాయిల్ ప్రతిపాదిస్తున్నదని అది తమకు సమ్మతం కాదని చెప్పారు.



ట్రంప్‌కి బ్రేవరీ అవార్డు



కాబూల్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి 'మెడల్ ఆఫ్ బ్రేవరీ' అవార్డును ఆఫ్ఘనిస్థాన్ లోగర్ రాష్ట్రంలో నివశిస్తున్న ప్రజలు ప్రకటించారు. పాకిస్థాన్‌పై ఇటీవల ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రకటన చేసినందుకు గాను ఈ అవార్డును ప్రకటించినట్లు తెలిపారు. అవార్డును బంగారంతో తయారు చేసి అందించనున్నట్లు తెలిపారు. లోగర్ రాష్ట్రంలోని ప్రజల వద్దనుంచి విరాళాలు సేకరించి ఈ అవార్డును తయారు చేయిస్తున్నారు. అవార్డు విలువ దాదాపు 645 దాలర్లు ఉంటుంది.

విశాలాంధ్ర ప్రపంచం



13 మంది పిల్లలను బంధించిన తల్లిదండ్రులు



కాలిఫోర్నియా : పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను ఇంట్లోనే బంధించి హింసించిన తల్లిదండ్రుల ఉదంతం పోలీసులు కాలిఫోర్నియాలో వెలికి తెచ్చారు. కొంతమంది పిల్లలను గొలుసులతో కట్టి, మంచాలకే పరిమితం చేశారని పోలీసులు వెల్లడించారు. ఇరుగుపొరుగు కుటుంబాలను విచారించగా, ఆ కుటుంబం తలుపులు మూసివేసి పిల్లలను బయటికి పంపడం లేదన్నారు. లాస్ ఏంజెల్స్‌కి 70 మైళ్ల దూరంలోని పెరిస్ వద్ద ఒక ఇంటి నుంచి 17 ఏళ్ల బాలిక తప్పించుకొని పారిపోయిందని, చివరకు ఆ బాలిక ఇతర పిల్లలతోపాటు కాలిఫోర్నియాలోనే కనిపించిందని రివర్ సైడ్ కౌంటీ షరీఫ్ కార్యాలయం వెల్లడించింది. ఇంట్లో బంధించిన 13 మందిలో ఏడుగురు పెద్ద పిల్లలని వారంతా ఎలాంటి పరిశుభ్రత లేని స్థితిలో ఉన్నారని పోలీసులు తెలిపారు. 2 నుంచి 29 ఏళ్ల మధ్యగల పిల్లలని వారు వివరించారు. పిల్లలను బంధించిన తల్లిదండ్రులు అన్నా టర్పిన్, డేవిడ్ అలెన్ టర్పిన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. 9 మిలియన్ డాలర్లు చెల్లించి వారు బెయిల్ పొందారు. పిల్లలను బయటికి పంపకుండా నిర్బంధించడంతో వారంతా తీవ్రంగా భయకంపితులయ్యారు. ఈ పిల్లల్లో ఆరుగురు చిన్నపిల్లలని ఏడుగురు 18 ఏళ్లకు పైబడిన వయస్సుగల వారని పోలీసులు పేర్కొన్నారు.

ఉత్తర కొరియాలో సానుకూల మార్పులు

ట్రంప్‌నకు తెలియచేసిన జిన్‌పింగ్

బీజింగ్ : కొరియా ద్వీపకల్పంలో అలాగే ఉత్తరకొరియాలో సానుకూల మార్పులు వచ్చాయని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తెలియచేశారు. జిన్‌పింగ్ ట్రంప్‌కు ఫోన్ చేసి ఈ అంశాన్ని వివరించారు. అణ్వాయుధాల పరీక్షలను నిలిపివేసేందుకు ఉత్తర కొరియాపైన ఒత్తిడి తీసుకురావాలని చైనాను ట్రంప్ పలుమార్లు కోరారు. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ మంగళవారం ట్రంప్‌కు ఫోన్ చేసి తాజా పరిణామాలను తెలియచేశారు. కొరియా ద్వీపకల్పంలో దక్షిణ కొరియా, జపాన్‌లతో కలసి అమెరికా సైనిక విన్యాసాలు నిర్వహించడం, సియోల్‌లో అమెరికా సైనిక స్థావరాన్ని, థాడ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీంతో ఉత్తర కొరియా అణ్వస్త్ర దేశంగా తయారు కావాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు అది గత సంవత్సరం 6 అణ్వాయుధాలను ప్రయోగించింది. ట్రంప్ ఉత్తర కొరియాను ధ్వంసం చేస్తానని పలుమార్లు హెచ్చరించారు. ఉత్తర కొరియా నేత కిమ్ జాంగ్ ఉన్ అమెరికాలో ఏ ప్రాంతాన్నైనా తాము ధ్వంసం చేయగలమని ప్రకటించారు. అనంతరం ఐక్యరాజ్యసమితి అమెరికా ఒత్తిడి మేరకు ఉత్తర కొరియాపైన ఆంక్షలు విధించింది. తాజాగా రెండు కొరియాల మధ్య రెండు సార్లు చర్చలు జరగడంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు సడలిపోయాయి. సియోల్‌లో జరగనున్న వింటర్ ఒలంపిక్స్‌కు తమ క్రీడా బృందాన్ని పంపేందుకు ఉత్తర కొరియా అంగీకరించింది. ముందు ముందు రెండు కొరియాల మధ్య మరిన్ని సార్లు చర్చలు జరగగలవన్న ఆశాభావాన్ని దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్ ఇన్ ప్రకటించారు. తాజాగా 20 దేశాల నేతలు కెనడా రాజధాని వాంకోవర్‌లో సమావేశమై ఉత్తర కొరియాపై మరింత ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్‌కూడా పాల్గొన్నారు.




ఉ.కొరియాపై భేటీ..

వాంకోవర్ : ఉత్తరకొరియా సమస్యపైన 20 దేశాలు మంగళవారం ఇక్కడ సమావేశమయ్యాయి. ఉత్తరకొరియా అణ్వాయుధాల ఆకాంక్షను అదుపుచేసేందుకు దౌత్య, ఆర్థికపరమైన ఒత్తిళ్లు తీసుకురావాలని ఈ సమావేశం భావించింది. కెనడా ఈ సమావేశాన్ని నిర్వహించింది. అయితే రెండు కొరియాలమధ్య రెండుసార్లు చర్చలు జరిగి ఉద్రిక్తతలు సడలినందున ఉత్తరకొరియాలో సానుకూలమైన మార్పులు వచ్చినందున చైనా ఈ సమావేశానికి హాజరుకాలేదని తెలుస్తోంది. అంతర్జాతీయ సమాజం ఈ వ్యవహారాలను లోతుగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని సమావేశం కోరింది. దక్షిణకొరియాలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌కి తమ బృందాన్ని పంపేందుకు ఉత్తరకొరియా అంగీకరించింది. సమావేశం అనంతరం కెనడా విదేశాంగశాఖ డైరెక్టర్ బియన్‌హుక్ మాట్లాడుతూ అమెరికా విదేశాంగమంత్రి రెక్స్‌టిల్లర్సన్ కూడా పాల్గొన్నారని ఉత్తరకొరియా ప్రాంతంలో సముద్ర రవాణాకు భద్రతకల్పించే అంశాన్ని ఆయన పరిశీలిస్తారని చెప్పారు.

ఫిలిప్పీన్స్‌లో బద్దలైన అగ్నిపర్వతం

చూసేందుకు వస్తున్న యాత్రికులు

లిగాజ్పి : ఫిలిప్పీన్స్‌లో అగ్నిపర్వతం బద్దలై లావా వెదజల్లుతోంది. ఈ దృశ్యాలను చూసేందుకు యాత్రికులు భారీగా తరలివస్తున్నారని ఫిలిప్పీన్స్ ప్రభుత్వం తెలియ జేసింది. అయితే అగ్నిపర్వతంవల్ల అత్యంత ప్రమాదకరమైన పరిణామాలు ఉంటాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. సోమవారం రాత్రి మేయన్ అగ్నిపర్వతం వెదజల్లిన లావాతో ఆకాశమంతా ఎర్రగా మారిపోయింది. అగ్నిపర్వతం బద్దలైన పరిసర ప్రాంతాల్లోని ప్రజలంతా ఇళ్లు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు కోరారు. దీంతో వేలాదిమంది పౌరులు దూరప్రాంతాలకు తరలివెళ్లారు. అయితే యాత్రికులు మాత్రం 300కిపైగా కిలోమీటర్ల ప్రాంతంనుంచి కూడా అగ్నిపర్వతం దృశ్యాలను చూసేందుకు తరలివస్తున్నారు. కొద్దిదూరంలో నుంచొని ఫొటోలు తీసు కుంటున్నారు. లావా చిమ్మే ఎర్రటి దృశ్యాలు చూసేందుకు అద్భుతంగా ఉన్నాయని యాత్రికులు చెప్పారు. అయితే ఈ అగ్నిపర్వతం ఎప్పుడు తీవ్రరూపం దాలుస్తుందో ఎవరికీ తెలియదని అందువల్ల యాత్రికులు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. 2 లక్షలకుపైగా జనాభా కలిగిన లిగాజ్పి నగరం పరిసరాలన్నీ వ్యవసాయ భూములు. అగ్నిపర్వతం విరజిమ్మే లావా 2460 మీటర్ల నుంచి 7వేల 70 మీటర్ల ఎత్తువరకు వెళుతుందని అధికారులు పేర్కొన్నారు. ముందుగా నెమ్మదిగా ప్రారంభమైన లావా క్రమక్రమంగా పెరిగింది. ఇది గరిష్టస్థాయికి వెళ్లినప్పుడు 2 కి.మీ. ఎత్తు వరకు చేరుతుందని లావా ప్రభావాన్ని గురించి అధికారులు వివరించారు. ఇప్పటికే 30వేల మందికిపైగా పౌరులు ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోయారని ఇంకా మరికొంతమందిని ఖాళీ చేయిస్తున్నట్టుగా ప్రభుత్వం తెలిపింది.



లిబియా ఘర్షణలో 20 మంది మృతి



ట్రిపోలి : లిబియా రాజధాని ట్రిపోలీలో సోమవారం భీకరమైన ఘర్షణలు తలెత్తి కనీసం 20 మంది చనిపోయారు. ఘర్షణల ఫలితంగా అనేక విమానాలు దెబ్బతిన్నాయి. విమానాశ్రయాన్ని మూసివేశారు. విమానాశ్రాయానికి సమీపంలోవున్న జైలు నుంచి ఖైదీలు తప్పించుకుని వచ్చి ఈ ఘర్షణలు సృష్టించారని వారిని నివారించడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని తెలుస్తోంది. ట్రిపోలీలో అనేక నెలలుగా ఘర్షణలు జరుగుతున్నాయి. అంతిమంగా విమానాశ్రయంపైన ఖైదీలు దాడికి దిగారు. ట్రిపోలీ నగరమంతా తుపాకులమోత, పదాతిదళాల కవాతు శబ్దాలు మారుమ్రోగాయి. మిటిగ విమానాశ్రయంలో ఈ ఘర్షణ జరిగినందున విమానాశ్రయాన్ని మూసివేసినట్టుగా అధికారులు తెలిపారు. దేశంలో తిరిగే విమానాలతో సహా అంతర్జాతీయ విమానాలను కూడా రద్దు చేశారు. స్పెషల్ డిటరెన్స్ ఫోర్స్ (రాడా) ట్రిపోలీలో శక్తివంతమైన గ్రూపు. నగరంలోని మరో గ్రూపు తజౌరాకు రాడాకు మధ్య ఈ ఘర్షణ తలెత్తింది. విమానాశ్రయంలో రాడా నేరనిరోధక, టెర్రరిజం వ్యతిరేక శక్తిగా పనిచేస్తూ మిటిగా విమానాశ్రయాన్ని నియంత్రిస్తోంది. విమానాశ్రయానికి దగ్గరలోవున్న జైలులో ఖైదీలకు ఈ గ్రూపుకు మధ్య భీకరపోరాటం జరిగింది. ఫలితంగా 20 మంది చనిపోయారు.

పెత్తనం కోసమే...

(మొదటిపేజీ తరువాయి)

వహించేవారు ఉంటారు. వీరిని కేంద్రం నామినేట్ చేస్తుంది. డాక్టర్లు కేవలం ఐదుగురు మాత్రమే ఉంటారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖల ప్రతినిధులు, మానవ వనరుల అభివృద్ధి శాఖ, ఫార్మాస్యూటికల్స్ విభాగం ప్రతినిధులు, ఆరోగ్యం, సైన్స్ రంగాల నిపుణులు ఆర్థికవేత్తలను సభ్యులుగా నియమిస్తారు. ఎన్ఎంసీకి అవసరమైన సలహాలు ఇచ్చేందుకు మెడికల్ అడ్వైజరీ కౌన్సిల్ (ఎంఏసీ)ని ఏర్పాటు చేస్తారు. ఎన్ఎంసీకి రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు తెలియజేసేందుకు ఎంఏసీ వారధిగా ఉంటుంది. ఇందులోనూ ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంత సభ్యుడు ఉంటారు. ఎన్ఎంసీ చైర్మనే ఎంఏసీకి ఎక్స్ అఫిసియో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రైవేటు వైద్య కళాశాలలకు ప్రస్తుత నిబంధనల ప్రకారం సీట్లలో 15 శాతం ఫీజులను పెంచుకునే వెసులుబాటు ఉంది. అయితే ఎన్ఎంసీలో ఇది 60 శాతంగా ఉంది. ఇక ఎన్ఎంసీలో ఎన్ని ప్రైవేటు వైద్య కళాశాలలైనా ఏర్పాటు చేసుకోవచ్చు. ఐదేళ్ల తరువాత సబ్‌కమిటీ తనిఖీ చేస్తుంది. లోపాలు ఉంటే రూ.5 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు జరిమాన విధిస్తుంది. ఎంసీఐలో సీట్లను రద్దు చేస్తారు. ఇక ఆయుర్వేదం, హోమియోపతి వైద్యాన్ని అల్లోపతి వైద్య విధానం సరసన చేర్చనుండటంపై వివాదం ముదురుతోంది. ఆయుర్వేదం, హోమియోపతి, యోగా తదితర సంప్రదాయ చికిత్సలను అందిస్తున్న వైద్యులు ఒక బ్రిడ్జికోర్సు పూర్తి చేస్తే అల్లోపతి డాక్టర్‌గా అర్హత లభిస్తుంది. ఎంచక్కా సర్జరీలు చేయొచ్చు. ఇదివరకే ఈ బిల్లును కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

అవకతవకలకు ఆస్కారం

ఎంసీఐ స్థానంలో ఎన్ఎంసీ ఏర్పాటైతే వైద్యవృత్తిలో అవకతవకలు పెరిగే ప్రమాదం ఉంది. ఇష్టం వచ్చినట్లు మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఫీజులను కూడా పెంచుకోవచ్చు. లోపాలున్నా... వారు విధించే జరిమానా.. వీరు వసూలు చేసే ఫీజులకన్నా తక్కువే ఉంటుంది కాబట్టి ఎవరూ పట్టించుకునే అవకాశం ఉండదు. అదీగాక ఆయుర్వేదం, హోమియాపతి అంటే అసలు సర్జరీకి సంబంధం లేని వైద్య విధానాలు. మరి అలాంటి కోర్సు పూర్తి చేస్తే అల్లోపతి డాక్టర్‌గా అర్హత లభించే వారు ఎలా సర్జరీలు చేయగలరనేది ప్రశ్నార్థకం.

ఎంబీబీఎస్ తర్వాత మళ్లీ పరీక్ష

ఎన్ఎంసీలో మరో వివాదం ఉంది. ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు జాతీయ స్థాయిలో మరో అర్హత పరీక్ష (నేషన్ ఎగ్జిట్ టెస్ట్-నెక్ట్స్)ను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోతే వైద్య వృత్తి నిర్వహణకు కూడా అనర్హులుగానే పరిగణిస్తారు. ఈ పరిణామాలు వైద్య విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఐదున్నరేళ్లలో అనేక పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యాక మరో పరీక్ష ఎందుకు రాయాలని జూనియర్ డాక్టర్లు కేంద్రాన్ని నిలదీస్తున్నారు. ఇతర దేశాలలో వైద్య విద్య చదివి వచ్చిన వారికి మాత్రమే నిర్వహించే ఈ అర్హత పరీక్షను దేశంలోని వైద్య విద్యార్థులకు నిర్వహించాలనే నిర్ణయంలో ఉన్న ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండు చేస్తున్నారు. ఎంసీఐ నిబంధనల్లో విదేశాల్లో చదివిన వారికి ఇక్కడ వైద్యం చేయాలంటే అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. కానీ ఎన్ఎంసీ ఇందుకు విరుద్ధంగా ఉండటం విశేషం. కాగా, వైద్య కళాశాలలకు అనుమతులిచ్చి, విద్యా ప్రమాణాలను ఎంసీఐ పర్యవేక్షిస్తుంది. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం హెల్త్ యూనివర్సిటీ చూస్తుంది. వీటిలో లోపాలుంటే సవరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే.. కానీ వైద్య కళాశాలలో నాణ్యత లేదనే కారణంతో విద్యార్థులకు మరో పరీక్ష నిర్వహించాలనడం సరికాదని డాక్టర్లు మండిపడుతున్నారు. ఎంబీబీఎస్ సీటు రావాలంటే అంతకుముందు ఎంట్రెన్స్ రాయాలి. అనంతరం ఐదేళ్ల ఎంబీబీఎస్ కోర్సులో 16 సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఒక్కోదానికి మూడు ఇంటర్నల్ పరీక్షలుంటాయి. ఇవిగాకుం డా ఒక ప్రీ ఫైనల్, ప్రాక్టికల్స్‌తో పాటు తుది పరీక్షలుంటాయి. వీటన్నింటిలో ఉత్తీర్ణత సాధించాలి. సంవత్సరం చివరలో రాత పరీక్షతో పాటు విద్యార్థులు చదువుతున్న కాలేజీలోని ఇద్దరు ప్రొఫెసర్లు, వేరే రాష్ట్రానికి చెందిన కాలేజీల నుంచి వచ్చే మరో ఇద్దరు ప్రొఫెసర్లు విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షిస్తారు. ఐదో సంవత్సరం ఉత్తీర్ణత తర్వాత మరో సంవత్సరం హౌస్ సర్జన్ ఉంటుంది. ఈ విధంగా అనేక పరీక్షలు రాయాలి. ఇంత కఠినమైన పరీక్షలన్నీ రాసి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైతే మళ్లీ అర్హత పరీక్ష రాయాలనడం విద్యార్థులను మానసిక సంక్షోభానికి గురిచేయ డమేనని వైద్యనిపుణులు మండిపడుతున్నారు.

విద్యార్థులపై అదనపు భారం

ఎంబీబీఎస్ తరువాత మరో అర్హత పరీక్ష నిర్వహిస్తే విద్యార్థులపై అదనపు భారం పడుతుంది. ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉంది. ఎన్ఎంసీని రద్దు చేయాలి. ఈ విధానం డబ్బుతో కూడుకున్నదే కానీ విలువలతో కాదు. ఐదేళ్ల తరువాత తనిఖీలు అంటే అవకతవకలు జరుగుతాయి.

– డాక్టర్ జీ.శ్రీనివాస్, జూడా అసోసియేషన్ సలహాదారు

కోడే గెలిచింది

(మొదటిపేజీ తరువాయి)

రూ.500 కోట్లపైనే చేతులు మారగా, కృష్ణా, విశాఖపట్నం, విజయనగరం, ఇతర జిల్లాల్లో మరో రూ.250 కోట్లు చేతులు మారినట్లు అంచనా. ఇది కాకుండా పొట్టేల పందేలు, గుండాట, పేకాటలో మరో రూ.200 కోట్లపైగానే జూదం జరిగింది. ఇది కాక పందేల ప్రదేశాల్లో మద్యం ఏరులైపారింది. మద్యం షాపుల నిర్వాహకులే బరుల వద్ద మద్యం దుకాణాలు, ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేశారు. సంక్రాంతి మూడు రోజులలో కోట్లాది రూపాయల మద్యం అమ్మకాలు జరిగాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని మద్యం దుకాణాల ద్వారా రూ.10 కోట్లపైనే మద్యం అమ్మకాలు జరిగాయి. కోడి పందేల ముసుగులో పెద్ద బజార్, చిన్న బజార్, గుండాట మూడు ఆసులు, ఆరు కింగ్‌లుగా వర్ధిల్లింది. పందేలు చూసేందుకు వచ్చిన ఆబాల గోపాలం గుండాట, పేకాట ఆడారు. కాయ్ రాజా కాయ్ అంటూ జూద కేంద్రాల నిర్వహకులు యువతకు గాలం వేసి పెద్ద మొత్తంలో డబ్బును సొమ్ము చేసుకున్నారు. ఇదిలావుండగా, ముంద జాగ్రత్తగా పోలీసులు కోడి పందేలకు వెళుతున్న యువకులను, కోళ్లను అదుపులలోకి తీసుకోవటం గమనార్హం. ఇదిలావుండగా, చిత్తూరు జిల్లాల్లో జల్లికట్టు, అనంతపురం జిల్లాల్లో పందుల పోటీలు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో పొట్టేల పందేలు కూడా నిర్వహించారు.

తూర్పు గోదావరిలో 450 బరులు

రాష్ట్రంలోనే అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలో 450 బరులను ఏర్పాటు చేయగా, పశ్చిమ గోదావరిలో 200. కృష్ణాలో వంద బరులను ఏర్పాటు చేశారు. చట్టాన్ని గౌరవిస్తామంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలే స్వయంగా కోడి పందేలను ప్రారంభించారు. వారున్న పావు గంటసేపు డింకీ పందేలు వేయగా, ఆ తర్వాత నుంచి కోళ్లకు కత్తులు కట్టి మరీ పందేలు నిర్వహించారు. పండక్కి పక్షం రోజుల ముందు నుంచి పందేలపై నానా హడావుడి చేసిన పోలీసులు పందెపు బరుల సమీప ప్రాంతాల్లో ఎక్కడా కనిపించకపోవటం గమనార్హం. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ ఏకంగా పందేల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. కాని ఆ జిల్లాల్లో భారీగా పందేలు జరిగాయి. కొప్పాక, శ్రీరామవరం, అయి భీమవరం, భీమవరం, తేతలి, సీసలి, తాడేపల్లిగూడెం, వెంప, కలగంపూడి, పూలపల్లి, మహదేవపట్నం, పెనుమంత్ర, మార్టేరు, భీమడోలు, గుండుగొలను తదితర ప్రాంతాల్లో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల విలువైన పందేలు సాగాయి. తూర్పు గోదావరి జిల్లాల్లో మురమళ్ల, రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, రావులపాలెం, కాకినాడ తదితర ప్రాంతాల్లోనూ, కృష్ణాజిల్లా విజయవాడ సమీపంలోని ఈడ్పుగల్లు, గొడవర్రు, నూజివీడు, కొత్తూరు తాడేపల్లి, హనుమాన్‌జంక్షన్, అంపాపురం, శోభనాద్రిపురం, చాట్రాయి, కైకలూరు, గుడివాడతోపాటు విజయవాడ నగరంలోని భవానీపురంలోనూ భారీగా కోడి పందేలు నిర్వహించారు. అటు ఉత్తరాంధ్రలో విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోనూ భారీగా కోడి పందేలు నిర్వహించారు. పలు పందేలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై పందేలను తిలకించారు. దక్షిణ భారతదేశంలో కోడి పందేలకు ఆంధ్రప్రదేశ్ పెట్టింది పేరు. దీంతో దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలు ఎక్కడున్నా సంక్రాంతికి మాత్రం సొంతూళ్లకు వచ్చేస్తారు. రాష్ట్రంలో నిర్వహించిన కోడి పందేలకు విదేశాల్లో ఉన్న వారితోపాటు కర్నాటక, తమిళనాడు, తెలంగాణాకు చెందిన పందెపురాయుళ్లు తరలివచ్చారు.

మేమేం తీసిపోం

అన్నింటిలోనూ సగభాగంగా ఉన్న తామేం తీసిపోలేదంటూ మహిళలుసైతం కోడి పందేలలో పాల్గొటం గమనార్హం. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జరిగిన కోడి పందేలకు మహిళలకు అధిక సంఖ్యలో హాజరై స్వయంగా పందేలు నిర్వహించారు. వారే స్వయంగ పందేలు కాసి ఎంజాయ్ చేశారు. సంక్రాంతికి సంప్రదాయబద్ధంగా కోడి పందేలు వేస్తారని, వాటిలో తామూ పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందని పలువురు పేర్కొనటం విశేషం. మహిళలతోపాటు యువతులుసైతం రెట్టించిన ఉత్సాహంతో పందేల్లో పాల్గొన్నారు. విదేశాల నుంచి వచ్చిన వారుసైతం కోర్టు తీర్పును గౌరవిస్తామంటూ కోళ్లకు కత్తులు కట్టి మరీ పందేలు నిర్వహించటం గమనార్హం.

కార్లన్నీ పందేలకే...

ఎక్కడెక్కడి నుంచో వచ్చిన ఖరీదైన కార్లన్నీ పందేలు జరిగే బరుల వద్దకే దారులు తీశాయి. బరుల ప్రదేశాలలో వేల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలను పార్కింగ్ చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ముందుగానే లాడ్జిలు, హోటళ్లను బుక్ చేసుకున్నారు. దీంతో ఉభయ గోదావరి జిల్లాల్లో లాడ్జిలు, హోటళ్లతోపాటు తాత్కాలిక ఏర్పాట్లతో తోటలు కిక్కిరిసిపోయాయి. ఏలూరు, రాజమహేంద్రవరం, కాకినాడ జాతీయ రహదారులపై కార్లు రయ్ రయ్ మంటూ పరుగులు పెట్టాయి.

పందేలకు చట్టబద్ధత కల్పించాలి : ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

జల్లికట్టు తరహాలో కోడి పందేలకు కూడా చట్టబద్ధత కల్పించాలని కంకిపాడు మండలం గొడవర్రులో టీడీపీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ కోరారు. కోడి పందేలను ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడుతూ, తమిళనాడులో జల్లికట్టుకు ఎలా ఆర్డినెన్స్ తెచ్చారో, అలాగే సంక్రాంతి పండుగ సమయంలో పందేలకు అనుమతి ఇచ్చేందుకు ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

అవినీతి ఫిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)



నిర్మిస్తోంది. ఈ పథక నిర్మాణానికి దాదాపు రూ.1600 కోట్లు ఖర్చుకానుంది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథక నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సంబంధించి తమకు అన్యాయం జరుగుతుందంటూ రాజమండ్రికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ జె.చౌదరయ్య ప్రధానమంత్రికి పోలవరం నిర్మాణంలో భారీ అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఈ నెల 3న ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుకు ప్రధానమంత్రి కార్యాలయం వెంటనే స్పందించి పోలవరం పరియోజన మండలిని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన తమకు న్యాయం జరగలేదంటూ రైతులు పోరాటం ప్రారంభించారు. ఈ పథకానికి భూములిచ్చిన రైతులకు ఎకరాకు రూ.28లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. తమకు ఆ ధర కన్నా ఎక్కువ చెల్లించాలని కొందరు రైతులు కోర్టులను ఆశ్రయిస్తే వారికి రూ.17లక్షలే వస్తాయని ప్రస్తుతం ప్రభుత్వం చెప్తుంది. దీనికి తోడు పోలవరానికి పర్యావరణ అనుమతులపై ఆ రైతులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తే ఈ ప్రాజెక్ట్‌కు ఎలాంటి అనుమతులు లేవని సంబంధితశాఖలు తేల్చాయి. పురుషోత్తమపట్నం, ఎత్తిపోతల పథకం, పోలవరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఆ పథకానికి, పోలవరానికి సంబంధం లేదని కేంద్ర జలవనరులమండలి (సీడబ్ల్యూసీ) రైతులకు సమాధానమిచ్చింది. ఇలా పురుషోత్తమపట్నం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సంస్థలు చెప్తున్న భిన్న వివరణలతో భూములు కోల్పోయిన రైతులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ప్రధానమంత్రికి ఫిర్యాదు చేశారు. ప్రధాని కార్యాలయం స్పందించింది.

పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం వల్ల ఉత్తరాంధ్రకు మేలు జరగడం సంగతి పక్కనపెడితే పోలవరం ప్రాజెక్ట్‌లో భారీ అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుకు ప్రధానమంత్రి కార్యాలయం అంతగా స్పందించడంతో టీడీపీ, బీజేపీల స్నేహసంబంధాలపై నీలి నీడలు కమ్ముకుంటాయా ? ఇటీవల రెండు పార్టీల స్నేహసంబంధాలలో లుకలుకలు ఏర్పడ్డాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నది తెలిసిందే. ప్రధానమంత్రి కార్యాలయం రాసిన లేఖ సంక్రాంతి సెలవులవల్ల ఇంకా ప్రభుత్వ పెద్దలకు తెలియక పోవచ్చని భావిస్తున్నారు. ఈ లేఖ అందిన తర్వాత ఇరిగేషన్‌శాఖ చీఫ్ ఇంజనీర్ ఏం సమాధానం ఇస్తారో చూడాల్సి ఉంది.

ఎన్‌కౌంటర్ చేస్తారేమో..

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత నుంచి కనిపించకుండా పోయారు. పాత కేసులో ఆయనను అరెస్టు చేసేందుకు రాజస్థాన్ పోలీసులు ఆయన కార్యాలయానికి వచ్చారు. రాజస్థాన్ పోలీసులే తొగాడియాను అరెస్టు చేసి ఉండొచ్చని వీహెచ్‌పీ కార్యకర్తలు ఆందోళన జరిపారు. అయితే తొగిడియాను తాము అరెస్టు చేయలేదని రాజస్థాన్ పోలీసులు తెలిపారు. రక్తపోటుతో బాధపడుతున్న తొగాడియా తన కార్యాలయం నుంచి అదృశ్యమైన తర్వాత షాహిబాగ్ ఏరియాలో స్పృహలేని స్థితిలో కనిపించడంతో అదే ఏరియాలోని చంద్రమణి ఆసుపత్రికి ఆయనను తరలించారు.

ఎన్‌కౌంటర్ ఆరోపణపై దర్యాప్తు జరిపించండి : నిరుపమ్

దీనిపై కాంగ్రెస్ నాయకుడు నిరుపమ్ స్పందిస్తూ మా మధ్య భావ వైరుధ్యాలు ఉన్నాయని, అయితే ఆయనను ఎన్‌కౌంటర్ చేసి చంపుతా మన్న విషయంపై మానవతా దృక్పథంతో వ్యవహరిస్తామన్నారు. తొగాడి యా అపాయంలో పడ్డారని, దీనికి కారణం ఏమై ఉంటుందని జెడ్‌ప్లస్ సెక్యూరిటీతో ఉండే ఆయన అపస్మారక స్థితిలో ఒక పార్కులో పడి ఉండటమేమిటని కాంగ్రెస్ నాయకుడు నిరుపమ్ సూటిగా ప్రశ్నించారు. 30-40 ఏళ్ల నుంచి హిందూతత్వం ప్రమాదంలో పడిందని చెబుతుండే మాజీ ఎంపీ తొగాడియాను ఎవరు చంపాలనుకున్నారనే విషయంపై దర్యాప్తు జరగాలన్నారు. పదేళ్లనాటి కేసులో అరెస్టు చేయడానికి రాజస్థాన్‌పోలీసులు రాగా సోమవారం ఉదయం అదృశ్యమైన తొగాడియా అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో ఉన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కాగానే రాజస్థాన్ కోర్టులో లొంగిపోతానని తొగాడియా వెల్లడించారు.

పరిష్కారానికి కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

విలేకరులతో మాట్లాడిన కేకే వేణుగోపాల్ 'ఈ సమస్య ఇంకా సర్దుమణగలేదు. మరో రెండు, మూడు రోజుల్లో ఇది పూర్తిగా పరిష్కారమవుతుందని ఆశిద్దాం' అని అన్నారు. సీజేఐతోగానీ నలుగురు అసంతృప్త న్యాయమూర్తులతోగానీ తాను భేటీ కాలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇదిలావుండగా, సుప్రీంకోర్టులో ఎలాంటి సంక్షోభం లేదని, త్వరలోనే సాధారణ పరిస్థితి నెలకొంటుందని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) పేర్కొంది. బీసీఐ చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఏడుగురు సభ్యుల బృందం అసంతృప్త న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ రంజన్ గొగోయ్‌తో సమావేశమైనట్టు తెలిపారు. ఈ సంక్షోభం పరిష్కారమైందని, వివాదమేమీ లేదని ఆయనన్నట్టు చెప్పారు. మీడియా ఏ ఆధారాల నేపథ్యంలో ఈ సమస్య సర్దుమణగలేదని చెబుతోందో తనకు తెలియదని, ఈ పరిస్థితిని మరింత జటిలతరం చేయడం తగదన్నారు. సంక్షోభమేమీ లేదని మనస్పర్థ మాత్రమేనన్నారు. తాను జస్టిస్ ఎంబీ లోకుర్‌తో కూడా అయినట్టు తెలిపారు. ఆయన కూడా సంక్షోభ పరిస్థితి లేదని చెప్పారన్నారు. అటర్నీ జనరల్ మరో రెండు, మూడు రోజులు పడుతుందని ఎందుకు అన్నారో తనకు తెలియదు' అని మన్నన్ బదులిచ్చారు. జడ్జీలందరూ తమ విధులకు హాజరవుతున్నారని, సుప్రీంకోర్టు కార్యకలాపాలు యథావిధిగా సాగుతున్నాయని తెలిపారు. ఇక ప్రజల్లోకి వచ్చే విషయాలేమీ లేవని, అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, ఎలాంటి సంక్షోభం లేదని ఆయన స్పష్టంచేశారు. కాగా, కీలక కేసులను పరిశీలించడానికి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఐదుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బెంచ్‌లో ఈ నలుగురు అసంతృప్త న్యాయమూర్తులకు చోటు దక్కలేదు. ఆ బెంచ్‌లో దీపక్ మిశ్రతో పాటు న్యాయమూ ర్తులు ఏకే సిక్రి, ఏఎం ఖన్‌విల్కర్, డీవై చంద్రచూడ్, అశోక్ భూషణ్‌లున్నారు. కాగా ఈరోజు వివాదం ఇంకా ముగియలేదని అటార్నీ జనరల్ వెల్లడించడం గమనార్హం.

22న అమ్మకు వందనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22న 'అమ్మకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టరు నుంచి 13 జిల్లాల డీఈవోలకు ఆదేశాలు అందాయి. ఈ కార్యక్రమం నిర్వహణ నిమిత్తం రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల ఖాతాలో రూ.2,500 చొప్పున జమ చేశారు. అమ్మకు వందనంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయుల నడుమ పాఠశాలల్లో విద్యార్థులతో వారి తల్లులకు వందనం చేయిస్తారు. తల్లి విశిష్టతను, గొప్పతనాన్ని, త్యాగాన్ని, విభిన్న రూపాలను విద్యార్థులకు విశ్లేషిస్తారు. సృష్టికి తల్లి మూలమని, ఆమె దైవంతో సమానమని బోధిస్తారు. విద్యార్థులతో తల్లిని సన్మానిస్తారు. తల్లి-విద్యార్థుల విశిష్టతను పిల్లలందరికీ తెలుపుతారు. ఇప్పటివరకూ ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలకూ నిర్వహించడం గమనార్హం. వసంత పంచమి రోజున పురస్కరించుకుని ప్రభుత్వం అమ్మకు వందనాన్ని తలపెట్టింది. ఇది మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

బీఎస్ఎన్ఎల్ మొబైల్ నంబరుకు ఆధార్ అనుసంధానం

చీఫ్ జనరల్ మేనేజర్ ఏ.పూర్ణచంద్రరావు


విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీఎస్ ఎన్ఎల్ మొబైల్ వినియోగదారుల మొబైల్ నంబరును ఆధార్‌కు అనుసంధానం చేసే సౌకర్యాన్ని కల్పించామని సంస్థ ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ ఏ.పూర్ణచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొబైల్ వినియోగదారుడు 14546కు డయల్‌చేసి ఐవీఆర్ఎస్ ద్వారా ఆధార్ సంఖ్యను టైప్ చేసినట్లయితే ఒక ఓటీపీ(ఒన్‌టైం పాస్‌వర్డు) వస్తుందని వివరించారు. ఈ ఓటీపీని తిరిగి వెనువెంటనే టైప్‌చేస్తే ఆధార్ అనుసంధాన ప్రక్రియ అయిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి 22వరకూ బీఎస్ఎన్ఎల్ మార్కెటింగ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త కనెక్షన్ తీసుకున్న వారికి ఉచిత సిమ్ సదుపయాన్ని కల్పించామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రధాని భేటీతో ఏమి సాధించారు బాబూ : వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాధించింది ఏమీలేదని, సంకీర్ణ ప్రభుత్వంలో కనీసం కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లు కూడా చంద్రబాబుకు దొరకడం లేదని వైసీపీ ఎమ్మెల్యే, పీఏసి చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబుకు కేంద్రం అపాయింట్‌మెంట్లు ఎందుకు ఇవ్వడం లేదని, దీనికి వెనకవున్న మర్మమేమిటో చెప్పాలని ప్రశ్నించారు. యేడాది పాటు ప్రధాని అపాయింట్‌మెంట్ కూడా దొరకకపోవడం, కేంద్ర మంత్రి గట్కారీ కోసం ఆయన ఎక్కడికి వెళితే అక్కడికి ప్రత్యేక విమానాల్లో వెళ్లడం ఏమిటంటూ చంద్రబాబును నిలదీశారు. ప్రజలను నాలుగేళ్లుగా మభ్యపెడుతూ నాలుగు తాత్కాలిక భవనాలు కట్టడం తప్ప సాధించింది ఏమిటంటూ విమర్శించారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో మంగళవారం సాయంత్రం పత్రికల వారితో మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని చంద్రబాబు తీవ్రంగా దెబ్బతీస్తున్నారన్నారు. పోలవరం విషయంలో ఇంకా క్లారిటీ రాలేదన్నారు. విశాఖకు ప్రత్యేకజోన్, గుంటూరు-తెనాలి, మంగళగిరి మెట్రోరైల్, వైజాగ్-చెన్నై కారిడార్‌ల హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, దుగ్గిరాజ పట్నం పోర్టు, అమరావతి నిర్మాణం, పోలవరం ఇలా ఒక్కటి కూడా చంద్రబాబు సాధించలేకపోయారని విమర్శించారు. నాలుగేళ్ల తరువాత చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి ప్రధానికి వినతిపత్రం ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. ప్రధాని భేటీలో చంద్రబాబు సాధించింది ఏమిటంటూ ప్రశ్నించారు. రాజధాని నిర్మాణానికి నిధులు ఏమయ్యాయని, రెవెన్యూలోటు భర్తీ సంగతి ఏమిటని బుగ్గన ప్రశ్నించారు. శాసనసభ సీట్ల పెంపుపై మాత్రమే చంద్రబాబుకు ప్రేమ ఉందంటూ ఎద్దేవా చేశారు. 225 సీట్లకు పెంచాలని ప్రధానిని పదే పదే కోరడం తప్ప చంద్రబాబు చేస్తున్నది ఏమిటంటూ ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తన తీరును మార్చుకొని రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోతే ప్రజల ఆగ్రహానికి కొట్టుకుపోవడం ఖాయమని బుగ్గన హెచ్చరించారు.

ఆర్‌డీఎస్ సానుకూలమైతే..

'గుండ్రేవుల'కు లైన్‌క్లియర్



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : మూడు రాష్ట్రాల జలవనరులశాఖ మంత్రులు సానుకూలంగా వ్యవహరిస్తే, తుంగభద్ర నదిపై దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి మార్గం సుగమం అయ్యే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మించాలని గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం రూ.2,500 కోట్లతో ప్రభుత్వం అంచనాలను కూడా రూపొందించింది. తుంగభద్రపై నిర్మించనున్న ఈ రిజర్వాయర్‌కు తెలంగాణా నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు ప్రభుత్వం చెప్పుకొస్తోంది. ఈ నేపథ్యంలో తుంగభద్రపైనే ఉన్న రాజోలి బండ డైవర్షన్ పథకం (ఆర్‌డీఎస్) ఆధునికీకరణపై చర్చించేందుకు తెలంగాణా రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీష్‌రావు, ఏపీ జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు మంగళవారం లేఖ రాశారు. ఆర్‌డీఎస్‌పై కర్నాటక సానుకూలంగానే ఉందని, ఏపీ కూడా మూడు రాష్ట్రాల ఆయకట్టుదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సహకరించాలని ఆయన లేఖలో కోరారు. మూడు రాష్ట్రాల మంత్రుల సమావేశం నిర్వహణపై రెండు మూడు రోజులలో తేదీలను ఖరారు చేయాలని కోరారు. ఆర్‌డీఎస్‌పై మూడు రాష్ట్రాల మంత్రుల సమావేశం జరిగితే, గుండ్రేవుల సమస్యకు కూడా పరిష్కారం లభించే అవకాశం ఉందని కర్నూలు, కడప జిల్లా రైతులు భావిస్తున్నారు. కర్నూలు, కడప (కేసీ) కెనాల్‌కు 29.90 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు బచావత్ కమిషన్ అనుమతించింది. తుంగభద్ర నదిపైనే ఆర్‌డీఎస్‌కు దిగువన గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మించేందుకు ఉమ్మడి రాష్ట్రంలోనే నిర్ణయించారు. తెలంగాణాలోని మహబూబ్‌నగర్, ఏపీలోని కర్నూలు, కడపతోపాటు కర్నాటకలోని ఒక గ్రామానికి సాగు, తాగునీటి సమస్యను ఈ రిజర్వాయర్ ద్వారా తీర్చే అవకాశం ఉంది. 2009లో వచ్చిన భారీ వరదకు తెలంగాణా ప్రాంతంలో ఉన్న నాలుగు గ్రామాలతోపాటు 2,371 హెక్టార్ల ఆయకట్టు, ఏపీలోని 11 గ్రామాలతోపాటు 4,464 హెక్టార్ల ఆయకట్టు ముంపునకు గురైంది. ఈ నేపథ్యంలో వరద ముంపు నివారణతోపాటు 2.65 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు తుంగభద్రపై గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రస్తుతం కేసీ కెనాల్ ఆయకట్టు కింద సాగులో ఉన్న 1.50 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేసేందుకు జలవనరులశాఖ నానా తంటాలు పడుతోంది. అదే గుండ్రేవుల నిర్మాణం జరిగితే ఈ సమస్య ఉండదని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం జరిగితే అది భారీ వరదల సమయంలో శ్రీశైలం డ్యామ్‌కు రక్షణగా ఉంటుందని జలవనరులశాఖ ఇంజనీర్లు చెబుతున్నారు. ఆర్‌డీఎస్ ఆధునికీకరణకు మూడు రాష్ట్రాలు అంగీకరిస్తే, దానికి దిగువనే ఉన్న గుండ్రేవులకు కూడా మార్గం సుగమం అవుతుందనేది ఇంజనీర్ల అభిప్రాయం. ప్రధానంగా తెలంగాణా, ఏపీ మధ్యే దీనిపై చర్చలు జరగాల్సి ఉంది. అయితే ఆర్‌డీఎస్‌పై తెలంగాణా నుంచే రాష్ట్రానికి ఆహ్వానం అందిన నేపథ్యంలో మూడు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చేందుకు ఇదే సరైన సమయమని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే రూ.2,500 కోట్ల వ్యయంతో డీపీఆర్ సిద్ధంగా ఉందని, నిర్మాణానికి మూడు రాష్ట్రాలు అంగీకరిస్తే రెండేళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందంటున్నారు. తెలంగాణా మంత్రి హరీశరావు లేఖపై రాష్ట్ర ప్రభుత్వం ఏమేరకు స్పందిస్తుందో మరి.

దేవినేని ఉమకు హరీష్‌లేఖ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆధునీకరణ, హెడ్‌వర్క్స్ (ప్యాకేజీ-1) పనులకు సంబంధించి చర్చించేందుకు హైదరాబాద్‌కు రావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు లేఖ రాశారు. తమకు అనుకూలంగా ఉన్న రెండు తేదీలను సూచించాలని కూడా ఆ లేఖలో హరీష్ కోరారు. ఈ నెల 4వ తేదీన కర్నాటక నీటిపారుదల శాఖ మంత్రి ఎంబి.పాటిల్ హైదరాబాద్‌కు విచ్చేసి హరీష్‌రావుతో ఆర్డీఎస్‌పై చర్చలు జరిపిన విషయం తెలిసిందే. మూడు రాష్ట్రాలకు సంబంధించిన ఈ అంశంపై మూడు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులు సమావేశమైతే సమస్యలు పరిష్కరించుకోవడం సులువవుతుందని ఆ సందర్భంగా పాటిల్ సూచించారు. త్రైపాక్షిక సమావేశానికి సంబంధించిన అంశంపై త్వరలోనే ఎపి మంత్రి ఉమామహేశ్వరరావుకు లేఖ రాస్తానని పాటిల్‌కు హరీష్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ యేడాది జూలై నాటికి ఆర్డీఎస్ పనులు పూర్తికావాల్సి ఉంది. ఈ పూర్వరంగంలో త్రైపాక్షిక సమావేశానికి సంబంధించి అనుకూలమైన తేదీలను సూచించాలని హరీష్ ఆ లేఖలో ఉమామహేశ్వరరావును కోరారు. అలాగే సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించుకుందామని, సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆయన ఆ లేఖ ద్వారా ఆహ్వానించారు.

రాష్ట్ర పర్యాటకశాఖకు 'పట్వా' అంతర్జాతీయ అవార్డు

మార్చి 9న బెర్లిన్‌లో ప్రదానం
అందుకోనున్న పర్యాటకశాఖ కార్యదర్శి మీనా

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్ర పర్యాటకశాఖకు అవార్డుల పరంపర కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 13 జిల్లాల పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు ఇప్పటికే ఫలితాలిస్తుండటంతో పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పర్యాటక శాఖకు అవార్డులు అందిస్తున్నాయి. పసిఫిక్ ప్రాంత పర్యాటక రచయితల సంఘం (పట్వా) తాజాగా రాష్ట్ర పర్యాటకశాఖకు అంతర్జాతీయ అవార్డును ప్రకటించింది. మార్చి తొమ్మిదో తేదీన బెర్లిన్‌లో ఈ అవార్డు ప్రదానోత్సవం జరగనుంది. సాగరతీర పర్యాటకానికి పట్వా ఈ అవార్డును ప్రకటించింది. బెర్లిన్‌లో జరిగే అవార్డు ప్రదానోత్సవానికి హాజరుకావాలంటూ పట్వా ప్రధాన కార్యదర్శి సాగర్ అహ్లూవాలియా రాష్ట్ర పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాకు ఆహ్వానం అందింది. అవార్డు ప్రదానోత్సవాన్ని పురస్కరించుకుని బెర్లిన్ వేదికగా ప్రపంచ పర్యాటకం, ఏవియేషన్ లీడర్స్ సమ్మిట్ తోపాటు సుస్థిర పర్యాటకం అనే అంశంపై అంతర్జాతీయస్థాయి సదస్సు కూడా జరగనుంది. ఆ సదస్సులో రాష్ట్ర పర్యాటకశాఖ అధికారులు భాగస్వామ్యం కానున్నారు.

సూర్యకాంతం మృతికి ఏపీ ప్రజానాట్యమండలి సంతాపం

విశాలాంధ్ర - ఒంగోలు : తొలితరం ప్రజానాట్యమండలి కళాకారిణి భూపతి రాజు సూర్యకాంతం మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గని, చంద్రనాయక్‌లు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 1943-48 ప్రాంతంలో సూర్యకాంతం బాలనటిగా ప్రజానాట్యమండలి ప్రదర్శనలలో చురుకుగా పాల్గొనేవారు అన్నారు, డాక్టర్ గరికపాటి రాజారావు, మిక్కిలినేని నాయకత్వంలో మా భూమి, ముందడుగు నాటకాలలో రాష్ట్రం టీంలో నటించే వారన్నారు, మాభూమిలో హీరో చెల్లెలిగా ఆమె మెప్పించారని, ఆయా రోజులలో స్త్రీ పాత్రలు పోషించే కళాకారులను వారి కళాకారుల కుటుంబ సభ్యుల ఇళ్ల నుంచే తీసుకునేవారన్నారు, ఆ తర్వాత కాలంలో భూపతిరాజు సుబ్బరాజుతో వివాహం అయిన అనంతరం ఆమె పార్టీ కార్యక్రమాలలో ,మహిళా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు, 1974లో ప్రజానాట్యమండలి పునర్నిర్మాణంలో జరిగిన విజయవాడ సభలో ఆమె పాత కళాకారులతో పాటు హాజరయ్యారన్నారు. ఆమెను కలిసిన ప్రతిసారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రజానాట్య మండలి గొప్పతనాన్ని, ప్రజా కళల గొప్పతనాన్ని చెప్తూ కళాకారులను ఉత్సాహ పరిచే వారన్నారు, ప్రజాఉద్యమాల్లో ఆమె లేని లోటు తీర్చలేనిదని వారు వెల్లడించారు.

19న చంద్ర పుల్లారెడ్డి శత జయంతి సభ



విశాలాంధ్రబ్యూరో-అమరావతి: భారత విప్లవోద్యమ అగ్రనాయకులు అమరజీవి చంద్ర పుల్లారెడ్డి శత జయంతి ముగింపు సభ ఈనెల 19వ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగనున్నట్లు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి కూరపాటి రామారావు తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుల్లారెడ్డి తన బాల్యదశ నుండే పాఠశాల తరగతి గదుల్లో దళిత విద్యార్థుల పట్ల జరుగుతున్న అస్పృశ్యతను నిరశించారని గుర్తు చేశారు. కమ్యూనిస్టుపార్టీ అగ్రనేతలు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహానేతల పరిచయంతో నాయకుడిగా ఎదిగారని, తర్వాత ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి జైలు జీవితాన్ని గడిపారన్నారు. 1952 ఎన్నికల్లో నందికొట్కూరు నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ సైద్ధాంతిక చీలికల ఫలితంగా సీపీఐ ఎంఎల్ ఏర్పాటు చేసి ప్రతిఘటనా పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. విప్లవకారుల ఐక్యతకు విశేష కృషి చేసిన పుల్లారెడ్డి శత జయంతి సభ ఈనెల 19న హైదరాబాద్‌లో జరుగనున్నదని, ఈ కార్యక్రమానికి ఉద్యమకారులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎల్‌వీ కుటుంబరావు, పి.వెంకటేష్, కనకరావు, జే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల కనుసన్నల్లో జూదశాలలు

- అక్రమ సంపాదనకు తెర
- పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ప్రజల బలహీనతలైన కోడిపందేల పేరుతో కార్పొరేట్ స్థాయిలో జూదశాలలను తెరచి, కోట్లాది రూపాయల అక్రమ సంపాదనకు తెరతీశారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్వంటీ ట్వంటీ క్రికెట్ మ్యాచ్‌ల తరహాగా ఫ్లడ్‌లైట్లు పెట్టి కోడిపందేలకు కార్పొరేట్ లుక్ తీసుకొచ్చారని మండిపడ్డారు. సంక్రాంతి పండుగలో ముగ్గులు, ఎడ్ల పందాలు, కోడి పందేలు అనేవి సంప్రదాయంగా వస్తున్నాయని, అవి ఆయా పల్లెల్లో రైతులు వారి స్తోమతకు తగట్లు వాటిని నిర్వహించుకునేవారని తెలిపారు. హైకోర్టు ఆదేశాల్ని దిక్కరిస్తూ టీడీపీ నేతలు జూదశాలలుగా మార్చారని విమర్శించారు. జూద క్రీడలైన పేకాట, గుండాట, మద్యం షాపులు, బిర్యానీ పాయింట్లు పెట్టి స్టాళ్లను వాటి వేలం ద్వారా కోట్లాది రూపాయలకు విక్రయించారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, డీప్యూటీ సీఎం చినరాజప్పల లోపాయుకారిక ఆదేశాలతోనే పచ్చ చొక్కాల నేతలు బరితెగించి ఆడుతున్నారని విమర్శించారు. జూదాలను అరికట్టాల్సిన పోలీసులు చట్టం అమలు చేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా కోసం ప్రదర్శన చేద్దామని విశాఖకు వస్తే ఎయిర్‌పోర్టు దగ్గర వేలాది మంది పోలీసులు వచ్చి అడ్డుకున్నారని గుర్తుచేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగు తున్నప్పటికీ పోలీసులు ఎందుకు స్పందించట్లేదని , 13 జిల్లాల్లో ఎస్పీలు, అర్బన్ పోలీసు అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కోర్టు ఆదేశా లను గౌరవించి వాటిని అమలు చేయించే ధైర్యం పోలీసు లకు లేదా అని మండిపడ్డారు. చట్టాలను ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబటి డిమాండు చేశారు.

గ్రూప్-1 మౌఖిక పరీక్షలకు రంగం సిద్ధం

18మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నియామకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రూప్-1 మౌఖిక పరీక్షల్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్(ఏపీపీఎస్సీ) సన్నద్ధమైంది. ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 20వరకూ కొనసాగబోయే ఇంటర్వ్యూలకు రాష్ట్రానికి చెందిన 18 మంది ఉన్నతాధికారులను నియమించారు. ఐఏఎస్ అధికారులు ఆర్.కార్తికాయ్ వలావెన్, డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, జి.అనంత రాము, కె.ప్రవీణ్‌కుమార్, రామ్ ప్రకాష్ సిసోడియా, బి.రాజశేఖర్, వై.వి.అనురాధ, బి.ఉదయ లక్ష్మి, బి.రామాంజనేయులు, కె.సునీతలను బోర్డు నియమించింది. ఐపీఎస్‌ల నుంచి టీవి.త్రిపాఠి, ఎన్.వి.సురేంద్రబాబు, ఎ.ఆర్.అనురాధా, సిహెచ్.ద్వారకా తిరుమలరావు, అంజన సిన్హా, మాదిరెడ్డి ప్రతాప్, మహ్మద్ ఆశ్వన్ రెజ్వా, హరీష్‌కుమార్ గుప్తాలను నియమించింది. ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-1(18/2011 జనరల్ నోటిఫికేషన్)కు ఇంటర్వ్యూలకు షెడ్యూలును కమిషన్ కార్యాలయం వెల్లడించిన విషయం విదితమే. విజయవాడ బందరు రోడ్డులోని (ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం ఎదుట) గల ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూలను అధికారులు నిర్వహిస్తారు. 2011కు సంబంధించిన గ్రూప్-1నోటిఫికేషన్‌లో భాగంగా మెయిన్ పరీక్షలపై అనేక అభ్యంతరాలు నెలకొన్నాయి. దీంతో అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం రెండో విడత మెయిన్ పరీక్షలను నిర్వహించింది.

ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

విశాలాంధ్ర-డోన్ రూరల్ (కర్నూలు): మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మంగళవారం ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. గ్రామానికి చెందిన మనోజ్ (10), మనోహర్ (10) ఇరువురు బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు కుంటలో జారిపడి మృతిచెందారు. చిన్నారులు ఇంటికి ఎంత సేపటికి రాకపోవడంతో గ్రామంలో వారిని వెతకడం ఆరంభించిన తల్లి దండ్రులు చివరకు రూరల్ ఎస్సై రామసుబ్బయ్యకు ఫిర్యాదు చేయడంతో గ్రామంలో తనిఖీ చేయగా నీటి కుంటలో ఉన్న మృతదేహాలను కనుగొన్నారు. బాధి తులకు ఎస్సై రామసుబ్బయ్య ఆర్థికసాయం : యర్రగుంట్ల గ్రామంలో మృతిచెందిన చిన్నారుల కుటుంబాలకు డోన్ రూరల్ ఎస్సై ఆర్థిక సాయం అందించారు. బాలల అంత్య క్రియలకు గాను వారి కుటుంబీకులైన వెంకటేశ్వరమ్మ, మహన్‌శంకర్‌లకు 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించి దాతృత్వాన్ని చాటారు.



హేతువాద సాహిత్యంలో త్రిపురనేని విశేష కృషి

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: దళితుల అణచివేత, అస్పృశ్యత, మూఢ నమ్మకాలను ఎండగడుతూ హేతువాద సాహిత్యం ద్వారా కవిరాజు త్రిపురనేని రామస్వామి చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి 131వ జయంతి, 75వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలోని విగ్రహం వద్ద నాస్తిక సమాజం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సమస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాసాహితి పత్రిక సంపాదకులు కొత్తపల్లి రవిబాబు తొలుత మాట్లాడుతూ తెనాలి మున్సిపల్ చైర్మన్‌గా సుదీర్ఘకాలంపాటు పనిచేసిన త్రిపురనేని జంతుబలిని, మూఢ నమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఆయన నివాసగృహం సాహిత్య పాఠశాలగా వుండేదన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రగతిశీల సంఘాలు, నాస్తికులకు స్థలాలు కేటాయించాలి తప్ప మత సంస్థలు, స్వామిజీలకు కాదన్నారు. సాహితీ స్రవంతి కార్యదర్శి వరప్రసాద్, విరసం కార్యదర్శి అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాల క్రితమే సూత పురాణం, శంభుకవధ వంటి గ్రంథాల ద్వారా హిందూ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ఎండగట్టారని, వివాహ క్రతువుల్లో నూతన సంప్రదాయానికి నాంది పలికి, అర్థంకాని మంత్రాలను నిరోధించారని తెలిపారు. ఐఎఫ్‌టీయూ నాయకులు కూరపాటి రామారావు, ప్రజా సైన్స్ వేదిక నాయకులు కోయ వెంకటేశ్వర్లు, నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శులు మోతుకూరి అరుణకుమార్, బి.సుధాకర్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య తదితరులు ఆయన సేవలను కొనియాడారు.

నేడు హజ్‌యాత్ర దరఖాస్తుల డ్రా

13 జిల్లాల నుంచి 2,843 దరఖాస్తులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్‌యాత్ర ఎంపికకు వచ్చిన దరఖాస్తులకు బుధవారం ఉదయం 10 గంటలకు విజయవాడ సబ్‌కలెక్టరేట్‌లో డ్రా తీస్తారు. ఏపీ హజ్ యాత్ర కోటా-2018లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఏడాది 2,744 మందికి అవకాశం కల్పించారు. 13 జిల్లాల నుంచి మొత్తం దరఖాస్తులు-2,843 వచ్చాయి. ఇందులో 70 ఏళ్ల పైబడిన వారు 107 మంది ఉన్నారు. వారికి డ్రాతో సంబంధం లేకుండా హజ్ యాత్రకు వెళ్లొచ్చు. 10 జిల్లాల్లో డ్రా లేకుండానే దరఖాస్తు చేసుకున్న వారందర్నీ అనుమతిచ్చారు. మూడు జిల్లాల్లో కోటా కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. వారి జాబితాను ఫైన్ చేసేందుకుగాను నేడు డ్రాను నిర్వహిస్తున్నారు. హజ్‌యాత్రకు ఎవరూ ఉచితంగా వెళ్లలేరు. 70 దాటిన వారైనా, డ్రాలో ఎంపికైన వారైనా సరే డబ్బులు చెల్లించాల్సిందేనని ఏపీ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ పేర్కొన్నారు. మక్కా మదీనాలో రెండు విధాలుగా వసతి సదుపాయాన్ని కల్పిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసిన వారంతా సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో కొనసాగే డ్రాకు హాజరు కావాలని ఆయన కోరారు.



అధికారికం చేయండి...!

- పందేలను బట్టి పన్నులు
- ఎన్నింటికైనా అనుమతులు
- మద్యం షాపులకు కూడా
- భారీగా ఆదాయం వచ్చే అవకాశం
- కోడి పందేలపై ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : కోళ్లకు కత్తులు కట్టొద్దని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పునివ్వగా, పందేల నిర్వహణను అడ్డుకోవాలని రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. కోర్టు ఉత్తర్వులతో పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా సంక్రాంతికి కోడి పందేల నిర్వహణకు ఎవరూ అడ్డుకట్ట వేయలేకపోయారు. పకడ్బందీగా కోర్టు ఉత్తర్వులను అమలు చేద్దామంటూ ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గక తప్పదు. ఈ నేపథ్యంలో కోడి పందేలకు అధికారికంగా అనుమతి ఇచ్చేయటమే మంచిదని రాష్ట్ర నిఘా విభాగం (ఇంటెలిజెన్స్) ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. సంక్రాంతి హడావుడి ప్రారంభం నుంచి పందేలను అడ్డుకునేందుకు పోలీసులు నానా హడావుడి చేశారు. చివరకు కోర్టు కూడా జోక్యం చేసుకుని పందేలు వేయవద్దని, వేస్తే అందుకు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) బాధ్యత వహించాలని హైకోర్టు హెచ్చరించింది. దీంతో పోలీసుల ఎంత గట్టిగా ప్రయత్నించినా, సంప్రదాయం, డింకీల పందేలకు తలొగ్గక తప్పలేదు. ఈ నేపథ్యంలో కోడి పందేలపై ఇంటెలిజెన్స్ ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదిక ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గోవా తరహాలో పర్యాటకం పేరుతో ఆదాయ వనరులను సమకూర్చు కునేలా చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. గ్రామాలు, పట్టణాలలో ఎన్ని చోట్ల కావలిస్తే అన్ని చోట్ల పందేలకు అనుమతి ఇచ్చేయాలని అందులో పేర్కొన్నట్లు తెలిసింది. సంక్రాంతికి జల్లికట్టు మాదిరిగా అనుమతి ఇవ్వటంతో పాటు, పందేలను బట్టి పన్ను వసూలు చేయాలని ఇంటెలిజెన్స్ సూచించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కొన్ని బరులలో రూ.లక్షల్లో, రూ.వేలల్లో పందేలు జరుగుతాయి. వాటి ఆధారంగానే పన్ను వసూలు చేస్తే అటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరటంతోపాటు ఇటు పందెపురాయుళ్లు దొంగచాటుగా పందేలు వేసుకునే అవకాశం ఉండదనేది నిఘా వర్గాల అభిమతంగా తెలుస్తోంది. సంక్రాంతి వస్తుందంటే, డిసెంబర్ నుంచే కోడి పందేల నిర్వహణపై చర్చోప చర్చలు జరగటం, న్యాయస్థానాల సమయాన్ని, పోలీసుల విలువైన విలువైన కాలాన్ని వృథా చేయటం ఏటా పరిపాటిగా జరుగుతోంది. ఈఏడాదైతే పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోడి పందేల బరుల వద్దే కాపలా కాశారు. పశ్చిమ గోదావరి జిల్లా శ్రీరామవరంలో కోడి పందేల అనుమతిపై నిర్వాహకులు, పోలీసులకు మధ్య తోపులాట కూడా జరిగింది. రాజకీయ నేతల పలుకుబడి ఉన్న చోట భారీగా పందేలు జరగ్గా, లేనిచోట పందేలకు వెళ్లేవారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో పండుగ మూడు రోజులలో చోటు చేసుకున్న పరిస్థితిని పరిశీలించిన నిఘా విభాగం సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపించినట్లు సమాచారం. కోడి పందేల నిర్వహణ, మద్యం షాపుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చి, వ్యాపారం ఆధారంగా పన్ను వసూలు చేస్తే ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతుందని నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. గోవాలో మాదిరిగా పర్యాటకం పేరుతో పందేలు, మద్యం వ్యాపారానికి అనుమతులు ఇవ్వటం మంచిదని సూచించినట్లు తెలిసింది. మరి మన ప్రభుత్వం ఇంటెలిజెన్స్ నివేదికపై ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

సంపాదకీయం

మెడికల్ బిల్లు వైద్యవృత్తికి చేటు

బీజేపీ సర్కార్ ప్రతిపాదించిన జాతీయ మెడికల్ బిల్లు వివాదాస్పద అంశంగా మారింది. ఇది చట్టరూపం దాల్చితే వైద్యవృత్తికి తీరని చేటు చేస్తుందని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఈ క్రమంలో ఆధునిక వైద్యంలో శిక్షణ కల్పించి ఆయుష్ వైద్యులకు ఆధునిక వైద్యులుగా పట్టాలు ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రతిపాదన పలు విమర్శలకు తావిస్తోంది. జాతీయ వైద్య కమిషన్ బిల్లును స్టాండింగ్ కమిటీకి నివేదించిన తరుణంలో కొన్ని అంశాల్లో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పలు సమస్యలకు తావిస్తున్న అంశాలను సరిదిద్దేందుకుగాను ప్రతిపాదిత బిల్లును పున:పరిశీలించాలి. అందుకు అంగీకరించకుండా ప్రభుత్వం మొండివైఖరిని ప్రదర్శించినట్లయితే కనీసం ప్రధానమైన సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలి. ఎన్ఎంసీలో అభ్యంతరకర అంశాలు చాలా ఉన్నాయి. లాభాల్లో ఉన్న సంస్థలు మెడికల్ కాలేజీలను నెలకొల్పడమే కాకుండా ఇష్టానుసారం బిల్లులు వసూలు చేసే వెసులుబాటును ఎన్ఎంసీ కల్పిస్తోంది. తత్ఫలితంగా యోగ్యతగల విద్యార్థులకు వైద్యవిద్య అందుబాటులో లేకుండా పోతుంది. అంతేకాదు ఎగ్జిట్ పరీక్ష విద్యార్థులపై మరో భారంగా మారుతుంది. వైద్యవిద్యార్థుల ప్రతిభ ఆధారంగా మెడికల్ కాలేజీలకు ర్యాంకులివ్వడం సరైనది కాదు. దీనివల్ల ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో కమిషన్ నిర్వహణ మొత్తం టెక్నో క్రాటిక్, బ్యూరోక్రాటిక్ నియంత్రణ కిందకు వెళ్లిపోయి వైద్యవృత్తిదారుల ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం మరుగునపడిపోయే ప్రమాదం వుంది. అన్నింటికన్నా అభ్యంతరకర అంశం నిబంధన 49. దీని ప్రకారం ఆయుష్ వైద్యులు ఓ బ్రిడ్జ్‌కోర్స్ ద్వారా ఆధునిక వైద్యులుగా పట్టా పొందవచ్చు. అయితే ఇందుకోసం వైద్యరంగంలోని పలు రకాల వైద్యవిధానాలు, చికిత్సా పద్ధతులపై అధ్యయనం అవసరం. ఆ తర్వాత ఆయుష్, ఆధునిక వైద్యం అనుసంధానం సరైనదేనా అన్నది నిర్ణయించాలి.

ఆయుష్ అంటే ఆయుర్వేదం, యునానీ, సిద్ధ, హోమియోపతి– పురాతన కాలంలో దేశం నలుమూలలా ఇవి అభివృద్ధి చెందాయి. ఆయుర్వేదం అన్నది మూడు దోషాలు 'వాతం, పిత్తం, కఫం' సామరస్యత, సమతుల్య సూత్రం ఆధారితంగా ఉంటుంది. వీటన్నింటిని సమతుల్యంగా ఉంచి, రోగాలను నయం చేసే విధానాన్ని అనుసరిస్తుంది. ఈ మూడు దోషాలు సమతుల్యంగా ఉన్నప్పుడు రోగనివారణ సాధ్యపడుతుంది. తద్వారా సత్ఫలితాలు లభిస్తాయి.యునానీ వైద్యం అన్నది మూలికా వైద్యం. వనమూలికలతో ఔషధాలను తయారు చేస్తారు. ఇది ప్రధానంగా రక్తం, కఫం, పిత్తామ్లం, శరీరంలో ఉండే విషనీరు అన్న నాలుగు అంశాలను పరిగణనలోకి తీసుకొని సహజసిద్ధవైద్యాన్ని అందించడమే యునానీ విధానం. రోగి శరీర తత్వాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్యాన్ని అందిస్తారు. దీంతో రోగం నయమయ్యేందుకు కొంత ఎక్కువ సమయమే పట్టవచ్చు. అయితే వైద్యం బెడిసికొట్టే ప్రమాదముండదు.

సిద్ధ వైద్యవిధానమన్నది మానవుని శరీరంలోని పంచభూతాలపై ఆధారపడి పనిచేస్తుంది. విశ్వంలో భూమి, నీరు, అగ్ని, వాయువు, రోదసి అను పంచభూతాలు ఉన్నట్టే మానవ శరీరంలోనూ ఉంటాయి. దీని ప్రకారం పంచీకరణ సిద్ధాంతాన్ని సిద్ధ వైద్యంలో వినియోగిస్తారు. సిద్ధ వైద్య శాస్త్రం విశ్వంతో పాటు మానవులలో ప్రతి పదార్థము రూపొందడం వెనుక ఐదు మూలధాతువుల పాత్రను వివరిస్తుంది.

హెూమియోపతి వైద్యవిధానం పూర్తిగా విభిన్నమైనది. హోమియోపతికి జాతీయ కేంద్రమిచ్చే నిర్వచనం ప్రకారం.. 'హోమియోపతి సారూప్యతల సూత్రం ఆధారిత వైద్య విధానం'. రోగ లక్షణాలకు దారితీసే 'విషమే' దానికి విరుగుడన్న ప్రధాన సూత్రాన్ని హోమియోపతి అనుసరిస్తుంది. అదే విధంగా హోమియో మందుల మోతాదు చాలా తక్కువగా ఉంటుంది. దాని వల్ల రోగికి ఎలాంటి ప్రమాదం ఉండదు. అదే సమయంలో రోగాన్ని బలహీనపరుస్తుంది. ఒకే రకమైన రోగ లక్షణాలకు ఒకటే మందు అని హోమియోపతి భావిస్తుంది. ఇదిలావుండగా, ఆధునిక వైద్యమన్నది శరీర నిర్మాణం, శారీరక పనితీరుపై ఆధారపడి ఉంటుంది. రోగాలు ఏ విధంగా వృద్ధి చెందుతాయన్నది అన్వేషించేందుకు పాథోఫిజియాలజీ (రోగలక్షణ శరీరధర్మం) అధ్యయనం ఉంది. ఈ వైద్యవిధానంలో మందులు, శస్త్రచికిత్స ద్వారా రోగాన్ని నయంచేస్తారు. ఇది గత శతాబ్దకాలంలో అభివృద్ధి చెంది విస్తృతంగా విస్తరించిన వైద్యవిధానం. పలుమార్లు క్లినికల్ ట్రయిల్స్ నిర్వహించిన తర్వాతే ఆయా మందులు ప్రజావినియోగానికి అనుమతి పొందుతాయి. రోగం, ఆరోగ్యం అన్న మూలాంశమే భిన్నమైనది అయిన ప్పుడు, ఆధునిక వైద్యం గురించి అంతంత మాత్రంగానే తెలిసినప్పుడు ఆయుష్ వైద్యులకు ఆధునిక వైద్యశిక్షణ ఇప్పించి, పట్టాలు అందజేయడం ఎంతవరకు సమంజసమన్నది నేడున్న ప్రధాన ప్రశ్న. ఇది రోగులకు ఏ విధంగా ప్రయోజనాన్నిస్తుంది. ప్రజలకు లబ్ధి చేకూర్చాలన్నదే ఉద్దేశమైతే ఆయుష్‌ను కేవలం కాంప్లిమెంటరీగా మాత్రమే ఆధునిక వైద్యంలోకి అనుసంధానం చేయాలి. అయితే, ఆధునిక వైద్యంలో శిక్షణ పొందిన ఆయుష్ వైద్యులంతా ఆధునిక వైద్యంలో ప్రాక్టీస్ ప్రారంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయుష్ వైద్యం కనుమరగయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు. కాబట్టి ఆయుష్ వైద్యులు... ఆధునిక వైద్యంలో ప్రాక్టీసు మొదలు పెట్టడంకన్నా ఈ బ్రిడ్జ్ కోర్సును వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బిల్లులోని వివాదాస్పద అంశాల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోవాలి.

చురక

ప్రోటోకాల్ పరువు
ప్రధానికి బరువు
కాంగ్రెస్ కవుతున్నది
కడుపు మంట దరువు

మోడీ నెతన్యాహుల
ములాఖత్ సత్యం
అవుతున్నదా విమర్శల
ఆలింగన దౌత్యం

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

పాలనలో హక్కుల హరణం - ఎన్నికల్లో సంక్షేమ స్మరణం

విశ్వనాథ్ వై.

స్థూల దేశీయోత్పత్తిలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికుల సంక్షేమం విషయంలో మోడీ సర్కారుకు ఒక నిర్దిష్ట విధానం ఉన్నట్లు కనిపించడం లేదు. సంఘటిత,అసంఘటిత రంగాల్లోని కార్మిక సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. 1991లో నాటి యూపీఏ పాలకులు ప్రవేశపెట్టిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలూ కార్మిక వర్గాన్ని దారుణంగా దెబ్బతీశాయి. 2014లో కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే సర్కారు కొలువు దీరిన తరువాత ఈపరిస్థితి ఆందోళన గొలిపేదిగా ఉంది. కారణం, అదే నయా ఉదారవాద ఆర్థిక విధానాలను బీజేపీ పాలకులు మరింత వేగంగా అమలు చేయబూనడమే. .కార్మికుల హక్కులను హరించే పలు సంస్కరణలకు చట్ట రూపు కల్పించేందుకు మోడీ సర్కారు విఫల యత్నం చేస్తోంది. అలా అని కార్మిక సంక్షేమాన్ని విస్మరించినట్లు బయట పడితే 2019లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు అంత సునాయాసంగా దక్కే పరిస్థితి లేదు. ఇంత కాలమూ అనుసరిస్తూ వచ్చిన ఉపాధి రహిత అభివృద్ధి (జాబ్‌లెస్ గ్రోత్) విధానం భ్రమల నుంచి కార్మిక లోకం, యువత బయట పడుతున్న సంగతిని మోడీ సర్కారు సరిగానే గుర్తించింది.

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పోలింగుకు సరిగా 10 రోజుల ముందు –సుమారు 22సంవత్సరాలు అధికారం అనుభవించిన రాష్ట్రంలో గెలుపు కోసం ఎదురీదాల్సి వస్తోందంటూ అందిన ప్రతికూల సమాచారం బీజేపీ పాలకులను ఆత్మరక్షణలో పడేసింది. పర్యవసానంగా ప్రభుత్వ అనుమతి తీసుకోకపోయినా ఒకే సారి 300ల మంది కార్మికుల ఉద్వాసనకు ఆయా పరిశ్రమల యాజమాన్యాలను అనుమతించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనను మోడీ సర్కారు తొక్కిపెట్టిన సమాచారం 30నవంబరు, 2017న వెలుగు చూసింది. దీనికి 12రోజుల ముందు ఎకనామిక్స్ టైమ్స్ నౌ నిర్వహించిన భారత్ అభివృద్ధి చర్చ (ఇండియా డెవలప్‌మెంట్ డిబేట్)లో పాల్గొన్న ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రతిస్పందనకు భిన్నంగా మోడీ నిర్ణయం తీసుకోవడం గమనించాల్సిన విషయం. నాటి చర్చలో పాల్గొన్న జైట్లీ మాట్లాడుతూ కొన్ని కార్మిక చట్టాలకు సవరణలు చేయబోతున్నట్లుగా ప్రకటించారు. తమ ప్రభుత్వం అమలు జరిపే భూసేకరణ, కార్మిక సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు చెరపు చేస్తాయన్న ఆందోళనలూ తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిపై తామేమీ ఆందోళన చెందడం లేదనీ, ఏ రూపంలోని సంస్కరణల నమూనాను త్యాగం చేయకుండానే వాటిని అమలు జరిపే సత్తా తమ ప్రభుత్వానికి ఉందని చెప్పుకున్నారు. జైట్లీ చెప్పుకున్న సత్తా జాబితాలో పైన ఉదహరించిన కార్మిక ఉద్వాసన ప్రతిపాదన ఒకటి ఉంది.

గుజరాత్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత కార్మిక సంస్కరణల భవిష్యత్తు గురించి ప్రశ్నించగా త్వరలో జరగనున్న పార్లమెంటు సమావేశాలు లేదా ఆతరువాత సమావేశాల వరకు వేచి ఉండాలని జైట్లీ బదులిచ్చారు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకపోయినా ఫ్రీ ఎగ్జిట్ పాలసీ కింద ఒకే సారి 300ల మంది కార్మికులకు ఉద్వాసన పలికేందుకు పరిశ్రమల యాజమాన్యాలకు అనుతివ్వాలనేది మోడీ, జైట్లీల అప్రకటిత కార్మిక సంస్కరణల్లో ఒకటి. మోడీ, జైట్లీలు వేర్వేరు వేదికల మీద నుంచి వెల్లడించిన వాస్తవాలు కార్మిక సంస్కరణలు కొనసాగిస్తామనే అయితే, అధికార పీఠం కదులుతోందని సంకేతాలు అందగానే సంస్కరణలను వెనకన పెట్టేయడం గమనించాలి. మరో మాటలో కార్మిక నిజ సంక్షేమాన్ని త్యాగం చేయడానికైనా బీజేపీ పాలకులు సిద్ధంగా ఉన్నారనేది జైట్లీ ప్రసంగం సారాంశంగా గుర్తించాలి. బీజేపీ గత నాలుగు సంవత్సరాల పాలనలో అన్ని రంగాల్లో అనుసరిస్తూన్న ద్వంద్వ ప్రమాణాలకు దీనిని ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

అసలు వాస్తవమేమంటే, 2014లో అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలోనే కార్మిక సంస్కరణలకు బీజేపీ ప్రయత్నించింది. అమల్లోవున్న 44 కార్మిక చట్టాలను క్లుప్తీకరించి నాలుగు ప్రధానమైన కార్మిక కోడ్‌లుగా మార్చేందుకు చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. బీజేపీ తలపెట్టిన కార్మిక సంస్కరణల్లో –కార్మిక చట్టాల నుంచి లఘుపరిశ్రమలకు మినహాయింపు నివ్వాలని, వెలుపలి వ్యక్తులను నిషేధిస్తున్నామనే పేరిట ఆయా సంస్థల కార్మిక సంఘాల నాయకత్వంలోకి కార్మిక వృత్తినిపుణుల ప్రవేశాన్ని అడ్డుకోవడం వంటివి ఉన్నాయి. ఈప్రతిపాదనను ఆరెస్సెస్‌కు అనుబంధంగా పని చేసే బీఎంఎస్ నాయకులూ గట్టిగా వ్యతిరేకించడం గమనార్హం. ఈబిల్లును కానీ చట్టంగా అమల్లోకి తెస్తే తమ సంఘాల్లోని పలువురు నాయకులు నాయకత్వ స్థానాలను కోల్పోతారని జైట్లీని ఆయా బీఎంఎస్ నాయకులు హెచ్చరించినట్లు సమాచారం.

మోడీ పాలన యంత్రాంగం రూపొందించిన ఈ సంస్కరణలన్నీ కార్మిక సంక్షేమానికి, వర్గ ప్రయోజనానికీ గొడ్డలి పెట్టనే సంగతిని గమనించాలి. అత్యంత వివాదాస్పదమైన ఈ నాలుగు కోడ్‌లలో డ్రాఫ్ట్ కోడ్ ఆఫ్ వేజెస్ బిల్ 2017 మిగిలిన వాటి కంటే కాసింత తక్కువ ప్రమాదకరమైనదిగా చెప్పుకోవచ్చు. ఆమోదం కోసం ఆగస్టు 2017లో పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టడం జరిగింది. వర్షాకాల, శీతాకాల సమావేశాల్లో చర్చకు నిలిపే సాహసమూ చేయలేకపోయింది.

> నిర్దిష్ట
> కార్మిక విధానం లోపించిన
> మోడీ సర్కారు

కాగా, కోడ్ ఆఫ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ బిల్ విషయంగా వివాదాస్పద నివేదికలు ఉన్నట్లు తెలుస్తోంది.ఈ వివాదాస్పద అంశాలను గుర్తించిన కార్మిక సంఘాలు వాటిని సవరించాలని లేదంటే మూడు రోజుల పాటు సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించాయి. దీంతో జైట్లీ నేతృత్వంలోని మంత్రుల బృందం (జీఓఎం) ఈబిల్లును ముందుకు తీసుకు పోయేందుకు సాహసం చేయలేక పోయాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అటు ప్రతిపక్ష ఇటు స్వపక్ష కార్మిక సంఘాలతో విభేదాలు తెచ్చుకోవడమంటే తన గొయ్యి తనే తవ్వుకు న్నట్లవుతుందని బీజేపీ నాయకత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది.

వివిధ రంగాల్లో కార్మిక వర్గం ఎదుర్కొనే ఏ ఒక్క సమస్యకూ బీజేపీ పరిష్కారం చూపలేకపోయింది. కార్మిక సంక్షేమాన్ని విస్మరించిందనే చెప్పాలి. సమాచార,సాంకేతిక (ఐటీ) రంగంలో సంస్థాగత సంక్షోభం కారణంగా సుమారు లక్ష మందికిపైగా ఉద్వాసనలు జరిగాయి. హెచ్1బీ వీసా సంస్కరణలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెలువరించే ఆదేశాలు దేశీయ ఐటీ పరిశ్రమకు, అందులోని ఐటీకార్మికుల ఉపాధి భద్రతకు పెనుముప్పుగా నిలిచిన సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రవచించే హెచ్1బీ వీసా సంస్కరణ దెబ్బకు కనీసంగా ఐదు లక్షల నుంచి ఏడున్నర లక్షల మంది వివిధ స్థాయిల్లోని ఐటీ వృత్తినిపుణులు భారత్‌కు తిరిగి వచ్చేయాల్సిన పరిస్థితి ఉందని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ముప్పును నివారించేందుకు తీసుకున్న చర్యలేమిటనేది మోడీ సర్కారుకే తెలియాలి. కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్), యాంత్రీకరణ (ఆటోమేషన్), క్లౌడ్ కంప్యూటింగ్, వర్చువల్ రియాలీటీ వంటి అత్యంతాధునిక ఐటీ పరివర్తనలు లక్షల మంది ఐటీ కార్మికుల పొట్టగొడుతున్నాయి.

ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకున్న ఈ-కామర్స్ బుడగ పేలి పోయింది. వేల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోయారు. యూరోజోన్ సంక్షోభం దెబ్బకు అనేక బీపీఓలు మూత పడ్డాయి. ఫలితంగా ఈ రంగంలోనూ అసంఖ్యాకంగా ఉద్యోగులు బజారునపడ్డారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీల అమలు కారణంగా సంభవించిన ఆర్థిక మందగమనం రేపిన విధ్వంసానికి సుమారు 10లక్షల మంది వివిధ రంగాల్లో ఉపాధి కోల్పోయారు. వీరికి కనీసం ఒక్క రూపాయిని కూడా నష్టపరిహారంగా చెల్లించాలనే ఆలోచననూ మోడీ సర్కారు చేయలేదు. బీజేపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల లోపం కారణంగానే వివిధ పారిశ్రామిక, తయారీ రంగాల్లో లక్షల్లో ఉద్వాసనలు జరిగాయి. వీటిని నిలువరించడంలో, ఉన్న ఉద్యోగమూ కోల్పోయి బజారున పడిన వారిని ఆదుకోవడంలోనూ మోడీ సర్కారు ఘోరంగా విఫలమైంది.

నిరంతరం పశ్చిమ దేశాల పొగడ్తల కోసం తహ తహలాడే మోడీ సర్కారు ఆయా పశ్చిమ దేశాల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఆయా ప్రభుత్వాలు చెల్లిస్తున్న విధంగా ఎంతో కొంత నష్టపరిహారం చెల్లించాలనే ఆలోచన రాకపోవడం కార్మిక సంక్షేమ వ్యతిరేకత కాక మరేమిటి? బ్యాంకింగు రంగంలో అమలుచేస్తున్న అమలు చేయాలని ప్రయత్నిస్తున్న సంస్కరణల కారణంగా బ్యాంకు ఉద్యోగుల మీద అలవిమాలిన పని భారం పడుతోంది. ఈ అదనపు పని భారాన్ని మోసిన బ్యాంకు ఉద్యోగుల శ్రమకు నామమాత్రపు ప్రతిఫలం చెల్లించేందుకు మోడీ ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేయగల ఎఫ్ఆర్‌డీఐ బిల్లును అన్ని స్థాయిల్లోని బ్యాంకు కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. ఈబిల్లును ఉపసంహరించుకోవాల్సిందేనని ప్రభుత్వంతో సమరానికి బ్యాంకు సంఘాలు సిద్ధమవుతున్నాయని సమాచారం. జౌళి (వస్త్ర-టెక్స్‌టైల్) రంగంలో పది లక్షల మందికి పైగా జీవనోపాధి కోల్పో యారు. చేనేత, యాంత్రిక వినియోగం ఉన్న వస్త్ర రంగంలో జీవనోపాధి కోల్పోయిన లక్షలాది కార్మికుల బాధలు వర్ణనాతీతం.

పారిశుద్ధ్య పనుల్లో మానవ వినియోగం మీద ఉక్కుపాదం మోపాల్సిన మోడీ ప్రభుత్వం దాన్ని విస్మరిస్తోంది. సంభవించే ప్రమాదమరణాలకు నష్టపరిహారం చెల్లించేందుకు వీలు కల్పించే సవరణకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా పారిశుద్ధ్య పనుల్లో మానవ శ్రమను చట్టబద్ధం చేయాలని ప్రయత్నిస్తున్నట్లుగా ఉంది. దేశంలో బాల కార్మిక వ్యవస్థ అవస్థలను వేరుగా చెప్పనే అవసరం లేదు. వీరి బాధలను మోడీ సర్కారు ఆలకించిన దాఖలాలే లేవు. అసంఘటిత రంగంలోని మహిళ కార్మికుల శ్రమ దోపిడీని కట్టడి చేసేందుకు ఎలాంటి ప్రయత్నం జరుగుతున్న సమాచారం వెలుగు చూడలేదు. మహిళ కార్మికులకు ప్రసూతి ప్రయోజనాలు విస్తరించినట్లుగా ప్రభుత్వం చెప్పుకుంటోంది. వాస్తవంగా, రెండు ప్రసవాలకు చెల్లించాల్సిన ప్రసూతి ప్రయోజనం రూ.6,000 లను ఒక్క ప్రసవానికే పరిమితం చేయడం ద్వారా మహిళ కార్మికులకు చేస్తున్న మేలు ఏమిటనేది బీజేపీ పాలకులే తెలియజేయాలి. ఈ నేప థ్యంలో ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్ట నున్న బడ్జెట్లో కార్మిక సంక్షేమం కోసం బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత నీయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ డిమాండ్ చేస్తున్నారు. చిల్లర విపణిలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)ను అనుమతిస్తూ బీజేపీ సర్కారు తీసుకున్న తాజా నిర్ణయాన్ని కార్మిక సంక్షేమానికి గొడ్డలి పెట్టని విమర్శించారు.

వి-మెయిల్

న్యాయపాలికలో చీలికలు

సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వ్యవహార సరళిపై నలుగురు సీనియర్ సుప్రీం న్యాయమూర్తులు ధ్వజమెత్తుతూ ప్రజల ముందుకు రావడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి.ఒక దురద ృష్టకరమైన పరిణామం. రాజ్యాంగ పరిరక్షణ,అపిలేట్ అథారిటీ తదితర విశిష్టాధికారాలతో ప్రజాస్వామ్య మూల స్థంబాల్లో అతి ముఖ్యమైనది గా భాసిల్లుతున్న న్యాయవ్యవస్థ లో లోపాలు ఉండకూడనివి.ముఖ్యంగా శాసన,కార్యనిర్వాహక వ్యవస్థల పని తీరుపై అసంత ృప్తి పెరుగుతున్న సందరాల్లో ఈ దేశ పౌరులకు న్యాయ వ్యవస్థే అండగా నిలుస్తూ వస్తోంది.ఒక్కో సారి తన పరిధిని అతిక్రమిస్తున్నట్టు కనబడినా , అంతిమంగా అదీ ప్రజాసంక్షేమం ద ృష్ట్యానే అన్నది సాధారణ పౌరుల నమ్మకం.చాలా సందర్భాల్లో రాజ్యం పౌరుని ప్రాథమిక హక్కుల్ని కాలరాయకుండా కాపాడుతూ వస్తున్నది ఈ వ్యవస్థే.

ఈ మధ్య కాలంలో న్యాయపాలిక తీర్పులూ, తీరు తెన్నులపై అడపాదడపా క్రీనీడలు సోకుతున్నాయి. అయితే అవి ఆ వ్యవస్థ నిబద్ధతని ప్రశ్నించే స్థాయిలో లేవు.వ్యక్తిగత అభిప్రాయాల్లో, ఆలోచనల్లో సహజంగా ఉండే భిన్నత్వం వల్లనే ఆ రకమైన హెచ్చుతగ్గులుగా భావించబడ్డాయి.కానీ అత్యున్నత న్యాయస్థానంలో అత్యంత సీనియర్ న్యాయమూర్తులే తమ అసంతృప్తిని వెళ్ళగక్కాల్సి వచ్చిందంటేనే న్యాయ వ్యవస్థ గౌరవప్రతిష్టలకు తీవ్ర అభిశంసన. పార్లమెంటులో కూడా ఒక న్యాయమూర్తి వ్యవహార శైలిపై అభిశంసన తీర్మానం సందర్భంలో తప్ప మిగతా సమయాల్లో చర్చించరాదు.ఆ వ్యవస్థ పవిత్రత కాపాడడానికే ఈ ఏర్పాటు.నలుగురు న్యాయమూర్తులూ లేవనెత్తిన అంశాలు కూడా తీవ్రమైనవి. కేవలం ప్రధాన న్యాయమూర్తి పాలనా వ్యవహారాలకు సంబంధించినవి కావు. మెడికల్ కాలేజీ ముడుపుల కుంభకోణం కేసు తరహా విస్తృత ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవి.న్యాయపాలిక సంపూర్ణ స్వతంత్రతకి చెందినవి.రాష్ట్రపతి చొరవ తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలి.

– డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

ఇంధన వనరుల పొదుపు అవశ్యం

టి.వి.సుబ్బయ్య

ప్రకృతి మనకు అందించిన ఇంధన వనరులు విలువైనవి. ఇవి ప్రకృతిలో పరిమితంగానే లభ్యమవుతాయి. అందువల్ల వీటిని పరిమితంగా వినియోగించుకొని మను షులు ఆనందంగా జీవించాలి. మానవుడు ఇంధన వనరులను ఆధునిక జీవనంలో అపరిమితంగా వినియో గించు కుంటున్నాడు. దీనవల్ల రోజు రోజుకీ ప్రకృతి విధ్వంసానికి, మానవుడి మనుగడకి ప్రమాదం పెరుగు తున్నదని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరి స్తున్నారు. ఇటీవల ప్రభుత్వాలలో, ప్రజలలో కొంత చైతన్యం వచ్చినప్పటికీ అది చాలదు. నిత్యజీవితంలో ఎన్నో మార్పులు అవసరం.

పెట్రోలు, డీజిలు, కిరోసినల్‌లాంటి శిలాజ ఇంధనాలు, బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్, అణువిద్యుత్, జలవిద్యుత్ లాంటి ఇంధన వనరుల వినియోగం పెరిగితే పర్యావరణ కాలుష్యం పెరిగి అనేక విపరిణామాలు సంభవిస్తున్నాయి. అయితే నిత్యజీవనం వీటి వినియోగం లేకుండా ముందుకు సాగలేని ఆధునికయుగంలోకి అడుగుపెట్టింది. వీటి వినియో గాన్ని తగ్గించి, సౌర, వాయు, అలల తరంగాల విద్యుత్ విని యోగాన్ని పెంచుకోవలసిన అవసరం ఏర్పడింది. ఇవన్నీ తరగని ఇంధన వనరులు. ముఖ్యంగా సౌర విద్యుత్ ఉత్పత్తి వినియో గాన్ని పెంచు కోవాలని మన దేశంతో సహా ప్రపంచదేశాలన్నీ ప్రణాళికలు వేసుకొని అమలుకు శ్రీకారం చుట్టాయి. పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ వాతావరణ సదస్సులో కుదిరిన ఒప్పం దంలోని అంశాలను అమలు చేస్తే కాలుష్యం కలిగించే ఇంధన వనరుల వినియోగం తగ్గుతుంది. ప్రభుత్వాలు, ప్రజలు కలిసి ఈ అంశాల అమలును వేగవంతం చేయడం ఎంతైనా అవసరం.

శిలాజ ఇంధనాలు ఎంత సౌకర్యం కల్పిస్తాయో అంతకంటే అనేక రెట్లు ఎక్కువగా హాని కలుగజేస్తున్నాయి. బొగ్గు మండించినప్పుడు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, మెర్కురీ, సల్ఫర్ ఆక్సైడ్ తదితర కాలుష్యాలు విడుదలై ప్రకృతిని, మనిషి ఆరోగ్యాన్ని హరించివేస్తున్నాయి. పర్యా వరణ కాలుష్యం, భూతాపం పెరిగి మనిషి జీవనం కల్లోలిత మవుతోంది. పారిశ్రామిక విప్లవానికి ముందు వాతావరణం లోకి 10 లక్షలకు 285 వ్యర్థ అణువులు విడుదల కాగా ప్రస్తుతం 400 వ్యర్థ అణువులు విడుదలై ప్రమాదస్థాయికి చేరాయి. బొగ్గువల్ల 34 శాతం, వాహనాలవల్ల 33 శాతం, పరిశ్రమల వల్ల 15 శాతం కర్బనపు విషవాయువులు విడుదలవుతున్నాయి.

మన దేశంలో రవాణా వాహనాల వినియోగం ఇటీవల అపారంగా పెరిగింది. ఏడాదికి 30 లక్షల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయని అంచనా. ఒక ఢిల్లీలో కోటిపైగా వాహనాలున్నాయని ఇటీవల అంచనా వేశారు. అన్ని నగరా ల్లోనూ లక్షల వ్యక్తిగత వాహనాలు, ప్రభుత్వ వాహనాలు నడుస్తూ విపరీతంగా కాలుష్యాన్ని వెదజల్లు తున్నాయి. ఇంధన వనరుల వినియోగం రోజురోజుకు పెరుగుతున్నది. ఇవి ఎంత పెరిగితే అంత ఎక్కువగా విషవాయులు వాతావరణంలోకి చేరతాయి. ఇటీవల ఢిల్లీలో వాతారణంలో పేరుకుపోయిన విషవాయువులు ఎంత బీభత్సం సృష్టించింది అందరికీ తెలిసిందే. ఇక ఎలక్ట్రా నిక్స్, కమ్యూనికేషన్ల ఉపకరణాల వినియోగం వల్ల కాలుష్య వాయువుల విడుదల వాటా 3.5 శాతం వుంటుందని, అధిక కాలు ష్యానికి కారణమవుతున్న వాహనాల్లో విమానయానం మొదటి స్థానంలో ఉంటుందని అమెరికా శాస్త్రవేత్తలు అంచనా వేశారు. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగం కాలుష్యం వాటా మొత్తం కాలుష్యంలో ఐదోవంతు ఉంటుందని అంచనా.



ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఏం చేయాలి, ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?

ముఖ్యంగా శిలాజ ఇంధనాలు మనం ఎక్కువగా దిగు మతి చేసుకొని వాడుకుంటున్నాము. ఈ ప్రకృతి వనరులు వేగంగా తరిగిపోతున్నాయి కూడా. ప్రధానంగా బొగ్గు, చమురు, గ్యాస్ వనరులు దేశంలో వేగంగా తరిగి పోతున్నాయి. వీటిని ప్రధానంగా అన్ని రకాల రవాణా వాహనాలు, పరిశ్రమలలో వినియోగిస్తున్నారు. ఈ ఇంధ నాలు విడుదల చేసే వ్యర్థాల వల్ల ప్రజల ఆరోగ్యాలపై పెను దుష్ప్రభావాలను కలుగజేస్తున్నాయి. ముఖ్యంగా శిలాజ ఇంధనాలు మితిమీరిన వాయు, జలకాలుష్యానికి కారణమవుతున్నాయి.

గృహాలలో సంప్రదాయంగా వస్తున్న విద్యుత్ బల్బుల స్థానంలో ఎల్ఇడి, బల్బులు వినియోగించినట్లయితే ఖర్చు తగ్గిపోతుంది. అదే సమయంలో విద్యుత్ ఉత్పత్తి యూనిట్లపై ఒత్తిడి తగ్గుతుంది. ఎల్ఇడి బల్బులు సైతం మితిమీరితే కాంతి కాలుష్యాన్ని కలిగిస్తాయని వాతావరణ శాస్త్రవేత్తల అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. గృహ వినియోగ వస్తువుల విషయంలో అంటే ఏసీలు, ఫ్రిజ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం తగ్గించుకోవడం వల్ల కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను తక్షణం అవలంబించడం అవసరం. ప్రధాన ప్రత్యామ్నాయం సౌర విద్యుత్ ఉత్పత్తి పెరగాలి. సౌర విద్యుత్ ఫలకాలను ఇళ్ల పైనే ఏర్పాటు చేసుకొని సొంత అవసరాలకు కావలసినంత ఉత్పత్తి చేసుకుని మిగిలితే విద్యుత్ గ్రిడ్‌కు విక్రయించి ప్రయోజనం పొందవచ్చు. ఫలితంగా కాలుష్యాన్ని గణనీ యంగా తగ్గించవచ్చు. అవసరం వున్నాలేక పోయినా లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు వాడటం మానివేయాలి. ఇది మనకేగాక దేశ ఆర్థిక వ్యవస్థకూ తోడ్పడుతుంది.ఇళ్లలో, వీధుల్లో ఎల్ఇడి బల్బులు వాడటం వల్ల విద్యుత్ పొదుపు అవుతుంది. అధిక కాలుష్యానికి బొగ్గు, సిమెంట్ ఉత్పత్తి, రవాణా వాహనాలు ప్రధానంగా కారణామవు తున్నాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిని తగ్గించాలి. దీని స్థానంలో సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచి నట్లయితే ఇంధనం పొదుపు చేయడానికి కొంత మేర వీలవుతుంది.

రవాణా వాహనాలలో శిలాజ ఇంధనాలను వాడకాన్ని తగ్గించడానికి సౌరవిద్యుత్ నడిచే వాహనాల వినియోగాన్ని పెంచాలి. దీని వల్ల మనం దిగుమతి చేసుకునే ముడిచమురు పరిమాణం తగ్గిపోయి వ్యయం తగ్గుతుంది. ఇంధన వనరులు పొదుపు అవుతాయి. ఇక వాహనాల వినియోగం తప్పని సరిగా తగ్గాలి. సామూహిక రవాణా సౌకర్యాన్ని తక్కువ రేట్లకు, విద్యుత్‌తో నడిచే వాహనాల సంఖ్యను ప్రభుత్వాలు పెంచాలి, ముఖ్యంగా రైల్వే మార్గాలను విస్తరించాలి. వ్యక్తిగత వాహనాలను ప్రతిచిన్న అవసరానికి వాడకుండా ప్రజలే నియమం పెట్టుకోవాలి. వాహనం వినియోగం వ్యక్తిగత హోదాగా భావించడం సరైందికాదు. ముఖ్యంగా సమాజంలో ఉన్నత స్థానాల్లో వున్న వారు కదిలితే 10-20 వాహనాలు వెంట వుండటం వల్ల ఇంధనం వాడకం, కాలుష్యం పెరుగుతాయి. వారానికి ఒక్కరోజైనా ఇంధనంతో నడిచే సొంతవాహనాల వినియోగం నిలిపి వేయాలి. దగ్గర ప్రాంతాలకు వెళ్లేందుకు సైకిళ్లను ఎక్కువగా ఉపయోగించాలి. అన్నింటికంటే ఎక్కువగా నగరాలు, పట్టణాలు విస్తరించడం వల్ల ఇంధనం వాడకం పెరగడమే గాక, కాలుష్యం అధికమవుతుంది. నీటి కొరత తరుముకొస్తున్నది నగరాలలో నీటి వినియోగం ఒక్కొక్కరికి దాదాపు 150 లీటర్లవుతుండగా గ్రామాలలో 30-40 లీటర్లు అవుతున్నాయి. నీటిని తోడేందుకు, వేడి చేసేందుకు వాడే ఇంధనం పొదుపుకావాలంటే గ్రామాలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలి, వ్యవసాయాన్ని లాభదాయం చేసి వ్యవసాయాధారిత పరిశ్రమలను గ్రామాల పరిధిలో ఏర్పాటు చేస్తే వలసలు తగ్గిపోయి ఇంధన వనరుల పొదుపు ఎక్కువగా సాధించవచ్చు. కాలుష్యాలు తగ్గుతాయి.

ప్రతిరోజు దాదాపు 25వేల విమానాలు తిరుగుతు న్నాయని బోయింగ్ సంస్థ అంచనా. రానున్నకాలంలో ఇవి 25వేలకు పెరగనున్నాయి. విఐపీలు అనవసరంగా ప్రతిరోజు ప్రత్యేక విమానాలలో తిరగడం మానేస్తే ఇంధనం పొదుపుకావడమేగాక వ్యయం, కాలుష్యం తగ్గుతాయి. 500 కిలోమీటర్లలోపు ఒక వ్యక్తి రైలులో ప్రయాణిస్తే వెలువడే కలుషిత వాయువులకంటే విమానంలో తిరిగితే మూడురెట్లు ఎక్కువ కాలుష్యం విడుదలవుతుంది. రైలు ప్రయాణాన్ని ఎంచుకుంటే ఇంధనం, వ్యయం పొదుపు అవుతుంది. సౌర విద్యుత్ ఉత్పత్తి వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను వేగవంతం చేయాలి. వీటిని ప్రజలు తప్పనిసరిగా పాటించాలి. పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే నష్టాలను, ఇంధన వనరుల పొదుపువల్ల కలిగే ప్రయో జనాలను ప్రజలు అవగాహన కల్పించుకొని పాటించాలి. అంతేకానీ ఇది మనపని కాదు ప్రభుత్వాలు చేస్తాయని భావిస్తే మనముందు పొంచివున్న ముప్పు వేగవంతమవుతుంది. కేరళ కొచ్చి నగరంలో 2015 ఆగస్టులో విమానాశ్రయాన్ని పూర్తిగా సౌరవిద్యుత్‌తో నడిచే విమానాశ్రయంగా తీర్చిదిద్దారు. ఇలాంటివి వేగవంతం కావాలి. సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచి కాలుష్యం కలిగించే ఇతర ఇంధన వనరులను పొదుపు చేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని ప్రజలను ప్రోత్సహించాలి. రైల్వే రవాణాను విస్తరించి సౌర విద్యుత్‌తో నడపటం వల్ల శిలాజ ఇంధనాల వినియోగం తగ్గుతుంది.


2001లో ఇంధన వనరుల చట్టం అమలులోకి వచ్చింది. ఈ వనరులు పొదుపు అయ్యే నాణ్యమైన ఉపకరణా లను వినియోగించాలి. ముఖ్యంగా భవన నిర్మాణాలలో మార్పు రావాలి. గాలి, వెలుతురు, పచ్చదనం, నీటి నిల్వలు పెరిగే విధానాలు అవలంబించాలి. ఇంధన వనరుల పొదుపు పద్ధతులు పాటించడం ఆర్థిక, సామాజిక పరిస్థితులు గణనీయంగా మెరుగవుతాయి.

విశాలాంధ్ర
బతుకు
The Life
బుధవారం
17 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com



సాదియా.. 'స్ట్రాంగ్ గరల్'

గుంటూరు జిల్లా మంగళగిరి పేరు వినగానే చేనేత పరిశ్రమ టక్కున గుర్తుకువస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో చేనేత చీరలకు, డ్రెస్ మెటీరియల్‌కు పెట్టింది పేరు. అలాగే పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయం దక్షిణభారత దేశంలోనే ప్రసిద్ధిగాంచింది. అంతేకాదు క్రీడారంగంలోనూ, ప్రత్యేకించి పవర్ లిఫ్టింగ్‌లో మంగళగిరి 'పవర్'కు ప్రత్యేకత ఉంది. తాజాగా ఈ పట్టణానికి చెందిన ఓ చిన్నారి సంచలన విజయాలను నమోదు చేస్తోంది. ఇటీవలే స్ట్రాంగ్ గరల్ ఆఫ్ ఇండియా టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఆ విజయాల వెనుక దాగిన కృషి గురించి ప్రత్యేక కథనం.



మంగళగిరిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న షేక్ సాదియా అల్మస్ పవర్‌లిఫ్టింగ్‌లో అసాధారణ ప్రతిభ కనబరుస్తోంది. హైదరాబాద్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అండర్ 17 బాలికల 52 కేజీల విభాగంలో సాదియా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతాకం సాధించడమే కాకుండా 'స్ట్రాంగ్ గరల్ ఆఫ్ ఇండియా' టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ టైటిల్ సాధనలో ఆ బాలిక ఏడాది కృషి దాగి ఉంది. రోజూ ఉదయం క్రమం తప్పకుండా చేసిన సాధనకు దక్కిన ఫలితమది. అంతేకాదు గతేడాది కాలంలో ఎన్నో సంచలన విజయాలను అందుకుంది. గత డిసెంబర్‌లో కేరళ రాష్ట్రం అలెప్పీలో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ విభాగంలో సాదియా కాంస్య పతకం గెలుచుకుని గుర్తింపు పొందింది. 52 కేజీల విభాగంలో ఏకంగా మూడు కాంస్య పతకాలను అందిపుచ్చుకుంది. స్క్వాడ్ 97.5, బెంచ్‌ప్రెస్ 37.5, డెడ్‌లిఫ్ట్ 107.5 మొత్తం 242.5 కేజీల బరువు ఎత్తి ఓవరాల్‌గా కాంస్య పతకం సాధించింది.

అంతకుముందు రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి, మహారాష్ట్రలోని చంద్రాపూర్ నిర్వమించిన జాతీయపోటీలకు ఎంపికై అక్కడ కూడా చక్కటి ప్రతిభ కనబరిచి కాంస్యపతకం అందుకుంది. అంతేకాదు అలెప్పీలో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ విభాగం పోటీలకు అర్హత సాధించింది. అదే ఉత్సాహంతో తలపడి అక్కడ కూడా కాంస్య పతకం సాధించింది. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన ఘనతను దక్కించుకుంది. కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్ర జూనియర్ విభాగంలో రజత పతకం, విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర సీనియర్ విభాగంలోనూ పోటీపడి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది సాదియా. గత డిసెంబర్‌లో అలెప్పీలో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 242.5 కేజీల (మూడు అంశాలు కలిపి) సాదియా.. నెలరోజుల వ్యవధిలోనే హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్ స్కూల్ గేమ్స్‌లో 297 కేజీలు (స్క్వాడ్ 130, బెంచ్‌ప్రెస్ 42, డెడ్‌లిఫ్ట్ 125) బరువు ఎత్తి మెరుగైన ప్రదర్శన ఇవ్వడం ద్వారా సాదియా తన ప్రతిభను చాటుకుంది. ఇన్ని విజయ రహస్యాల వెనుక సాదియా కృషి ఒక్కటే కాదు.. ఆమె తండ్రి ప్రోత్సాహం, శిక్షణ దాగి ఉన్నాయి. వారిది సాధారణ మధ్యతరగతి కుటుంబం. ఈ నేపథ్యంలోనూ అంతర్జాతీయ పోటీల్లో సాదియా రాణించడం వెనుక ఆమె తండ్రి షేక్ సందాని కృషి గురించి కూడా తెలుసుకోవాల్సిందే.

షేక్ సందాని తన 18వ ఏట మిత్రుల ప్రోత్సాహంతో పట్టణంలోని రమణ జిమ్‌కు వెళ్లడం మొదలుపెట్టారు. బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న నేపథ్యంలో గుంటూరుకు చెందిన వెయిట్ లిఫ్టర్ కె.విజయభాస్కర్ సూచనల మేరకు పవర్‌లిఫ్టింగ్ దిశగా సాధన చేశారు. అప్పటికే స్థానికంగా నేషనల్ పవర్ లిఫ్టర్, గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు ఉండటం కలిసొచ్చింది. 2000లో యూత్ జిమ్, ఫిట్‌నెస్ సెంటర్‌లను నెలకొల్పి, నిరంతర సాధనలో నిమగ్నమయ్యారు. మరుసటి సంవత్సరం నుంచి జాతీయస్థాయి పవర్ లిఫ్టర్‌గా ఎదిగారు. జాతీయస్థాయిలో ఆయన 2013 వరకు పోటీల్లో తలపడి, 10 పతకాలు సాధించారు. 2004లో జెమ్‌షెడ్‌పూర్‌లో జరిగిన ఏషియన్ బెంచ్‌ప్రెస్‌లో 90 కేజీల జూనియర్స్ విభాగంలో రజత పతకం సాధించి, అంతర్జాతీయ గుర్తింపు పొందారు. 2010లో ఫిట్‌జోన్ ఏర్పాటు చేసి, ఇప్పటివరకు 150 మంది పవర్‌లిఫ్టర్లను తీర్చిదిద్దారు. అనేక విజయాలు సొంతం చేసుకున్న సందాని.. ప్రాథమిక విద్య వరకే చదివి పుచ్చుకోవడంతో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోలేకపోయారు. తన కుటుంబంలో తోబుట్టువులు ఎవరూ చదువుకోకపోవడంతో.. తన ఇద్దరు కుమార్తెలకు చదువు చెప్పించి, చక్కని జీవితాన్ని అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పెద్ద కుమార్తె షేక్ ఆసియా విజయవాడలోని ఓ కార్పొరేట్ కాలేజీలో సీనియర్ ఇంటర్మీడియెట్ బైపీసీ చదువుతోంది. రెండో కుమార్తె సాదియా పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. సాదియాకు పోలీసు అధికారి కావాలనే లక్ష్యం ఉంది. దీంతో జనరల్ ఫిట్‌నెస్ కోసం ఆమెను తండ్రి గతేడాది నుంచి జిమ్‌కు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో పవర్‌లిఫ్టింగ్‌పై సాదియాకు మక్కువ పెరగడంతో ఆ దిశగా సాధన చేయించడంతోపాటు ఎక్కడ పోటీలు జరుగుతున్నా సందాని తోడుగా వెళుతున్నారు. అనతికాలంలోనే విజయాలను సాధిస్తూ, తండ్రికి తగ్గ తనయగా ఎదుగుతున్న సాదియా.. పతకాలను బహుమతిగా ఇస్తోంది.



సాదియాను అభినందిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్



మంగళగిరిలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో సాదియా, సందానిలతో గుమ్మడి పుల్లేశ్వరరావు, గంజి చిరంజీవి

- సాయిశ్రీ

ఫ్రిజ్‌లో ఇవి పెట్టవద్దు!

ఇంట్లో ఫ్రిజ్ ఉంది కదాని కొని తెచ్చిన ప్రతి వస్తువూ అందులోనే పడేస్తుంటారు చాలామంది. కూరగాయల నుంచి కోడిగుడ్లు వరకూ ప్రతిదీ అందులోనే ఉంటాయి. ఫ్రిజ్‌లో ఏవి పెట్టవచ్చు, ఏవి పెట్టకూడదనే అవగాహనే ఉండదు. ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఏవైనా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి నిజమే! కానీ ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల పాడైపోయేవీ ఉన్నాయి తెలుసా? అందుకే ఏవి పడి అవి ఫ్రిజ్‌లో పడేయకూడదు. అలాగే ఫ్రిజ్‌లో ఎక్కువ రోజులు నిల్వ ఉన్నవి ఏవైనా వాటి రుచి మారిపోతుంది. అందుకే ఫ్రిజ్‌లో పెట్టిన సాధ్యమైనంత తొందరగా వాడుకోవడం మంచిది. ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న ఆహార పదార్థాల్లో యాంటీఆక్సిడెంట్లు తరిగిపోతాయి, ఇతర పోషకాలూ తగ్గిపోతాయి. కొన్ని రకాల పదార్థాల రూపురేఖలూ మారిపోతాయి. మరి ఇలాంటి ఆహారం ఏదో? ఏవి ఫ్రిజ్‌లో పెట్టకూడదో తెలుసుకుందామా!

1. **బ్రెడ్ :** దీనిని ఎప్పుడూ ఫ్రిజ్‌లో పెట్టకూడదు. బ్రెడ్‌ని ఫ్రిజ్‌లో పెడితే ఎండిపోయినట్లు అయిపోతుంది. ఎండిపోయిన లేదా పొడిబారిపోయిన బ్రెడ్‌ని అస్సలు తినబుద్ధి కాదు. తిన్నా తొందరగా అరగదు. ఇది ఆరోగ్యానికి ఎంతమాత్రం మంచిది కాదు. బ్రెడ్‌ని మామూలు బాక్స్‌లో ఉంచాలి లేదా ఓపెన్‌గా పెట్టినా పర్వాలేదు.

2. **తులసి :** ఈ ఆకులను ఎప్పుడూ ఫ్రిజ్‌లో ఉంచకూడదు. 40 డిగ్రీల ఫారిన్‌హీట్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలో ఉంచితే ఇవి వెంటనే నల్లబడిపోతాయి. వీటిలో ఉండే ఔషధ గుణాలూ తగ్గిపోతాయి. ఒక్కోసారి విషపూరితంగానూ మారుతుంది. అందుకే వీటిని ఫ్రిజ్‌లో కాకుండా ఎండ తగలని ప్రదేశంలోనూ లేదా జిప్ ఉన్న ప్లాస్టిక్ బ్యాగ్‌లోనూ ఉంచాలి.

3. **పండ్లు :** అవకాడో, యాపిల్, అరటి, సిట్రస్ జాతి పండ్లు, బెర్రీలు, అప్రికాట్లు లాంటి పండ్లను రెఫ్రిజిరేటర్‌లో ఉంచకూడదు. వీటిని ఫ్రిజ్‌లో ఉంచితే వాటి రూపురేఖలు మారిపోవడమే కాదు వాటికుంటే సహజసిద్ధమైన రుచీ పోతుంది. ఫ్రిజ్‌లో ఉంచినా వాటిని తినడానికి అరగంట ముందే బయటపెట్టాలి.

4. **ఉల్లిపాయలు :** వీటిని నిల్వ ఉంచడానికి పేపర్ బ్యాగ్ అంత ఉత్తమం ఇంకొకటి లేదు. ఉల్లిపాయలను ఎప్పుడూ బంగాళాదుంపలకు దూరంగా ఉంచాలి. బంగాళాదుంపల నుంచి వెలువడే గ్యాస్, తేమ లాంటివి ఉల్లిపాయలను తొందరగా నాశనం చేస్తాయి. ఉల్లిపాయలు ఫ్రిజ్‌లో ఉంచితే మెత్తగా అయిపోతాయి. ఇవి తినడానికి బాగోవు.

5. **బంగాళాదుంపలు :** వీటిని తక్కువ ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేస్తే ఇందులో షుగర్ స్థాయిలు పెరుగుతాయి. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. వీటిని వండిన తర్వాత తీపిదనం ఎక్కువవుతుంది. వీటిని కూడా ఉల్లిపాయల మాదిరిగానే ప్రత్యేకంగా పేపర్ బ్యాగ్‌ల్లోనే నిల్వ ఉంచాలి.

6. **టమాటాలు :** కూరగాయల్లో భాగమే కదాని చాలామంది టమాటాలను ఫ్రిజ్‌లో పడేస్తారు. ఇలా చేయడం వల్ల వాటి రుచి పోతుంది. టమాటాల నాణ్యత తగ్గిపోతుంది. పోషకాలూ పోతాయి. ఇవి మెత్తపడకుండా ఉండాలంటే సహజసిద్ధమైన గాలి తగిలే చోటనే ఉంచాలి.

7. **ఆయిల్ :** వంటనూనెలనూ ఫ్రిజ్‌లో ఉంచకూడదు. వీటిని గది ఉష్ణోగ్రతలోనే ఉంచాలి. నట్స్ నుంచి తీసిన ఆయిల్స్‌ని మాత్రమే ఫ్రిజ్‌లో ఉంచాలి.





తోలుబొమ్మలాట !

తోలుబొమ్మలాట గుర్తుందా! ఈ కళను వెనకటి తరం వారే మర్చిపోయారు. ఇంక దీని గురించి ఈ తరానికి ఏం తెలుస్తుంది. ఒకప్పుడు మంచి ప్రజాదరణ ఉన్న కళల్లో, జనానికి గొప్ప వినోదాన్ని పంచిన కళల్లో ఈ తోలుబొమ్మలాట కూడా ఒకటి. ఈ విషయాన్ని గుర్తు చేయడానికే అనుకుంటా బెంగళూరులో గురువారం పప్పెట్ (తోలుబొమ్మలు) పెరేడ్ నిర్వహించారు. అందులో భాగమే ఈ చిత్రం. దత్తు ఇంటర్నేషనల్ పప్పెట్ ఫెస్టివల్‌లో భాగంగా ఈ ప్రదర్శన జరిగింది. తోలుబొమ్మలాట, దాని ప్రత్యేకత, అది అందించే వినోదం, విజ్ఞానం ఇవన్నీ ఒక్కసారిగా గుర్తుకొచ్చాయా! అయితే దీని గురించి మీ పిల్లలకూ తెలియజేయండి. తద్వారా ఈ కళను బతికించేందుకు మీ వంతు కృషి చేయండి.

చింతపండూ వాడండి!

చింతపండు సాధారణంగా ప్రతి ఇంట్లో ఉంటుంది. కానీ పూర్వంతో పోలిస్తే దీని వాడకం బాగా తగ్గింది. కారణం గ్యాస్ అంటున్నారు. మారిన వాతావరణంలో పులుపు పడనివారు ఎక్కువయ్యారు. అదీ ముఖ్యంగా చింతపండు పులుపు. చింతపండు తింటే కడుపుబ్బరంతో బాధపడాల్సి వస్తోందని వాపోతున్నవారూ ఉన్నారు. కారణమేదైతేనేం చింతపండు వాడకం తగ్గింది. మితంగా తీసుకుంటే ఏదైనా మంచిదే. చింతపండూ అంతే. పడడం లేదు కదాని అస్సలు తీసుకోకపోతే ఇందులో ఉండే పోషకాలనూ మిస్సయినట్లే.

చింతపండూ ఆరోగ్యకరమే. తగినస్థాయిలో తీసుకుంటే చింతపండూ మంచి ఔషధమే. తప్పనిసరిగా వాడాల్సిన ఆహార పదార్థాల్లో ఇది కూడా ఒకటి. చింతపండు తింటే అరగడం లేదు అంటారు కానీ నిజానికి ఇది అజీర్తిని పోగొడుతుంది. చింతపండులో ఉండే పొటాషియం బీపీని అదుపు చేస్తుంది. దీనివల్ల గుండెవ్యాధులూ దరిచేరవు. ఇందులో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా రక్తహీనత రాకుండా చూస్తుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ పెంచడం లోనూ దీని పాత్ర ఎక్కువే. చింతపండు గుజ్జులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. చింతపండు అత్యంత శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇందులో పీచుపదార్థమే కాదు మినరల్స్, విటమిన్స్ కూడా ఎక్కువే. చింతపండు హానికారకమైన క్రిముల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. తద్వారా కేన్సర్ ముప్పు లేకుండా చేస్తుంది.

కేన్సర్‌పై పోరాడే లక్షణాలు చింతపండులో పుష్కలంగా ఉన్నాయని వైద్యులే చెబుతున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధులనూ ఇది దూరం పెడుతుంది. కాలేయం ఆరోగ్యాన్నీ ఇది కాపాడుతుంది.





జరిగిన కథ

"కృతి పూర్తి అయిందా?" అన్నాడు. "ఏమిటా తొందర?" అన్నా. "ఏమీలేదూ-దేశకాచారీ 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ' కొత్త కూర్పు ఇప్పుడే వచ్చింది. అందులో డొమెస్టిక్ ట్రాన్స్‌ఫరు గురించి ఏమివ్రాశాడో చూద్దాం అని" అన్నాడు.

"మీ లాయర్ల కెప్పుడూ ఇదే ఘోషకదా! ప్రపంచం అంతా మీకోసమే వుందనుకుంటారు!" అన్నా.

56 అతడు

దారంట పోయేవాళ్ళందరినీ ఇంట్లో తెచ్చి పెడుతుంది. మన కెందుకు ఒకరి గొడవ అంటే వినదు. మహా చెడ్డ అల్లరి వచ్చిపడింది! నేను సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఎవరిదో కొత్త మొఖం కనిపించింది. ఓహో వెంకట్రామయ్య గారి అమ్మాయి కాంసును - అసలు ఇక్కడున్న పెద్ద కుటుంబాలే నాలుగో ఐదోనో తెలుగు వాళ్ళని - మనవాళ్ళందరితోను స్నేహంగా ఉండడం చాలామంచిది అనుకుని సంతోషిస్తే - తుమ్మలపల్లి వాళ్ళమ్మాయి కాదంటూ, ఆ పిల్ల వృత్తాంతం చెప్పకొచ్చింది. ఎవరో పిల్లనో తీసికొని పోతూంటే, మనం మధ్యవర్తిత్వం చేస్తే మనకి చుట్టుకుంటుంది.

(నిన్నటి సంచిక తరువాయి)

"శరణుజొచ్చినవాని మదిలోన కరుణ నెరయబ్రోచుట మంచి నియమమ్ముసుమ్మి" అని రెండోక్లాసు నీతిపద్యాలు, నా మొఖంమీద ఏకరవు పెడితే నేనేం చెప్పేదీ?

"అయినా ఆ పిల్ల పెద్ద పిల్లాయె. మైనారిటీ తీరిపోయి నట్టుంది. ఆ అమ్మాయి ఇష్టం ఉండే మా దగ్గరకొచ్చిందంటారు రేపు." "ఈ బానిస వ్యాపారం ఊరుకోలేకపోతే కళ్ళు మూసు కునేది - ఏం చేస్తాం? లోకం మరమత్తా మన ఉద్యోగం? ఈ పిల్లకి చెప్పి మన దగ్గరకి పంపించి - రేప్పొద్దున్న మనమీద ఆక్రమంగా యీ పిల్లని ఇంట్లో నిర్బంధించి, మోసగించి, మభ్య పరచి, అబద్ధాలాడి, వాళ్ళ ఇంట్లో బలవంతంగా పెట్టుకున్నారని, ఆ తల్లిదండ్రులు, ఆ మలయాళంవాళ్ళూ మనమీద దావా తెస్తే మనం కాస్తా ఇందులో ఇరుక్కుంటే చస్తాం."

"అమ్మాయిని పడుపు వృత్తిలోకి దింపడానికేనోయి - ఆ మలయాళం వాళ్ళు వేసిన ఎత్తు. అలాంటి అమాయక పసిపిల్లలని రక్షించడం మన విధి కాదోయి?" అంది శాంతం. "మనకేమి సాక్ష్యముందంటా? నీకంత అనుమానం ఉంటే, పోలీసువాళ్ళ కప్పచెప్పు పిల్లని" అన్నా. "సారి! ఏడ్చినట్టే వుంది. ఆ అమ్మాయిని పోలీసు స్టేషనులో వదలి పెడితే - కంచే చేన్ని మేస్తుంది!" అంది. "ఏం చేయ మంటావు? మేస్ట్రీటు దగ్గర కెళ్ళి ఫిర్యాదు చేసుకో, అంతవరకే మన విధి" అన్నా. దాంతో కోపం పట్టలేక "నీ విధి అంతే అయితే నా విధి ఇంతే!" అని దగ్గిర సంజీవరావు డెసిన్నియల్ డైజెస్టుంటే ఆ పుస్తకం నామీద గిరవాటేసింది. చప్పున బుర్రతిప్పు కున్నాకాని లేకపోతే నాకు శిరచ్ఛేదమే అయిపోను! అవునూ - పడుపు వృత్తికోసమే ఆ అమ్మాయిని తీసు కొచ్చారూ-మనకి నిదర్శనమేవంటా? పిల్లని డబ్బిచ్చి కొనడం పద్ధతిలో చెల్లదూ... అయితే కొన్నవాళ్ళకి అమ్మిన వాళ్ళకీ సలహా చెప్పడానికి వకీళ్ళు లేరా? అమ్మో! వాళ్ళకి సలహా చెప్పేవాళ్ళు - ప్రివీకౌన్సిల్లో వాదించే లాయర్లే - అంతకీ తక్కువవాళ్ళు కారు. అసలు ఇలాంటి వ్యాపారంలో ఎంతోమంది వాటా దార్లుంటారు - ఆ ఇళ్ళు అద్దెలకిచ్చే వాళ్ళు ఆ వ్యాపారం కప్పిపుచ్చడానికి మరోచాటు వ్యాపారం నడిపించేవాళ్ళు ఆ వ్యాపారంలో భాగస్తులు. అందుకు సంబంధించిన సారాకొట్లు, రెస్టారెంట్లు, వైనుషాపులు, బ్యూటీ పార్లర్లు, సోడాషాపులు, కాఫీక్లబ్బులూ - అబ్బో ఈ కూపీ బైటకి లాగితే మహామహులు హేమహేమీలెందరి పేర్లో వీధిలోకి వస్తాయి - లంపటా ఎంతో ఉంటుంది. కదిపితే కుళ్ళు. అంచేత ధీమంతుల లక్షణం గప్‌చుప్‌గా వూరుకోవడమే. ఆ మాట చెపితే శాంతానికి అర్థంకాదు. అన్నీ చెప్పేను - ఇంకా మరో మాట కూడా అన్నా: "ఎదిగిన పిల్ల. పరాయిది - మనం ఇంట్లో పెట్టుకున్నాం అంటే - నాకు అపఖ్యాతి." దాంతో తారాచువ్వలా మీదపడింది. "ఎంతసేపు నీ ఖ్యాతి - నీ గొప్ప - నీ మర్యాదా - నీ స్వార్థం చూసుకోవడమేనా? ఒకరికి ఉపకారం చేద్దాం సాయం చేద్దాం అని అక్కరలేదూ? ఈ పిల్ల నా యింటి కొచ్చింది. నా శరణు అడిగింది. ఈ పిల్ల యిక్కడే వుంటుంది. బోధపడిందా? ఇక ఈ ప్రస్తావన ఇందుతో ఆపు!" అంది కాలు కింద కొడుతూనూ.



ఇంక చేసేదేవుంది? "సరే - నేను మాత్రం వొద్దనలేదే. తప్పకుండా మన ఇంట్లోనే వుండనీ. మన పాపాయిని ఎత్తుకోడానికీ, నీకు ఇంట్లో సాయంగానూ కూడా వుంటుంది. మరో మనిషిని మనం ఎలాగ పెట్టుకోవాలనుకుంటున్నాం. జీతం కలిసొస్తుంది కూడాను. అన్నట్టు ఓ కంటితో కనిపెడు తూండే - ఆ పిల్ల నైజం సరిగా తెలిసేంత వరకూనూ!" అన్నా ఎందుకేనా మంచిదని. దీర్ఘంగా ఆలోచిస్తే ఇది బాగానేవుంది. ఏది జరిగినా మన లాభంకోసం ఉపయోగించుకోవాలి. అదే గడుసుదనం. ఈవారంలో ప్రెసిడెన్సీ కాలేజీ హిస్టరీ ఎసోసీ యేషనుల్లో ఉపన్యాసం ఒకటుంది - వై.యం.ఐ.యే.లో



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

ఒకటుంది. ఆ రెండు ఉపన్యాసాల్లో సమ యోచితంగా ఈ నైజాం పిల్లకి నేను శరణ్యం ఇచ్చినట్టు యిరికించాలి. రేపు ప్రొద్దున్న పత్రికలో పడుతుంది. నా పేరు నలుగురికీ తెలు స్తుంది. కీడెంచి మేలెంచమన్నాడు. రేప్పొద్దున్న ఏదేనా తగా యిదా వొచ్చినా - ఈ ఉపన్యాసంలో బహిరంగంగా చెప్పేనన్న సంగతి బాగా పనికొస్తుంది.

చాలా రోజులై శాంతం పాడ్డమే లేదు. అటువంటిది ఇందాకనే త్యాగరాసు కీర్తన ఒకటి పాడింది. హాయిగా వుండెను. కాని పాటముందు "కళ కళకోసం కాదు, కళకొక ఆదర్శం వుండాలి" అంటూ కొత్త సిద్ధాంతం ఒకటి తీసుకొచ్చి నన్నొప్పుకో మంటుంది. వాల్టరు పీటరు, రస్కిను, ఆస్కారు వైల్డు వల్లించేవాడిని. "కళ కళకోసం కాదం"టే నేనెలా వొప్పుకొనేదీ? కవినీ, చిత్రకారుడినీ, గాయకుడినీ వాళ్ళమటుకు వాళ్ళని వదిలేయాలి. కళ పూనినప్పుడు రాస్తారు లేకపోతే లేదు. అంతేకాని, వాడి ఆంతరంగిక జీవితంలో సామాన్యులకేం నిమిత్తం వుంది? డిక్విన్సీలా నల్లమందు, భంగూ మాదుం వేసుకుంటే వేసుకుంటాడు - పాదాలవరకూ పట్టు అంగరఖా వేసుకుంటే వేసుకోగాక - గెడ్డాలు, జడలు పెంచు కుంటే పెంచుకోనీ - అస్కారువైల్డులాగ సామ్యా నులకి వర్తించే కట్టుబాట్లు, నీతులు సాంప్రదా యాలు అతనికి వర్తించవు. వీటన్నింటికీ కవి, కళావేత్త అతీతులు. ఇష్టం వొచ్చినప్పుడు రాస్తాడు. కష్టం వచ్చినప్పుడు మానేస్తాడు. అసలు రాయే రాయడూ, వాళ్ళకల్లా స్వేచ్ఛ ఇచ్చి వదిలేస్తే - అసలు కళ పుడుతుంది. అంతేకాని "ఏకాంతం" గురించి వ్రాయకు, "కన్నీటిశోకం" గురించి వ్రాయకు, "సెలయేరు" గురించి వ్రాయకు, "ఎడబాటు" గురించి వ్రాయకు అంటే ఎలా చావడం? "కోయనృత్యం" "దేశదాస్యం," "ఇంజను గర్జన" "డైనమో సంగీతం", "రాటం రాగం," "కరువు పిశాచం", "తోళ్ళ కంపు" - వీట్లగురించి వ్రాసిందే అసలైన కళ అంటే ఎలా చస్తాం? ఇంక డబ్బున్నవాళ్ళకి కళ అమ్ముడు పోవడమే! సరే - శ్రీనాథుడా, పోతనా మనకి ఆదర్శం?

అయితే ఒక్కటుంది - ఈ కాలపు కవి అన్నవాడికల్లా తన పద్యాలు అచ్చు వేయించాలని వుంటుంది. గాయకుడికి గాన సభలు, కాలక్షేపాలు పెట్టించి పేరు వూరు సంపాదించాలని వుంటుంది. చిత్రకారుడికి ప్రదర్శనాలు పెట్టించి బొమ్మలమ్ము కోవాలని ఉంటుంది. నటుడికి నాటకాలు వేయిస్తే అందులో నటించాలని వుంటుంది. ఈ పనులు అన్నీ చేయించటం అంటే డబ్బుతో పనాయె? ఈ డబ్బు ఎవడు ఖర్చు చేస్తాడు? ఇంత సొమ్ము ఎవడు మదుపు పెడతాడు? పెడితేమాత్రం - లాభం షాహుకారుదాయె: కవి గాయకుడికీ చిత్రకారుడికీ నటీనటులకీ - దుప్పే! ఈ సమస్య ఎవడు పూర్తి చెయ్యగలడు? అయినా - నాకెందుకీ చిత్తక్షోభ! నేనేం పద్యాలు పాడాలా బొమ్మలు రాయాలా?

57 ఆమె

దేశంలో ఉత్సాహం పొంగిపోతూంది; ఉప్పుసత్యాగ్రహం రోజుల ఉత్సాహంకంటే మరింత ఉజ్వలంగా వుంది. గాంధీ గారిని అరెస్టుచేసి రెండు నెలలయింది. వేలాది ప్రజ ఆవేశం మీద జైళ్ళకి వెళుతున్నారు. ఇప్పటిమటుకు ఉత్సాహం తప్ప మరొకటి లేదు. ప్రజల్లో ఈ ఉత్సాహం ఎన్నాళ్ళుంటుంది? ఈ జైళ్ళుకు వెళ్ళడం ఎన్నాళ్ళు సాగుతుంది? జైళ్ళు నిండినంత మాత్రాన బ్రిటిషు వాళ్ళు మనకి లొంగిపోయి స్వరాజ్యం ఇచ్చేస్తారా? వీళ్ళని జయించి స్వతంత్ర్య సంపాదించడం ఇంత సుళువైన పని అవుతే మహాత్ముడివంటి రాజకీయవేత్త ప్రపం చంలో ఇదివరకు పుట్టలేదు - ఇక మీదట పుట్టబోడు. సంవత్స రంలో స్వరాజ్యం వస్తుందన్నాడు. ఇంతవరకు బ్రిటిషువాడు దిగివచ్చే సూచనలు ఏమీ కన్పించడంలేదే! ఖద్దరు వ్యాపకం బాగా వుంది. చాలామంది కడుతున్నారు. ఖద్దరు దీక్ష పుచ్చు కున్నవాళ్ళలో నేనొక్కర్తిని. ఆవేళనుంచి ఈవేళవరకు మిల్లుబట్ట అన్నది ముట్టుకోవడం లేదు. ఆరునెలలై నియమంగా రాట్నం కూడా వడుకుతున్నాను. కాని స్వరాజ్యం సూచనలు కనిపించ డంలేదు. ఉప్పు వండినంత మాత్రం బ్రిటిషువాడు భయపడి వెళిపోతాడా అని ప్రపంచంలో అందరూ నవ్వుతున్నారు. మనవాళ్ళే హాస్యం చేస్తున్నారు. మితవాదులకి సత్యాగ్రహం అంటే కిట్టదు. కడుపులో చల్లకదలకుండా స్వరాజ్యం రావా లంటారు. అసలు వాళ్ళకి స్వరాజ్యం అంటే భయం. వాళ్ళకంటే ఒకాకు హెచ్చు చదువుకున్నారు - మన వర్తక శిఖామణులు. పెట్టుబడిదార్లున్ను, డొమీనియను ప్రతిపత్తికంటే హెచ్చు. మన కెందుకంటున్నారు. మహమ్మదీయులు అసలు కలిసి రావడం లేదు సరేకదా, బ్రిటిషు వాళ్ళతోనే చేతులు కలుపుతున్నారేమో అనిపిస్తూంది. బ్రాహ్మణ బ్రాహ్మణేతర ఉద్యమం ఒకటి లేవ నెత్తేరు. పంచముల్లోకూడా చీలికలు తెస్తున్నారు. దేశం అంతా ముప్ఫై మూడు కోట్లమంది ఏకం కాకుండానే, ఈ సత్యాగ్రహం మొదలుపెట్టేరు గాంధీగారు, కొసకి ఇదెట్లా పరిణమిస్తుందో? స్వరాజ్యం వస్తుందని నాకు తోచడంలేదు. మన కష్టాలు మరింత హెచ్చవుతాయేమో అనిపిస్తూంది.


ఖద్దరు కట్టడం, నూలు, వడకడం తప్ప, మరి రాజకీయాల్లో నేనేమీ కలుగజేసుకోవడం లేదు. అప్పుడు మాత్రం ఉప్పుపొట్లం కొన్నాను. అది శాస్త్రికి యిష్టంలేకపోయింది. లక్షలాది ప్రజ వెడు తున్నారే జైళ్ళకి, నేనెందుకు వెళ్ళకూడదు అనిపిస్తూంది. అయితే నాలో నేనేనా నిజం చెప్పుకోవద్దా? జైలంటే విపరీత భయం నాకు. చీమ కుట్టితే భరించలేను. వేళకి కాఫీ లేకపోతే తల నొప్పొస్తుంది.

- ఇంకా వుంది.

ఎట్టకేలకు వీడిన రొమ్ము క్యాన్సర్ గుట్టు



రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి దాదాపు 20 ఏళ్లుగా అంతుచిక్కకుండా ఉన్న ఓ జన్యువు గుట్టును శాస్త్రవేత్తలు ఎట్టకేలకు ఛేదించారు. ఏ రకమైన ఉత్పరివర్తనాల కారణంగా మహిళలు ఈ వ్యాధి బారిన పడుతున్నారో గుర్తించారు. 'బీఆర్‌సీఏ1' అనే జన్యువులో చోటుచేసుకునే ప్రతికూల ఉత్పరివర్తనాలు రొమ్ము క్యాన్సర్ ముప్పును పెంచుతాయని శాస్త్రవేత్తలు రెండు దశాబ్దాల క్రితమే కనుగొన్నారు. అణు స్థాయిలో ఈ చర్యా విధానాన్ని మాత్రం వివరించలేకపోయారు. యేల్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తాజాగా ఆ ప్రయత్నంలో సఫలీకృతమయ్యారు. రేడియో ధార్మికత, అంతర్గత ఒత్తిడి వంటి సమస్యలతో కొన్నిసార్లు డీఎన్ఏ ముక్కలవుతుందని వారు తెలిపారు. 'బీఏఆర్‌డీ1' అనే జన్యువుతో జత కట్టడం ద్వారా 'బీఆర్‌సీఏ1' సదరు డీఎన్ఏను తగిన రీతిలో అతికిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియకు వీలులేకుండా 'బీఆర్‌సీఏ1' ఉత్పరివర్తనాలకు గురైతే రొమ్ము క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని వివరించారు. రొమ్ము క్యాన్సర్‌తోపాటు అండాశయ క్యాన్సర్ చికిత్స కోసం మెరుగైన ఔషధాలు తయారుచేసేందుకు తమ పరిశోధన ఫలితం దోహదపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.



మహా సముద్రాల సగటు ఉష్ణోగ్రత 3.5 డిగ్రీల సెల్సియస్

ప్రపంచవ్యాప్తంగా మహా సముద్రాల సగటు ఉష్ణోగ్రతను 3.5 డిగ్రీల సెల్సియస్‌గా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గతంలో ఎన్నడూ ఉపయోగించని ఓ అద్భుత విధానంలో ఈ ఉష్ణోగ్రతలను గుర్తించారు. మహా సముద్రాల సగటు ఉష్ణోగ్రతను లెక్కించడం అత్యంత క్లిష్టమైన వ్యవహారం. ఎందుకంటే నీటి పొరల మధ్య ఉష్ణోగ్రతలో తేడాలు ఎక్కువగా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా నీటి విస్తరణ తీరు కూడా భిన్నంగా ఉంటుంది. ఈ అడ్డంకులను అధిగమిస్తూ, మహా సముద్రాల సంయుక్త సగటు ఉష్ణోగ్రతను కనుగొనేందుకు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు సరికొత్త విధానాన్ని రూపొందించారు. ఈ నూతన విధానంలో నీటి ఉష్ణోగ్రతను లెక్కించడానికి బదులు.. వాతావరణంలోని ఆర్గాన్, క్రిప్టాన్, గ్జినాన్ అనే మూడు జడ వాయువుల నిష్పత్తిని గుర్తిస్తారు.

వీటి పరిమాణం మహా సముద్రాల ఉష్ణోగ్రతకు అనులోమాను పాతంలో ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. మహాసముద్రాలు వెచ్చగా ఉన్నపుడు ఈ జడవాయువులు వాతావరణంలోకి విడుదలవుతుంటాయని వివరించారు. ప్రస్తుత ఆధునిక యుగంలో మహా సముద్రాల సగటు ఉష్ణోగ్రతను 3.5 డిగ్రీల సెల్సియస్‌గా ఈ విధానంలోనే లెక్కించారు.

ప్రమాదం కోరల్లో భూమి

సైన్స్ టెక్నాలజీ తాజా సమాచారం



కాలుష్య కోరల్లో చిక్కుకున్న భూమిని కాపాడటానికి సమయం మించిపోతోందని 15 వేల మంది శాస్త్రవేత్తలు ముక్తకంఠంతో హెచ్చరించారు. కోలుకోలేని నష్ట నుంచి పుడమిని కాపాడటానికి తక్షణ చర్యలు అవసరమని తేల్చిచెప్పారు. ఇంత పెద్దసంఖ్యలో శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేయడం ఇదే మొదటిసారి. 25 సంవత్సరాల కిందట ప్రపంచంలోని నోబెల్ గ్రహీతల్లో ఎక్కువమంది.. వాతావరణంపై ఒక అప్రమత్త లేఖ రాశారు. తాజాగా రెండో హెచ్చరిక జారీ అయింది. 'వరల్డ్ సైంటిస్ట్స్ వార్నింగ్ టు హ్యూమానిటీ : ఎ సెకండ్ నోటీస్' పేరుతో వెలువడిన ఈ హెచ్చరిక పత్రంపై వివిధ దేశాలకు చెందిన 15 వేల మందికి పైగా శాస్త్రవేత్తలు సంతకాలు చేశారు. క్షేత్రస్థాయి అంశాలనూ వారు విశ్లేషించారు. పర్యావరణానికి సంబంధించిన తొమ్మిది అంశాల్లో ఒక్క 'ఓజోన్' అంశంలోనే పురోగతి చోటుచేసుకుందన్నారు. ఇది బయోసైన్స్ పత్రికలో ప్రచురితమైంది. ఒక శాస్త్రీయ పత్రంపై ఇంతమంది శాస్త్రవేత్తలు సంతకాలు చేయడం ఇదే మొదటిసారని సిడ్నీ విశ్వవిద్యాలయానికి చెందిన థామస్ న్యూసమ్ పేర్కొన్నారు. పాతికేళ్ల కిందట వచ్చిన మొదటి హెచ్చరికలో పర్యావరణ విధ్వంసాన్ని కట్టడి చేయడం, ఓజోన్ క్షీణత, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల వంటి అంశాల్లో పూర్వ పరిస్థితులు నెలకొనాలని సూచించారు. గత పాతికేళ్లలో ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న ప్రతికూల పోకడలను ఈ కథనంలో ప్రస్తావించారు. అవి.


- ▶ తలసరి మంచినీటి లభ్యత 26 శాతం మేర పడిపోయింది.
- ▶ 30 కోట్ల ఎకరాల మేర అటవీ భూమి తగ్గిపోయింది.
- ▶ క్షీరదాలు, సరీసృపాలు, ఉభయచరాలు, పక్షులు, మత్స్యజాతి జీవుల్లో 29 శాతం మేర క్షీణత నమోదైంది.
- ▶ సాగరాల్లో ఆక్సిజన్ పరిమాణం చాలా తక్కువగా ఉన్న ప్రాంతాలు 75 శాతం మేర పెరిగాయి.

మద్యపానంతో క్యాన్సర్ ముప్పు



మద్యపానంలో మూలకణాల్లోని డీఎన్ఏ శాశ్వతంగా దెబ్బతినే ముప్పుందని తాజా అధ్యయనమొకటి హెచ్చరించింది. ఈ పరిస్థితి క్యాన్సర్‌కు దారితీసే అవకాశ ముందని సూచించింది. తాజా అధ్యయనంలో భాగంగా భారత సంతతి శాస్త్రవేత్త ఆచార్య కేతన్ పటేల్ నేతృత్వంలోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం పరిశోధకులు బృందం ఎలుకలకు ఇంథనాల్ రూపంలో మద్యాన్ని కొంతకాలం పాటు అందించింది. అనంతరం వాటిలో క్రోమోజోమ్, డీఎన్ఏ సీక్వెన్సింగ్‌లను సమగ్రంగా విశ్లేషించింది. మద్యపానంలో శరీరంలో ఉత్పత్తయ్యే అసిటాల్డిహైడ్ అనే హానికర రసాయనం కారణంగా రక్తంలో మూలకణాల డీఎన్ఏ శాశ్వతంగా దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. డీఎన్ఏ సీక్వెన్సింగ్ కూడా మారుతోందని కనుగొన్నారు. ఫలితంగా రొమ్ము, పేగు క్యాన్సర్ల ముప్పు పెరుగుతోందని తెలిపారు.

సౌర కుటుంబ బాహ్య వలయాల్లో నీటి జాడ



సౌర కుటుంబ బాహ్య వలయాల్లో ద్రవరూప నీటి జాడలను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' శాస్త్రవేత్తలు తాజాగా కనుగొన్నారు. గ్రహాంతర జీవులను గుర్తించేందుకు అనువైన ప్రాంతాల సంఖ్య ఎక్కువేననే సంగతిని ఇది సూచిస్తోందని వెల్లడించారు. నెప్ట్యూన్ గ్రహ కక్ష్యకు ఆవల వలయాల్లో పలు ఖగోళ వస్తువులను తాము గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. వాటిని 'ట్రాన్స్ నెప్ట్యూన్ వస్తువులు (టీఎన్ఓ)'గా పేర్కొన్నారు. వాటిపై ఉష్ణోగ్రతలు మైనస్ 200 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉంటాయని సూచించారు. ఫలితంగా ఈ ఖగోళ వస్తువులపైగల మంచు మహాసముద్రాల ఉపరితలంపై ద్రవరూప నీరు ఉండే అవకాశం ఏ మాత్రం లేదన్నారు.

8 గంటల నిద్ర లేకపోతే కుంగుబాటు !



రాత్రుళ్లు తగినంతగా నిద్రించకపోతే ఆరోగ్యపరంగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని తాజా అధ్యయనమొకటి హెచ్చరించింది. రాత్రిపూట 8 గంటల కంటే తక్కువ నిద్రించే వ్యక్తులు కుంగుబాటుకు గురయ్యే ముప్పు ఉందని వెల్లడించింది. చిన్నచిన్న విషయాలకే బాధపడటం, ప్రతికూల ఘటనలను పదేపదే తలచుకోవడం వంటి లక్షణాలు ఎక్కువగా ఉన్న వ్యక్తులపై అమెరికాలోని బింగామ్టన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు తాజా అధ్యయనం నిర్వహించారు. వారు ఎప్పుడు నిద్రిస్తున్నారు ? ఎంతసేపు నిద్రిస్తున్నారు ? వంటి అంశాలను తెలుసుకున్నారు. అనంతరం భావోద్వేగాలను రేకెత్తించే చిత్రపటాలను చూపించి... వారి ఏకాగ్రతను పరిశీలించారు. రాత్రుళ్లు 8 గంటల కంటే తక్కువ సమయం నిద్రిస్తున్న వ్యక్తులు ప్రతికూల చిత్రపటాలు, ఆలోచనల నుంచి బయటపడలేకపోతున్నట్లు గుర్తించారు. ఈ ధోరణితో వారిలో కుంగుబాటుకు గురయ్యే ముప్పు ఉందని పేర్కొన్నారు. 8 గంటల నిద్ర ఉన్నవారు ప్రతికూల ఆలోచనల నుంచి తమ దృష్టిని మళ్లించగలుగుతున్నట్లు తెలిపారు.

గాయాలను మాన్చుకునే రోబోలు

గాయాలను స్వయంగా మాన్చుకునే కొత్త తరం రోబోల సృష్టికి దారులు ఏర్పడుతున్నాయి. మనుషుల కండరాల తరహాలో పనిచేసే మెత్తటి పరికరాలను అమెరికాలోని కొలరాడో విశ్వవిద్యాలయ పరిశోధకులు అభివృద్ధి చేశారు. హైడ్రాలికల్లీ అంప్లిఫయిడ్ సెల్ఫ్ హీలింగ్ ఎలక్ట్రోస్టాటిక్ (హేసెల్) ఆక్చ్యుయేటర్లుగా వీటికి వారు పేరుపెట్టారు. చవకైన పదార్థాలతోనే తయారయ్యే ఇవి ఎలక్ట్రికల్ డ్యామేజీ లను తమకు తాముగా నయం చేసుకోగలవని పరిశోధకులు తెలిపారు. ఈ కొత్త పరికరాలు అందుబాటులోకి వస్తే.. ఇక రోబోల్లో కదలికలు, చర్యల కోసం మోటార్లు, పిస్టన్లు బిగిం చాల్సిన అవసరం ఉండదు. సున్నితమైన వస్తువులను పట్టుకోవడం నుంచి పెద్దపెద్ద బరువులను ఎత్తడం లాంటి భిన్నమైన పనులను కూడా ఈ ఆక్చ్యుయేటర్‌లు చేసేస్తాయి. భిన్న రకాల కదలికలు ప్రదర్శించగల ఈ హేసెల్ ఆక్చ్యుయేటర్లు.. సామర్థ్యం, వేగం, మన్నికలో మానవుల కండరాలకన్నా మెరుగ్గా ఉంటాయని పరిశోధకులు తెలిపారు.



అంచనాలు మించి వేగంగా కరిగిపోనున్న గ్రీన్‌లాండ్ మంచు!



గ్రీన్‌లాండ్‌లో హిమానీ నదాలు గతంలో ఊహించిన దానికంటే వేగంగా కరిగే ముప్పుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. గ్రీన్‌లాండ్ తీరంలోని సముద్ర భూతలం, మంచుమేటల దిగువన గల గట్టి భాగానికి (బెడ్‌రాక్) సంబంధించి గతంలో ఎన్నడూ లేని రీతిలో అత్యంత కచ్చితత్వంతో కూడిన సమగ్ర పటాలను నాసా, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఇర్విన్ పరిశోధకులు తాజాగా రూపొందించారు. గతంలో ఊహించినదానికంటే 2-4 రెట్లు ఎక్కువ హిమానీ నదాలు సముద్ర మట్టం కంటే 200 మీటర్ల దిగువన విస్తరించినట్లు వారు గుర్తించారు. ఇది స్వాగతించదగిన విషయం కాదని పేర్కొన్నారు. సాధారణంగా గ్రీన్‌లాండ్‌లో సముద్ర మట్టం నుంచి 182 మీటర్ల పైన ఉండే నీరు ఆర్కిటిక్ నుంచి వస్తుందని తెలిపారు. నీరు చల్లగానే ఉంటుందని సూచించారు. అంతకంటే దిగువన ఉండే నీరు సుదూర దక్షిణ ప్రాంతం నుంచి వస్తుందన్నారు. ఇది పైన ఉండే నీరుకంటే 3-4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ ఉష్ణోగ్రతను కలిగి ఉంటుందని వెల్లడించారు. అందువల్ల లోతులో ఉన్న హిమానీ నదాలు సదరు వెచ్చని నీటి ప్రభావంతో వేగంగా కరిగిపోయే అవకాశం ఉందని వివరించారు. పర్యావరణ మార్పులు గతంలో ఊహించినదానికంటే వేగంగా గ్రీన్‌లాండ్‌కు ముప్పుగా పరిణమిస్తాయని అభిప్రాయపడ్డారు.

సంప్రదాయ కెమెరా లెన్స్‌లకు కాలం చెల్లింది !




సంప్రదాయ కెమెరా లెన్స్‌లకు ఇక కాలం చెల్లినట్టే. సెల్‌ఫోన్లు, కెమెరాల్లో ఉపయోగించేందుకు వీలుగా భవిష్యత్ తరం సూక్ష్మ లెన్స్‌ను హార్వర్డ్ పరిశోధకులు తాజాగా ఆవిష్కరించారు. 'మెటా లెన్స్'గా పిలుస్తున్న ఈ కొత్త లెన్స్‌లో 'నానోఫిన్స్' అనే చిన్నచిన్న భాగాలు ఉంటాయి. ఇవి కాంతి వేగాన్ని నియంత్రిస్తాయి. ఇంద్రధనుస్సులోని అన్ని రంగులపై దృష్టిపెట్టగల సామర్థ్యం 'మెటాలెన్స్'కు ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సంప్రదాయబద్ధ కెమెరా లెన్స్‌లు పెద్ద పరిమాణంలో, వంగి ఉంటున్న సంగతిని గుర్తుచేశారు. వాటిని వెంట తీసుకువెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. అందుకు భిన్నంగా 'మెటాలెన్స్' బల్లపరుపుగా.. ఎక్కడికైనా తీసుకెళ్లేందుకు అనువుగా చిన్నగా ఉంటుందని తెలిపారు. కెమెరాలు, సెల్‌ఫోన్లు, వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్లలో సంప్రదాయ లెన్స్‌లకు బదులుగా మెటాలెన్స్‌ను ఉపయోగిస్తే.. తద్వారా కలిసొచ్చిన అదనపు చోటును బ్యాటరీలు, ఇతర హార్డ్‌వేర్‌ల పరిమాణాన్ని పెంచుకోవడానికి ఉపయోగించుకోవచ్చని వివరించారు.

హృద్రోగాలపై అవగాహన కల్పించేందుకు గుండె 'చిప్'



హృద్రోగాలపై మెరుగైన అవగాహన కల్పించేందుకు తోడ్పడే "గుండె చిప్"ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కొత్త ఔషధాలకు ప్రయోగపరీక్షలు నిర్వహించేందుకు దీనిని ఉపయోగించే వీలుంది. రక్తనాళాలు కుంచించుకు పోవడం వల్లే ఎక్కువగా గుండెపోటు, పక్షవాతం వంటి వ్యాధులు చుట్టుముడుతుంటాయి. కొవ్వు, కొలెస్ట్రాల్, ఇతర కొవ్వు పదార్థాలు రక్తనాళాల్లోని గోడలకు అంటిపెట్టుకుపోవడమే దీనికి ప్రధాన కారణం. దీన్ని కళ్లకు కట్టినట్లు చూపించేందుకు తాజా చిప్‌ను సింగపూర్‌లోని నాన్యంగ్ సాంకేతిక వర్సిటీ నిపుణులు అభివృద్ధి చేశారు. దీనిలో రక్తనాళాల గోడలతోపాటు రక్త ప్రసరణ వ్యవస్థపైనా ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించారు. చదరపు అంగుళం పరిమాణంలో ఉండే ఈ చిప్‌లో రెండు ప్రత్యేక గదుల్లాంటి నిర్మాణాలున్నాయి. కింద నిర్మాణంలో గాలి, పై నిర్మాణంలో రక్తం లాంటి ద్రవం ప్రవహింపజేసేలా వీటిని సిద్ధం చేశారు. కిందనుండే నిర్మాణంలో గాలి నింపినపుడు ఇది బుడగలా వ్యాకోచించి, కండరాలు కుంచించుకుపోయే పరిస్థితులను కల్పిస్తున్నట్లు పరిశోధకులు తెలిపారు.

సౌర కుటుంబం బయట నాలుగు కొత్త 'గురు' గ్రహాలు



సౌర కుటుంబం ఆవల గురుగ్రహాన్ని పోలిన నాలుగు కొత్త గ్రహాలను తాజాగా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. హైడ్రోజన్, హీలియం వంటి వాయువులతో నిండిన ఇవి (హాట్ జూపిటర్లు) చిన్న నక్షత్రాల (కుబ్జ తారల) చుట్టూ తిరుగుతున్నట్లు గుర్తించారు. ఈమేరకు హంగేరి రూపొందించిన 'ఆటోమేటెడ్ టెలిస్కోప్ నెట్‌వర్క్- దక్షిణ (హ్యాట్‌సౌత్) ఎక్సోప్లానెట్ సర్వే' టెలిస్కోప్‌లతో పరిశోధకుల బృందం వాటిని పరిశీలించింది. హ్యాట్స్-50, 51, 52, 53 అనే కుబ్జ తారలను కనుగొంది. వీటిచుట్టూ హ్యాట్స్- 59బీ, 51బీ, 52బీ, 53బీ అనే గ్రహాలు పరిభ్రమిస్తున్నట్లు గుర్తించారు. జర్మనీకి చెందిన మ్యాక్స్‌ప్లాంక్ ఖగోళ పరిశోధన సంస్థకు చెందిన థామస్ హెన్నింగ్ నేతృత్వంలో పరిశోధకులు వివరాలను వెల్లడించారు. ఈ గ్రహాల పరిభ్రమణ కాలం 10 రోజుల కంటే తక్కువేనని పేర్కొన్నారు. కొత్త గ్రహాల్లో హ్యాట్స్-50బీ అతి చిన్నదిగానూ, హ్యాట్స్-51బీ అతి పెద్దదిగాను గుర్తించారు. ఈ గ్రహ వ్యవస్థ భూమికి 2,300 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నట్లు కనుగొన్నారు.

జీవిత భాగస్వామి పరిమళంలో ఒత్తిడి చిత్తు



ఒత్తిడిలో ఉన్నపుడు జీవిత భాగస్వామి సువాసన కూడా ఔషధంగా పనిచేస్తుందని కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయ పరిశోధకుల తాజా అధ్యయనం తేల్చింది. భాగస్వామి పక్కన లేకున్నా.. వారి చొక్కాల నుంచి వచ్చే పరిమళమూ ఒత్తిడిని చిత్తు చేసేందుకు దోహదపడుతుందని గుర్తించింది. తాజా పరిశోధనల్లో భాగంగా కొంతమంది పురుషులను ఎంచుకుని.. వారు 24 గంటలపాటు టీ షర్ట్ ధరించేలా చూశారు. వారు వాసన సంబంధిత ఉత్పత్తులేవీ వినియోగించకుండా, పొగ తాగకుండా జాగ్రత్త పడ్డారు. అనంతరం వారి వాసన టీషర్టుల్లో ఇమిడిపోయేలా ప్రత్యేక పరిస్థితుల్లో నిల్వ ఉంచారు. తరువాత సదరు వ్యక్తుల జీవిత భాగస్వాములను పిలిపించి... క్రమ రహిత పద్ధతుల్లో వారికి టీషర్టులను అందజేశారు. వాటి వాసన చూపించారు. ఆపై వారిలో ఒత్తిడి పెంచేలా ముఖాముఖీలు నిర్వహించి.. మరోసారి క్రమరహితంగా టీషర్టుల వాసన చూపించారు. అనంతరం మహిళలందరి లాలాజలాన్ని విశ్లేషించారు. ముఖాముఖి అనంతరం జీవిత భాగస్వామి టీషర్టును వాసన చూసిన మహిళల లాలాజలంలో ఒత్తిడిని సూచించే కార్టిసాల్ హార్మోన్ తక్కువ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. భాగస్వామి కాకుండా ఇతరుల దుస్తుల వాసన పీల్చిన మహిళల్లో కారిస్టాల్ స్థాయి ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఘ్రాణశక్తి కాస్త ఎక్కువ ఉంటుందని.. అందుకే తమ పరిశోధనలో మహిళలే భాగ స్వామి చొక్కాల వాసన పీల్చేలా చూశామని పరిశోధకులు తెలిపారు.

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	డాలరు Vs రూపాయి	ముడి చమురు
72.46 ▼	41.10 ▼	230 ▼	0 ▶▶		▲
34,771.05	10,700.45	28,550 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	40,000 (కిలో (రూపాయల్లో))	63.87	69.87 (బ్రెంట్ ధర (డాలర్లలో..))

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
విప్రో	334.75	4.88
ఇన్ఫోసిస్	1,134.40	3.93
టీసీఎస్	2,860.00	3.92
ఐసీఐసీఐ బ్యాంక్	340.65	1.43
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్	2,480.05	1.38

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
కోల్ ఇండియా	306.00	-4.57
బీహెచ్ఈఎల్	102.20	-2.56
రిలయన్స్	949.00	-2.54
టాటా మోటార్స్	435.30	-2.30
టాటా స్టీల్స్	783.00	-2.16

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.87	64.07
యూరో	76.58	78.34
పౌండ్	86.32	88.15
ఆస్ట్రేలియా డాలర్	49.93	50.89
సింగపూర్ డాలర్	47.81	48.39

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,850	30,856
చెన్నై	28,850	30,856
బెంగళూరు	27,300	28,250
ముంబై	29,520	31,572
విజయవాడ	28,550	30,700

అమాంతం ఎగిసిన అదానీ సంపద

- 2017లో 125% వృద్ధి
- ముఖేష్ ఆస్తులు 78% పైకి
- డిమార్ట్ అధినేత సంపదలో 80% పెరుగుదల
- ఇతర కార్పొరేట్లదీ అదే దారి..



విశాలాంధ్ర-బిజినెస్ డెస్క్: దేశంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆదాయాలు పడిపోతుంటే మరోవైపు కార్పొరేట్ల నికర ఆస్తుల విలువ మాత్రం భారీగా పెరిగిపోతోంది. నోట్ల రద్దు, జీఎస్టీ అమలు లాంటి చర్యల వల్ల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే బడా పెట్టుబడిదారులు మాత్రం పెద్ద ఎత్తున బాగు పడ్డారు. వృద్ధిరేటు పడిపోయినా, ఉత్పత్తి రంగం దెబ్బతిన్నా... దేశంలోని బడా వ్యాపారవేత్తల ఆర్థిక రేఖ మాత్రం పడిపోలేదు. ఇందుకు నిదర్శనం గతేడాది పలువరి సంపద పరుగులు పెట్టడమే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మిత్రుడు గౌతమ్ అదానీ సంపద అమాంతం పెరిగింది. దేశంలోనే నౌకాశ్రయాల నిర్వహణలో అదానీ అతిపెద్ద కార్పొరేట్‌గా ఉన్నారు. బ్లూమ్‌బర్గ్ రిపోర్టు ప్రకారం 2017 ఏడాదిలో అదానీ నికర సంపద అత్యధికంగా 124.6 శాతం ఎగిసింది. 2017 డిసెంబర్ 31 నాటికి ఆయన మొత్తం సంపద 10.4 బిలియన్ డాలర్ల(సుమారుగా రూ.66 వేల కోట్లు)కు చేరింది. గతేడాది జనవరి నాటికి అదానీ ఆస్తులు 4.63 బిలియన్ డాలర్లు(సుమారుగా రూ.29 వేల కోట్లు)గా ఉన్నాయి.

అదానీ తర్వాత డిమార్ట్ యాజమాని రాధాక్రిష్ణన్ దమాని సంపద 80 శాతం పెరిగి 6.96 బిలియన్ డాలర్ల(సుమారుగా రూ.44 వేల కోట్లు)కు చేరింది. గతేడాది మార్చి నాటికి ఆయన ఆదాయం 3.88 బిలియన్ డాలర్లు(రూ.24.6 వేల కోట్లు)గా ఉంది. ధమానీ ప్రస్తుతం ముంబయి కేంద్రంగా అవెన్యూ సూపర్ మార్కెట్స్ గ్రూపులో భాగంగా డి-మార్ట్ స్టోర్లను నిర్వహిస్తున్నారు. 2017 మార్చిలో దమానీకి చెందిన అవెన్యూ సూపర్ మార్కెట్స్ లిస్టింగ్‌కు వచ్చింది. ఈ కంపెనీ ఈక్విటీ షేర్‌ను రూ.299తో ఇష్యూ చేసింది. కాగా జనవరి 8 నాటికి ఈ సూచీ విలువ అమాంతం 340 శాతం పెరిగి రూ.1,235కు చేరింది. దీంతో ఆయన ఆదాయం భారీగా పెరిగింది.

కాగా కార్పొరేట్ దిగ్గజం ముఖేష్ అంబానీ నికర సంపద 77.53 శాతం పెరిగి 40.30 బిలియన్ డాలర్ల(రూ.2.53 లక్షల కోట్లు)కు చేరింది. 2017లో ఆయన ప్రపంచంలోనే 20వ అతిపెద్ద కుబేరుడిగా గుర్తింపు పొందారు. కాగా 2017 జనవరిలో ముఖేష్ ఆదాయం 22.70 బిలియన్లు(లక్షా 44 వేల కోట్లు)గా ఉంది. గతేడాది కుమార్ బిర్లా, అజీమ్ ప్రేమ్‌జీ, ఉదరు కొటాక్, విక్రమ్ లాల్, లక్ష్మీ మిట్టల్‌ల నికర సంపద వరుసగా 50.41 శాతం, 46.72 శాతం, 44.87 శాతం, 44.03 శాతం, 36.11 శాతం చొప్పున పెరిగింది. అదే విధంగా పల్లోంజీ మిస్త్రీ(నిర్మాణ రంగం), సైరస్ పునవల్లా(చిన్న పిల్లల వ్యాక్సిన్ల తయారీ), శివ్ నాడార్(ఐటీ, హార్డ్‌వేర్)ల నికర ధనం వరుసగా 27.01 శాతం, 16.50 శాతం, 15.83 శాతం చొప్పున పెరిగి వరుసగా 17.40 బిలియన్లు(లక్షా 10 వేల కోట్లు), 9.32 బిలియన్లు(రూ.59 వేల కోట్లు), 13.90 బిలియన్ల(రూ.88 వేల కోట్లు)కు చేరింది.

మరోవైపు 2017 డిసెంబర్ 31 నాటికి ప్రపంచంలోనే అత్యంత కుబేరుడు జెఫ్ బెజోస్ సంపద 52 శాతం ఎగిసి 99 బిలియన్ల(రూ.6.28 లక్షల కోట్లు)కు చేరింది. జనవరి 2017లో ఆయన ఆదాయం 65 బిలియన్లు(రూ.4.12 లక్షల కోట్లు)గా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ పోర్టల్ అమెజాన్‌కు బెజోస్ వ్యవస్థాపకులుగా ఉన్నారు. రెండు, మూడు స్థానాల్లో ఉన్న బిల్ గేట్స్, వారెన్ బఫెట్‌ల నికర ఆస్తులు వరుసగా 12 శాతం, 17 శాతం పెరిగి 91.8 బిలియన్లు(రూ.5.82 లక్షల కోట్లు), 85.3 బిలియన్ల(రూ.5.39 లక్షల కోట్లు)కు చేరింది.

పెరిగిన సంపద..

పేరు	2017లో (డాలర్లలో)	ఇంతక్రితం (డాలర్లలో)	తేడా
గౌతం అదానీ	10.4 బిలియన్లు	4.63 బిలియన్లు	125%
రాధాక్రిష్ణన్ దమానీ	6.96 బిలియన్లు	3.88 బిలియన్లు	80%
ముఖేష్ అంబానీ	40.30 బిలియన్లు	22.70 బిలియన్లు	78%
జెఫ్ బెజోస్	99 బిలియన్లు	65 బిలియన్లు	52%
బిల్‌గేట్స్	91.83%	-	12%
వారెన్ బఫెట్	85.3 బిలియన్లు	-	17%

విజ్ఞానం

గుమ్మడి విత్తనాలతో మంచి నిద్ర



అవును నిజమే, మీరు బాగా నిద్ర పోవాలంటే గుమ్మడికాయ విత్తనాలను ఉపయోగించవచ్చు. అందులో పోషకాలను మాత్రమే కాకుండా, వీటిని సాయంత్రం సమయంలో తినడం వల్ల మీకు బాగా నిద్ర పట్టడానికి సహాయపడతాయి. గుమ్మడికాయ గింజలలో మెగ్నీషియం, ట్రిప్టోఫాన్ను కలిగి ఉంటాయి. ఈ విత్తనాలు మనకు జింకు, ఆరోగ్యవంతమైన కొవ్వును అందిస్తాయి. మీరు మంచంపై విశ్రాంతి లేకుండా పడుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లయితే అలాంటి సమస్యలను కేవలం ఆహారంతోనే పరిష్కరించవచ్చు. అందుకోసం నిద్రమాత్రలు వాడవలసిన అవసరం లేదు. గుమ్మడికాయ గింజలు మీ ఆహారంలో ఒక భాగంగా చేసుకున్నప్పుడు, రాత్రిపూట మీరు బాగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. గుమ్మడి కాయ విత్తనాలు వంటి కొన్ని రకాల ఆహారపదార్థాలు మన శరీరానికి విశ్రాంతిని కలుగజేసే స్థితిలో ఉంచడానికి సహాయపడతాయి. నిజానికి, మీ శరీరంలో కొనసాగే అంతర్గత రసాయనిక చర్యల ప్రక్రియల వల్ల మీకు విశ్రాంతి అనేది అవసరమవుతుంది. ఇలాంటి ప్రక్రియను వేగవంతం చేయటానికి గుమ్మడి విత్తనాలు అనేవి బాగా సహాయపడతాయి. గుమ్మడికాయ విత్తనాలు ట్రిప్టోఫాన్ను కలిగి ఉంటాయి. ఇందులో చెప్పుకోవడానికి ఏమీ లేకపోయినా అమైనో ఆమ్లాలను మాత్రం కలిగి ఉంటుంది. మీరు గుమ్మడికాయ గింజలను తిన్నప్పుడు ట్రిప్టోఫాన్ అనేది సెరోటోనిన్‌గా మార్చబడుతుంది. ఇది శరీరంలోని మెలటోనిన్ అనేది బాగా ఉత్పత్తి అవ్వడానికి సహాయపడుతుంది. మీ శరీరాన్ని నిద్రావస్థలోకి తీసుకువెళుతుంది.

ప్రయాణికులను వదిలేశారు

ఇండిగో మరో నిర్వాకం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఇటీవల వివిధ రకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ విమానాయ సంస్థ ఇండిగో తాజాగా మరో వివాదంలో చిక్కుకుంది. గతంలో ప్రయాణికుల పై చెయ్యి చేసుకుని వివాదాల్లో నిలిచిన ఈ సంస్థ ఈ సారి ప్రయాణికులను వదిలేసి వార్తల్లోకి ఎక్కింది. గోవా నుంచి బయలుదేరిన ఇండిగో విమానం ఏకంగా 14మంది ప్రయాణికులను అక్కడే వదిలేసి రావడం చర్చనీయంశంగా మారింది. సోమవారం రాత్రి గోవా నుంచి 10.50 గంటలకు బయలుదేరాల్సిన విమానం నిర్ణీత సమయానికి 25 నిమిషాల ముందుగానే విమానాశ్రయం నుంచి బయలుదేరింది. దీంతో 14 మంది ప్రయాణికులు విమానాశ్రయంలోనే ఉండిపోయారు. ఈ విమానం హైదరాబాద్‌కు రాత్రి 12.05 నిమిషాలకు చేరుకోవాల్సి ఉండగా, ఇక్కడికి రాత్రి 11.40 నిమిషాలకే చేరుకుంది. ఈ విషయంలో ఇండిగో అధికారులు మాత్రం తమ తప్పేమీ లేదని సోమవారం రాత్రి గం.10.25 నిమిషాలకు బోర్డింగ్ గేటు మూసివేయగా, ఈ ప్రయాణికులంతా రాత్రి 10.33 నిమిషాలకు గేటు వద్దకు వచ్చారని ఆరోపించారు. బోర్డింగ్ గేటు మూసివేయడానికి ముందే తమ సిబ్బంది హ్యాండ్ మైకులతో పలుమార్లు అనౌన్స్‌మెంట్ చేయడంతో పాటు ఫోన్లు చేశామన్నారు. అయితే వారు ఇచ్చిన ఫోన్ నెంబర్లు అన్ని కూడా వారి ట్రావెల్ ఏజెంట్ థామస్‌కుక్‌కు వెళ్లాయని, ఆయన ప్రయాణికుల ఫోన్‌నెంబర్లు ఇచ్చేందుకు నిరాకరించడంతో తాము బయలుదేరి వచ్చామని తెలిపారు. అయితే రాత్రి విమానం మిస్ అయిన ప్రయాణికులను మంగళవారం ఉదయం మరో విమానంలో ఉచితంగా తమ గమ్యస్థలాలకు చేర్చామని తెలిపారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ స్లీట్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సాహస యాత్రల కోసం రూపొందించిన హిమాలయాన్ మోడల్‌లో కొత్త వెర్షన్ స్లీట్‌ను రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రవేశ పెట్టింది. దీని ప్రారంభ ధర రూ.2,12,666 (ఆన్‌రోడ్)గా ఉంది. మొదటి 500 బైకులు ముందే అమర్చిన ఎక్స్‌ప్లోరర్ కిట్‌తో లభిస్తాయని రాయల్ ఎన్‌ఫీల్డ్ అధ్యక్షుడు రుద్రతేజ్ తెలిపారు. ఇవి ప్రత్యేకంగా ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో లభిస్తాయన్నారు. ఆసక్తి కలిగిన కొనుగోలుదార్లు కంపెనీ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని, 30 నుంచి అమ్మకాలు ప్రారంభిస్తామని చెప్పారు. ముందుగా బుక్ చేసుకున్న వారికి ముందుగా బైక్‌లు అందజేస్తామని, అన్ని రకాల భూభాగాలకు అనువుగా కొత్త హిమాలయన్ స్లీట్‌ను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.

మొండి బకాయిలపై మౌనం



- 21 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో.. రూ.100 కోట్లకుపైగా బాకీపడ్డ కంపెనీలు 1463
- ఒక్క ఎస్‌బీఐలోనే ఇటువంటి పద్దుల మొత్తం విలువ రూ.77,538 కోట్లు
- మొండి బకాయిల మొత్తం విలువ రూ.7.34 లక్షల కోట్లు
- సెప్టెంబర్ వరకూ ఆర్థికశాఖ చెప్పిన లెక్క

న్యూఢిల్లీ: 21 ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.100 కోట్లు లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాల చొప్పున 1463 మొండిబకాయి పద్దులు కలిగి ఉన్నట్టు ఆర్థికమంత్రిత్వశాఖ తెలిపింది. సెప్టెంబర్ చివరినాటికి ఈ లెక్కలు ఇచ్చింది. వీటిలో ఎస్‌బీఐకి రావాల్సిన రూ.100 కోట్లకుపైగా గల మొండి బకాయిల పద్దులే 265 ఉన్నట్టు తెలిపింది. వీటి మొత్తం విలువ రూ.77,538 కోట్లు. ఆ తర్వాతి స్థానంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఉన్నది. ఈ బ్యాంకుకు చెందిన 143 మొండి బకాయిల విలువ రూ.45,973 కోట్లు. మూడోస్థానంలో కెనరా బ్యాంకు ఉన్నది. చిన్న బ్యాంకుల్లో రూ.100 కోట్లకుమించిన మొండి బకాయిల జాబితాలో 79 పద్దులతో యూనియన్ బ్యాంక్ మొదటి స్థానంలో ఉన్నది. 68 ఖాతాలతో ఓరియంటల్ బ్యాంక్, 62 ఖాతాలతో యూసీవో బ్యాంక్ ఉన్నాయి. సెప్టెంబర్ చివరికల్లా ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) మొత్తం విలువ రూ.7.34 లక్షల కోట్లకు చేరుకున్నది. 2016,మార్చి 31వరకల్లా నిరర్థక ఆస్తుల జాబితాలో రూ.5000 కోట్లకుపైగా బకాయిపడ్డ 12 కంపెనీలపై దివాళా చట్టం కింద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వరంగ బ్యాంకులను ఆర్‌బీఐ ఇప్పటికే ఆదేశించింది. ఎన్‌పీఏలు పెరిగిపోవడంతో నూతన రుణాలిచ్చే సామర్థ్యాన్ని బ్యాంకులు కోల్పోయాయని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకుల మూలధన పునర్‌వ్యవస్థీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2.12 లక్షల కోట్ల సాయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చి వరకల్లా రూ.80,000 కోట్ల అందజేతకు పార్లమెంట్ నుంచి ఆమోదం కూడా కేంద్రానికి లభించింది.

హిమాలయా వైప్స్ ఫర్ మామ్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హిమాలయా నర్సింగ్ వైప్స్ ఫర్ మామ్స్ చర్మాన్ని మృదువుగా శుభ్రం చేస్తుందని సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రొమ్ము ఆరోగ్యం కోసం బిడ్డకు పాలు ఇవ్వడానికి ముందు ఆ తరువాత నర్సింగ్ వైప్స్‌ను ఉపయోగించవచ్చునని తెలిపింది. ఈ నర్సింగ్ వైప్స్ కొబ్బరి నూనె సుగుణాలను కలిగివుంటాయి. ఇవి చనుమొనలను మరింత మృదువుగా మారుస్తాయి. పొడిబారడాన్ని తగ్గించి, చర్మాన్ని సంరక్షిస్తాయి. వీటిని వాడేటప్పుడు ఒకవైపును బయటకు లాగి మృదువుగా చనుమొనల్ని, దాని చుట్టూ ఉండే ప్రాంతాన్ని శుభ్రం చేయాల్సి ఉంటుంది.

గోల్డెన్ హార్వెస్ట్ రైస్ బ్రాండ్ స్టాల్ ప్రారంభం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఫ్యూచర్ కన్స్యూమర్ లిమిటెడ్ (ఎఫ్‌సీఎల్)కు చెందిన 'గోల్డెన్ హార్వెస్ట్ రైస్ బ్రాండ్'ను సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆవిష్కరించారు. ప్రముఖ టీవీ యాంకర్ ఝాన్సీ లక్ష్మి, వర్ధమాన సినీనటి నివేత పేతురాజ్ అమీర్‌పేట్ బిగ్ బజార్‌లో ఘనంగా ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ప్రధాన ఆహారోత్పత్తులకు చెందిన విస్తృతశ్రేణిని పంపిణీ చేస్తున్న భారతీయ బ్రాండ్లలో గోల్డెన్ హార్వెస్ట్ ప్రముఖమైనది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రదర్శితమయ్యే గోల్డెన్ హార్వెస్ట్ టెలివిజన్ వాణిజ్య ప్రకటనల ద్వారా ఆహారం తయారీలో రైస్‌కు ఎంత ప్రాముఖ్యత ఉన్నదో చిత్రీకరించారు. వారు మాట్లాడుతూ గోల్డెన్ హార్వెస్ట్ సోనామసూరి రైస్‌తో చేసిన పొంగలి ఎంతో రుచికరంగా ఉంటుందన్నారు. స్విస్ సాంకేతికతతో తయారైన సార్టెక్స్ మెషినరీ ద్వారా ప్రాసెస్ చేసిన ఈ సోనామసూరి, పొన్ని రైస్‌లకు చెందిన విస్తృతశ్రేణిని గోల్డెన్ హార్వెస్ట్ అందిస్తోందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్, చెన్నై, బెంగుళూర్ నగరాలలో ఎలక్ట్రానిక్, ప్రింట్, సామాజిక ప్రసార మాధ్యమాలు, రేడియో, స్టోర్‌లోపల నిర్వహించే కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం ద్వారా ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

హెచ్‌డీఎఫ్‌సీకి అరుదైన ఘనత

న్యూఢిల్లీ: గృహ రుణ రంగానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ సోమవారం అరుదైన ఘనతను సాధించింది. ఈ సంస్థకు చెందిన షేర్ల ధరలు పెరగటంతో సంస్థ విలువ రూ.3 లక్షల కోట్లను దాటింది. క్యూఐపీ ద్వారా రూ.13,000 కోట్లను సేకరిస్తున్నట్లు వార్తలు రావ డంతో షేర్ ర్యాలీ చేసింది. ప్రస్తుతం అత్యధిక రూ.1,878వద్ద ట్రేడ్ అవుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు షేరు ధర 9.8శాతం పెరిగింది. దేశంలో ఏడోకంపెనీగా...గతంలో రూ.3లక్షల కోట్ల మార్కెట్ విలువను దాటిన భారతీయ కంపెనీలు ఏడు మాత్రమే. రిల యన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, మారుతీ సుజుకీ ఇండియా, ఓఎన్‌జీసీ కార్పులు మాత్రమే ఈ ఘనతను అందుకున్నాయి. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.6లక్షల కోట్లు. ఆ తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు ఉన్నాయి.

హజ్ యాత్రికులకు సబ్సిడీ రద్దు



న్యూఢిల్లీ : హజ్ యాత్రికులకు ఈ ఏడాది నుంచి రాయితీని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మైనారిటీలకు సాధికారత కల్పించడంలో భాగంగానే ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ మాట్లాడుతూ హజ్ సబ్సిడీని ఉపసంహరించినట్లు తెలిపారు. మైనార్టీలను సంతుష్టీకరణ లేకుండా, గౌరవ, మర్యాదలతో సాధికారులను చేసే విధానంలో భాగంగా హజ్ సబ్సిడీని ఉపసంహరించినట్లు నక్వీ చెప్పారు. సబ్సిడీ కోసం ఉద్దేశించిన నిధులను మైనారిటీల విద్యాభివృద్ధి, బాలికల సంక్షేమం కోసం వినియోగిస్తామని చెప్పారు. ఈ సంవత్సరం రికార్డు సంఖ్యలో 1.75 లక్షల మంది హజ్ యాత్రకు వెళ్తున్నారని తెలిపారు. 2022నాటికి హజ్ సబ్సిడీని క్రమంగా నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు 2012లో ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది 1,300 మంది మహిళలు హజ్ యాత్రకు వెళ్తున్నారు. 45 సంవత్సరాల కన్నా ఎక్కువ వయసుగల మహిళలు కనీసం నలుగురు బృందంగా ఏర్పడితే, వారితోపాటు పురుష సహచరుడు లేకపోయినా హజ్ యాత్ర చేసేందుకు అనుమతి లభించడంతో ఈ సంవత్సరం మహిళా యాత్రికుల సంఖ్య పెరిగింది.

ఆ గడియారం మహా ఖరీదు..

స్విట్జర్లాండ్ : సాధారణంగా ఓ చేతి గడియారం ధర ఎంత ఉంటుంది. బ్రాండెడ్ అయితే ఓ రూ.వెయ్యి నుంచి పదివేల దాకా ఉండొచ్చు. అయితే ఇప్పుడు వీటిల్లోనూ స్మార్ట్ వాచ్‌లు కూడా వచ్చాయి. వాటి ధర కూడా మహా అయితే వేలల్లోనే ఉంటుంది. మరి బంగా రంతో చేసిన చేతిగడియారాలు.. వజ్రాలు, రంగు రాళ్లు పొదిగినవైతే వాటి ధర రూ.లక్షలు, కోట్లలో ఉంటుంది. తాజాగా అలాంటి స్మార్ట్‌వాచ్‌నే విడుదల చేసింది స్విట్జర్లాండ్‌కు చెందిన టాగ్ హ్యూవర్ అనే చేతిగడియారాల తయారీ సంస్థ. దాని ధర అక్షరాల రూ.1.25కోట్లకు పైమాటే. కనెక్టెడ్ మాడ్యులార్ 45 స్మార్ట్‌వాచ్ పేరుతో టాగ్ హ్యూవర్ ఓ చేతిగడియారాన్ని విడుదల చేసింది. ఇప్పటికే మాడ్యులార్ 45 పేరుతో సాధారణ స్మార్ట్‌వాచ్‌ను తీసుకురాగా.. దాని ధర 1600 డాలర్లు మాత్రమే. ఇప్పుడు ఇదే పేరుతో డైమండ్ వెర్షన్‌లో వాచీని తీసుకొచ్చింది. దీని ప్రత్యేకత ఏంటంటే.. దీని డయల్, బెల్ట్‌ను 18 క్యారెట్ల పాలిష్డ్ వైట్ గోల్డ్‌తో తయారుచేశారు. అంతేగాక, 589 మేలిమి వజ్రాలను పొదిగారు. ఒక్కో వజ్రం ఖరీదు 334 డాలర్లు.

పతంజలి ఉత్పత్తులు ఇక ఆన్‌లైన్‌లో..

న్యూఢిల్లీ : ప్రముఖ ఆయుర్వేద సంస్థ పతంజలి తయారు చేస్తున్న ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల ఇకపై ఆన్‌లైన్‌లో విరివిగా లభి స్తాయి. ఉత్పత్తుల విక్రయాల కోసం ఫ్లిప్‌కార్ట్, అమేజాన్ లాంటి ఎనిమిది ప్రముఖ ఇ-కామర్స్ పోర్టళ్లతో ఈ సంస్థ మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. హరిద్వార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలో ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా రామ్‌దేవ్ మాట్లాడుతూ, ఇ-కామర్స్ పోర్టళ్ల సాయంతో తమ ఉత్పత్తులు హరిద్వార్ నుంచి హర్ ద్వార్(ప్రతి ఇంటి గుమ్మం ముందుకు)కు చేరుతాయన్నారు. ఈ ఏడాది 50వేల కోట్ల ఉత్పత్తులను తయారుచేస్తామని, వచ్చే ఏడాది నుంచి లక్ష కోట్ల ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు తమ సొంతపోర్టల్‌లో సంస్థ ఉత్పత్తులు లభిస్తున్నాయి. అయితే ఎక్కువ మందికి చేరువయ్యేందుకు ఎనిమిది ప్రముఖ ఇ-కామర్స్ పోర్టళ్లు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం మాల్, 1ఎంజీ, బిగ్‌బాస్కెట్, గ్రోఫర్స్, షాప్‌క్లూస్, స్నాప్‌డీల్ పోర్టళ్లతో సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఆయా పోర్టళ్ల ప్రతినిధులు, పతంజలి ఎండీ ఆచార్య బాలకృష్ణ తదితరులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు.

పన్ను ఎగవేత కేసు : పోలీసులకు లొంగిన నటి అమలాపాల్



చెన్నై: ప్రముఖ నటి అమలాపాల్ ఎట్టకేలకు క్రైమ్ బ్రాంచ్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పన్ను ఎగవేత కేసులో అమలాపాల్ కొన్ని నెలలుగా ఆరోపణలు ఎదుర్కొంటోన్న సంగతి తెలిసిందే. తప్పుడు చిరునామా పత్రాలు సృష్టించి రూ.20 లక్షల పన్ను ఎగ్గొట్టినట్లు ఆమెపై కేరళలో కేసు నమోదైంది. 430, 468, 471 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో ఇటీవల ఆమె కేరళ హైకోర్టును సంప్రదించి, ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో న్యాయస్థానం క్రైమ్ బ్రాంచ్ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. తర్వాత కేసు పరిశీలిస్తామని పేర్కొంది. దీంతో అమలాపాల్ సోమవారం తిరువనంత పురంలోని క్రైమ్ బ్రాంచ్ పోలీసుల వద్ద లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆమె తప్పుడు పత్రాలు చూపినట్లు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులను కలిసిన తర్వాత అమలాపాల్ మీడియాతో మాట్లాడటానికి నిరాకరించారు. గత ఏడాది అమలాపాల్ రూ. కోటితో ఖరీదైన కారును కొన్నారు. దాన్ని తప్పుడు పత్రాలు ఉపయోగించి, పాండిచ్చేరిలో రిజిస్టర్ చేయించారు. కేరళలో పన్ను ఎగవేయాలని ఆమె ఇలా చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఆధార్‌కు మరో భద్రతా ఫీచర్

న్యూఢిల్లీ : విశిష్ట ప్రాధికార గుర్తింపు సంఖ్య ఆధార్‌కు మరో భద్రతా ఫీచర్‌ను జతచేసింది భారత విశిష్ట ప్రాధికార గుర్తింపు సంస్థ(ఉడాయ్). ఆధార్ ధ్రువీకరణకు ప్రస్తుతం ఉన్న ఫింగర్‌ప్రింట్, ఐరిస్ స్కాన్‌తో పాటు ఫేస్ రికగ్నిషన్ ఫీచర్‌ను కూడా తీసుకొచ్చింది. ఈ మేరకు ఉడాయ్ సోమవారం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. జులై 1 నుంచి ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తుందని పేర్కొంది.'వయసు పెరగడం తదితర కారణాల వల్ల బయోమెట్రిక్ ధ్రువీకరణ చేసుకోలేని వారికి ఈ సదుపాయం బాగా ఉపయోగపడుతుంది' అని ఉడాయ్ తెలిపింది. ఇటీవలే ఆధార్ గోప్యతకు భద్రత కల్పిస్తూ వర్చ్యువల్ ఐడీ సదుపాయాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఎవరికైనా ఆధార్ నంబరును చెప్పాల్సి వస్తే 12 అంకెల బయోమెట్రిక్ సంఖ్యకు బదులుగా ఈ వర్చ్యువల్ ఐడీని చెప్పవచ్చు. ఈ ఐడీని ఎవరికి వారే ఉడాయ్ వెబ్‌సైట్ ద్వారా సృష్టించుకోవచ్చు. దీని ద్వారా ఆధార్ గోప్యంగా ఉంటుందని ఉడాయ్ పేర్కొంది. మార్చి 1 నుంచి ఈ వర్చ్యువల్ ఐడీ సదుపాయం అందుబాటులోకి రానుంది. ఇప్పటివరకు 119 కోట్ల బయోమెట్రిక్ ఆధార్ నంబర్లను ఇచ్చినట్లు ఉడాయ్ తెలిపింది. ఈ ఆధార్‌ను పలు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు అనుసంధానం చేయడాన్ని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే.

సాగుకు అనువైన

కొన్ని చెరకు రకాలు







చెరకు నాట్లు సమయం మొదలైంది. ఏ రకం విత్తనం నాటాలో తెలియక రైతులు సతమతమవుతున్న సమయం కూడా ఇదే. మంచి దిగుబడినివ్వాలి. చీడ-పీడలకు లోనుకానివై ఉండాలని ప్రతిరైతు కోరుకుంటాడు. అలాంటి కొన్ని రకాల గురించి తెలుసుకుందాం. మనకు మేలైన వంగడాలను రైతులకందించే చెరకు పరిశోధనా స్థానాలు మన రాష్ట్రంలో మూడు ఉన్నాయి. విశాఖ జిల్లాలోని అనకాపల్లి వద్దగల చెరకు పరిశోధనా స్థానం మొదటిది. కృష్ణాజిల్లా ఉయ్యూరు వద్దగల చెరకు పరిశోధనా స్థానం రెండవది. చిత్తూరు జిల్లా పెరుమాళ్లపల్లి వద్ద ఇంకో చెరకు పరిశోధనా స్థానం ఉన్నప్పటికీ, అక్కడ నుంచి విడులైన చెరకు రకాలు ఎక్కువగా లేవు. అనకాపల్లి, ఉయ్యూరు పరిశోధనాలయాల నుంచి విడుదలైన రకాలనే ఎక్కువగా నాటుతున్నారు. కొన్ని సందర్భాల్లో కోయంబత్తూరు సుగర్ క్రేన్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన రకాలను కూడా రైతులు ఎక్కువగా వినియోగించుకొంటున్నారు. స్వల్పకాలిక రకాలు, మధ్యకాలిక రకాలు, దీర్ఘకాలిక రకాలుగా విభజించారు. స్వల్పకాలిక రకాలు 9 నెలలకే పక్వానికి వచ్చి, ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభించిన తొలిదశలోనే నరకడానికి అనువుగా ఉంటాయి. మధ్యకాలిక రకాలు నాటిన 11 నుంచి 13 మాసాలకు పక్వానికి వచ్చి, నరకడానికి సిద్ధమవుతాయి. ఇక దీర్ఘకాలిక రకాలు 13 నెలల తర్వాతనే పక్వానికి వస్తాయి. (మనకు దీర్ఘకాలిక వంగడాల వినియోగం అంతగా లేదు) ముందుగా నరకడానికి అనువుగా ఉన్న భూముల్లో స్వల్పకాలిక రకాలను, కొంచెం ఆలస్యంగా నరకడానికి వీలైన భూముల్లో మధ్యకాలిక రకాలను నాటుకోవడం శ్రేయస్కరం.

2003 వి 46 : స్వల్పకాలిక వంగడం. ఉయ్యూరు పరిశోధనా స్థానం విడుదల చేసిన వంగడం ఇది. ఎక్కువమంది రైతులు వినియోగిస్తున్నది కూడా ఈ రకమే. దీనికి 'భరణి' అని నామకరణం చేసింది ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం. బహుళ ప్రజాదరణ పొందింది. 2010లో ఈ వంగడం విడుదలైంది. తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాలలో కూడా ఈ వంగడం సాగవుతోంది. చెరకు దిగుబడిలోనూ, పంచదార దిగుబడిలోనూ ముందుండటం ఈ వంగడం ప్రత్యేకత. హెక్టారుకు 125 నుంచి 135 టన్నులు దిగుబడినిస్తుంది. ఈ వంగడానికి బెట్టను తట్టుకొనే శక్తి కూడా ఉంది. అందువల్ల మెట్ట, మాగాణి భూములు రెండింటికీ అనువైనదిగా ఈ వంగడం గుర్తింపు పొందింది. అందుకే తక్కువ కాలంలో ఇతర రాష్ట్రాల్లో కూడా గుర్తింపు పొందింది.

ఇక మన రాష్ట్రంలోని ఫ్యాక్టరీల పరిధిలో కూడా ఈ వంగడం అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. కృష్ణాజిల్లా ఉయ్యూరు ఫ్యాకర్టరీ పరిధిలో 49 వాతం, చల్లపల్లి ఫ్యాక్టరీ పరిధిలో 57 శాతం విస్తీర్ణంలో ఈ వంగడం సాగవుతోంది. డెల్టా సుగర్స్ పరిధిలో 43 శాతం సాగులో ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని చాగల్లు సుగర్స్ పరిధిలో 34 శాతం, ఆంధ్ర సుగర్స్ పరిధిలో 20 శాతం, తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట ఫ్యాక్టరీ పరిధిలో 27 శాతం, చెల్లూరు ఫ్యాక్టరీ పరిధిలో 32 శాతం ఈ 2003 వి 46 వంగడం సాగవుతోంది. ఇక తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణవేణి పరిధిలో 25 శాతం, ఖమ్మం జిల్లా మధుకాన్ సుగర్స్ పరిధిలో 27 శాతం, కాకతీయ సుగర్స్ పరిధిలో 24 శాతం విస్తీర్ణంలో ఈ వంగడం సాగవుతోంది. ఎర్రకుళ్లు, కొరడా తెగుళ్లను ఈ వంగడం సమర్థవంతంగా తట్టుకొంటుంది. దుబ్బుచేత సంతృప్తికరంగా ఉంటుంది. ఒక మోస్తరు గాలులను తట్టుకొనే శక్తి ఈ వంగడానికి ఉండటంతో రైతులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

87 ఎ 298 : ఇది అనకాపల్లి పరిశోధనా స్థానం నుంచి విడుదలైన రకం. గడలు లావుగా ఉంటాయి. మాగాణి, మెట్ట భూముల్లో కూడా సాగుకు అనుకూలం. ఎకరానికి 50 నుంచి 60 టన్నుల దిగుబడినిస్తుంది. రసంలో పంచదార శాతం 20 వరకు ఉంటుంది. మొక్క, పిలక తోటల్లో కూడా సమాన దిగుబడినిచ్చే సామర్థ్యం ఈ వంగడానికి ఉంది. ఎర్రకుళ్లు తెగులను తట్టుకోగలదు. కాటుక తెగులుకు లొంగిపోతుంది. ఈ రకం నాటుకొనే రైతులు విత్తనాన్ని వేడినీటితో శుద్ధిచేసి నాటుకుంటే, కాటుక తెగులు బెడదనుంచి తట్టుకొంటుంది. 2003వి 46 రకం సాగులోకి రాకముందు ఈ 87ఎ 298 రకమే ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుండేది.

కో.91002 : ఇది కోయంబత్తూరు సుగర్‌కేన్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్ నుండి విడుదలైన పాత రకం. ఈ రకంలో మొలకశాతం బాగుంటుంది. దుబ్బుచేత బాగుంటుంది. పిలకలు ఎక్కువగా వచ్చేది కావడం వల్ల వెడల్పు బోదెలు వేసి నాటుకోవడం మంచిది. గడలు మధ్యస్థ లావుతో ఉంటాయి. పెరుగుదల బాగుంటుంది. ఎకరానికి 40 నుంచి 50 టన్నుల దిగుబడినివ్వగలదు. ఈ రకం లంక, గరప నేలల్లో నాటుకోవడం శ్రేయస్కరం. మెరక, మాగాణుల్లో కూడా నాటుకోవచ్చు. ఎర్రకుళ్లు, కాటుక తెలులును తట్టుకోగలదు. పీర్ పురుగుకు లొంగిపోతుంది.

2000 ఎ 56 : ఇది కూడా అనకాపల్లి పరిశోధనా స్థానం నుంచి విడుదలైన వంగడమే. ఎకరానికి 55 నుంచి 65 టన్నుల దిగుబడినివ్వగలదు. రసంలో పంచదార శాతం 16.5 వరకు ఉంటుంది. బెల్లం తయారుచేయడానికి అనువైన రకం. ఎర్రకుళ్లు తెగులును తట్టుకోగలదు.

2000 వి 59 : ఉయ్యూరు పరిశోధనా స్థానం నుంచి విడుదలైన రకం ఇది. హెక్టారుకు 125 టన్నుల దిగుబడినివ్వగలదు. రసంలో పంచదార శాతం 19 వరకు ఉంటుంది. నిటారుగా పెరుగుతుంది. ఎర్రకుళ్లు తెగులును తట్టుకుంటుంది. కొరడా తెగులుకు లోనవుతుంది.

- దాసరి ఆళ్వారస్వామి, 9393818199

అపరాలకు తెగుళ్ల బెడద

మెట్ట భూముల్లో అక్టోబర్‌లో వేసిన పెసర, మినుము పైరును తామర పురుగు, తెల్లదోమ ఆశించి, నష్టం కలుగజేస్తాయి. వైరస్ తెగుళ్లను వ్యాపింపజేస్తాయి.

- తామర పురుగు నివారణకు ఎసిఫేట్ గ్రాము లేదా ఫిప్రోనిల్ 1.5 మిల్లీలీటర్లు లేదా డైమిథోయేట్ 2.0 మిల్లీలీటర్లు లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు ఏదోఒక మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.5 మిల్లీలీటర్లు లేక ఎసిఫేట్ గ్రాము లేక ప్రొఫెనో ఫాస్ 1.5 మిల్లీలీటర్లు లేక ఎసిటామిప్రిడ్ 2.0 మిల్లీలీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా డైమిథోయేట్ 2.0 మిల్లీలీటర్లు లేదా మిథైల్ ఓ డెమటాన్ 2.0 మిల్లీలీటర్లు ఏదైనా ఒక మందును లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలి.
- పల్లాకు తెగులు, ఆకుముడత తెగుళ్లు ఆశించిన మొక్కలను తొలిదశలోనే గమనించి వాటిని పీకివేసి, తెగులు వ్యాప్తి కారకాలైన రసం పీల్చు పురుగులను నివారించాలి.







అధిక దిగుబడుల కోసం నాణ్యమైన నారు వాడండి

వరిసాగులో అధిక దిగుబడులు సాధించేందుకు నాణ్యమైన నారును వాడుకోవాలి. దాళ్వా సాగులో వివిధ రకాల తెగుళ్ల ఆశించడం వల్ల నారు సరిగా ఎదగకపోవడం, పూర్తిగా ఎండిపోవడం వంటివి జరుగుతాయి. అయితే ఆరోగ్యవంతమైన నారు పెరుగుదలకు సస్యరక్షణ పాటించాలి.

- తెగులు సోకని పంట నుంచి సేకరించిన విత్తనాన్ని మాత్రమే నారుపోయడానికి ఉపయోగించాలి.
- నారుమడిని పెంచే ప్రదేశం చుట్టూ గడ్డి లేకుండా శుభ్రం చేయాలి.
- ఎదిగే నారుని తెగుళ్లు ఆశించిన వెంటనే తగిన శిలీంధ్ర నాశినులను వాడి నివారించాలి.
- దాళ్వా వరి నారుమళ్లలో అగ్గితెగులు అధికంగా ఆశిస్తుంది. దాని నివారణకు ట్రైసైక్లోజోల్ 75 శాతం పొడిమందును 0.6 శాతం చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మచ్చతెగులు ఆశించినట్లయితే మ్యాంకోజెబ్ 50 శాతం 2.5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- తెగుళ్లు, పురుగులు ఎక్కువగా వ్యాపించకుండా ఉండాలంటే నారుమడిలో ఊద వంటి కలుపును ఎప్పటికప్పుడు నివారించాలి.

పత్తిలో మజ్జిగ తెగులు

- మజ్జిగ తెగులు నివారణకు నీటిలో కరిగే గంథకాన్ని లీటరుకు మూడు గ్రాములు చొప్పున లేదా కార్బండిజమ్ లీటరుకు గ్రాము కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పత్తిపంట తీత దశలో ఉండి ఆకులు వాడినట్లుగా కనిపిస్తుంది. ఆ సమయంలో తెగులు మందు లేదా పురుగుమందు పిచికారీ చేసేటప్పుడు, పొటాషియం నైట్రేట్ (13:0:45) కలిపి పిచికారీ చేయడంద్వారా పంటకు నత్రజని, పొటాష్ అందుతుంది. తద్వారా పంట బాగుండటమే కాకుండా, వేసిన పురుగు, తెగులు మందు సమర్థవంతంగా పనిచేస్తుంది.

మొక్కజొన్న

మొక్కజొన్న పంటను రబీ కోస్తా జిల్లాల్లో ఈనెల 15 వరకు విత్తుకోవచ్చు.

- ఎకరానికి 8 కిలోల విత్తనం వాడాలి. నేల స్వభావాన్ని బట్టి ఎకరానికి 26,666 నుంచి 33.333 మొక్కల సాంద్రత ఉండేలా చూడాలి. నిర్దేశిత మొక్కల సాంద్రత ఉన్నపుడు కండె బరువు 250 నుంచి 270 గ్రాములు ఉంటుంది.
- దుక్కి చేసిన నేలలో 75 సెంటీమీటర్లు లేదా 60 సెంటీమీటర్లు ఉండేటట్లు తూర్పు, పడమరలకు బోదెలు చేసుకోవాలి.
- విత్తనాన్ని బోదెకు ఒకవైపున పైనుంచి 1/3 వ వంతు ఎత్తులో 20 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవాలి.

చెరకు

ఖరీఫ్ పంట కాలంలో ఆరుతడి పంట లేదా స్వల్పకాలిక వరిసాగు చేసిన రైతులు తదుపరి చెరకు పంట సాగు కోసం నేల తయారీ పనులు మొదలు పెట్టుకోవాలి.

వేరుశనగ

- వేరుశనగ 25 నుంచి 30 రోజుల దశలో ఉన్నప్పుడు పచ్చదోమ, ఆకు తినే పురుగులైన ఆకుముడత, పొగాకు లద్దె పురుగు, శనగపచ్చ పురుగు ఆశించే అవకాశం ఉంటుంది.
- పచ్చదోమ నివారణకు డైమిథోయేట్ 400 మిల్లీలీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 60 మిల్లీలీటర్లు లేదా అసిటామిప్రైడ్ 60 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఆకుముడత, లద్దె పురుగు నివారణకు క్వినాల్ఫాస్ 400 మిల్లీలీటర్లు ఎదిగిన పురుగుల నివారణకు థయోడికార్బ్ 200 గ్రాములు లేదా న్యూవల్యూరాన్ 200 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి.
- పురుగు ఉధ్రుతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో 10 రోజుల తరువాత పై మందును మరోసారి పిచికారీ చేసినట్లయితే పురుగులను పూర్తిగా నివారణ చేయవచ్చు.

మాఘీ జొన్న

- పూత సమయంలో లేదా గింజ ఏర్పడే దశలో వర్షాలు కురిసినట్లయితే గింజ బూజు, బంక కారు తెగుళ్లు ఏర్పడటానికి అవకాశం ఉంది. వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- నివారణకు ప్రొపికొనజోల్ మందును 0.5 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పూత దశలో, గింజ ఏర్పడే దశలో వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

విశాలాంధ్ర సినిమా

మాధవన్ 'బ్రీత్' ట్రైలర్ విడుదల



ప్రముఖ నటుడు మాధవన్ తొలిసారి డిజిటల్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సిరీస్‌కు 'బ్రీత్' అనే టైటిల్ పెట్టారు. సైకలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సిరీస్‌ను మాయంక్ శర్మ తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ సిరీస్ టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఇప్పుడు ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌లో 'బిడ్డ ప్రాణాలకు ముప్పు ఉందని తెలిస్తే ఆ బిడ్డను బతికించుకోవడానికి తల్లిదండ్రులు ఏం చేయడానికైనా సిద్ధపడతారు. ఆఖరికి సైకోగా మారడానికి కూడా వెనుకాడరు. క్రిమినల్‌ని చంపడానికి క్రిమినల్‌గా మారాలి' అంటున్న డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఇందులో మాధవన్ కుమారుడు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుంటాడు. పిల్లాడు బతకాలంటే ఓ నెగిటివ్ గ్రూప్ రక్తం కావాలి. ఆ రక్తం అందుబాటులో లేకపోవడంతో పిల్లాడు ఆరు నెలలకు మించి బతకడని వైద్యులు చెబుతారు. 'నాకు చావాలని లేదు నాన్నా' అని బాబు తన తండ్రి మాధవన్‌తో అనడంతో ఎలాగైనా తన కుమారుడిని బతికించుకోవాలని అనుకుంటాడు మాధవన్. ఇందుకోసం ఓ నెగిటివ్ బ్లడ్ గ్రూప్ వారందరినీ హత్య చేస్తుంటాడు. అదే ఈ సిరీస్ కథ. ఈ సిరీస్‌ను అమెజాన్ తెరకెక్కిస్తోంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సిరీస్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఈ సిరీస్ విడుదల కాబోతోంది.



అల్లుడితో చిరంజీవి సందడి..



సంక్రాంతి పండగ సందర్భంగా చిరంజీవి తన అల్లుడు కల్యాణ్‌తో కలిసి ఇలా ఫొటోకు ఫోజిచ్చారు. చిరు పంచెకట్టులో నల్ల కళ్లద్దాలు పెట్టుకుని అదరగొట్టేస్తే, కల్యాణ్ జీన్స్ ప్యాంట్, షర్ట్‌తో కూల్‌గా ఉన్నారు. కల్యాణ్ త్వరలోనే వెండితెరకు పరిచయం కానున్నారు. ఆయన కథానాయకుడిగా ఓ సినిమా తెరకెక్కుతోంది. రాకేశ్ శశి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. వారాహి చలన చిత్రం పతాకంపై పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన సాయి కొర్రపాటి ఈ సినిమాను నిర్మించనున్నారు. అయితే ఈ చిత్రంలో కల్యాణ్‌కి జోడీగా అనుపమ పరమేశ్వరన్ నటించే అవకాశాలున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. మరోపక్క చిరంజీవి సైరాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సురేందర్‌రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కొణిదల ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌పై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి నుంచి ఈ చిత్రం రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది.

పెళ్లి పీటలెక్కనున్న తరుణ్?



టాలీవుడ్ లవర్‌బాయ్ తరుణ్ పెళ్లి పీటలెక్కనున్నారా? అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. తల్లి రోజా రమణి కోరిక మేరకు తరుణ్ ఎట్టకేలకు పెళ్లికి ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. దాంతో ఈ ఏడాదిలోనే తరుణ్ పెళ్లిపీటలెక్కబోతున్నారట. 'ఆదిత్య 369', 'అంజలి', 'మనసు మమత' 'శత్రువు' వంటి సినిమాల్లో తరుణ్ బాలనటుడిగా మెప్పించారు. 2000లో 'నువ్వే కావాలి' సినిమాతో హీరోగా పరిచయమయ్యారు.

తొలి సినిమాతోనే మంచి ఇమేజ్ సంపాదించుకున్న తరుణ్ టాలీవుడ్ లవర్ బాయ్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. చాలా కాలం తరువాత ఆయన 'ఇది నా లవ్‌స్టోరీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. రమేశ్ గోపి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తమిళ నటి ఓవియా కథానాయికగా నటిస్తున్నారు. ప్రేమకథా నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమా కాబట్టి ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేయనున్నారు.

నాని కనుమ కానుక...

సంక్రాంతి సందర్భంగా నేచురల్ స్టార్ నాని తన కొత్త సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌లతో అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కృష్ణార్జున యుద్ధం'. మేర్లపాక గాంధీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో నాని కృష్ణ, అర్జున్‌గా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. భోగి సందర్భంగా కృష్ణ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసిన నాని..సంక్రాంతి సందర్భంగా అర్జున్‌ను పరిచయం చేశారు. మంగళవారం కనుమ సందర్భంగా సినిమాలోని ఓ మాస్ పాటను ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. 'దారి చూడు దుమ్ము చూడు మామ..' అంటూ సాగుతున్న ఈ పాట ఆకట్టుకుంటోంది. పాటకు ముందు నాని.. 'పార్టీనా అని అంత మెల్లగా అడుగుతారేందిరా.. చిత్తూరు మొత్తం మన పలకల శబ్దం వినపడాల.. స్టార్ట్ మ్యూజిక్' అంటూ రాయలసీమ యాసలో మాట్లాడటం హైలైట్‌గా నిలిచింది. పెంచల్ దాస్ ఈ పాట పాడారు. ఇందులో నానికి జోడీగా అనుపమ పరమేశ్వరన్, రుక్సార్ మిర్ నటిస్తున్నారు. హిప్‌హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గరపాటి, హరీశ్ పెద్ది ఈ సినిమాకు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.




'రంగస్థలం' టీజర్ ఎప్పుడంటే?



అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ నటిస్తున్న సినిమా 'రంగస్థలం'. సమంత కథానాయిక పాత్ర పోషిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో చెర్రీ నీటిలో తెగ చిందులేస్తూ కనిపించారు. జనవరి 24న సాయంత్రం 4.15 గంటలకు సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు చెప్పారు. దీనికి చెర్రీ సతీమణి ఉపాసన స్పందిస్తూ.. దీని కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నట్లు ట్వీట్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'రంగస్థలం' సినిమాను నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్నారు. అనసూయ, జగపతిబాబు, ఆది పినిశెట్టి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి పూజాహెగ్డే ప్రత్యేక గీతంలో ఆడిపాడనున్నారు. మార్చి 30న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. 1985 నేపథ్యంలో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి షెడ్యూల్ రాజమండ్రిలో జరుగుతోన్నట్లు తెలుస్తోంది. పల్లెటూరి చుట్టూ సాగే ఈ సినిమాలో రామ్‌చరణ్, సమంత విభిన్న పాత్రలు, లుక్స్‌లో కనిపించనున్నారు.

నేను బతికే ఉన్నా..

'చంద్రముఖి' దర్శకుడు



'నేను బతికే ఉన్నా. నాకేం కాలేదు' అంటున్నారు ప్రముఖ దర్శకుడు పి.వాసు. వాసు చనిపోయారంటూ తాజాగా వార్తలు వెలువడుతున్నాయి. దాంతో ఆయన వెంటనే సోషల్‌మీడియా వేదికగా తాను బతికే ఉన్నానని వీడియో ద్వారా చెప్పుకున్నారు. 'ఆరు కిలోమీటర్లు వాకింగ్ చేసి ఇంటికి వెళ్లగానే నేను చనిపోయానని వదంతులు వస్తున్నట్లు వాట్సాప్‌లో నాకో సందేశం వచ్చింది. అది చూసి నవ్వుకున్నాను. ప్రజలకు నాపై ఇంత అభిమానం ఉందని తెలిసి సంతోషించాను కూడా. నేను బతికే ఉన్నాను. ఆరోగ్యంగానే ఉన్నాను. ఈ ఏడాది మూడు సినిమాలకు దర్శకత్వం వహిస్తున్నాను' అని తెలిపారు.



'వైఫ్ ఆఫ్ రామ్'లో మంచులక్ష్మి..

విభిన్న కథలు, పాత్రల్లో నటిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మంచులక్ష్మి. ఆమె నటిస్తున్న కొత్త సినిమా 'వైఫ్ ఆఫ్ రామ్'. 'బాహుబలి' సినిమాకు సహాయ దర్శకుడిగా పనిచేసిన విజయ్ యలకంటి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా టైటిల్ లోగోను విడుదల చేశారు. దీన్ని మంచులక్ష్మి ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. తన కొత్త సినిమాకు 'వైఫ్ ఆఫ్ రామ్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది వేసవిలో రామ్ భార్య కథను తెలుసుకోవడానికి సిద్ధంగా ఉండమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. పీపుల్స్ మీడియా, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రఘు దీక్షిత్ సంగీతం అందిస్తున్నారు.

లౌడ్‌స్పీకర్లకు అడ్డుకట్ట

లక్నో : ప్రార్థనాలయాల్లో అక్రమ లౌడ్ స్పీకర్లను నిరోధించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దేవాలయాలు, చర్చి, గురుద్వార, మసీదుల్లో అక్రమంగా యాంప్లిఫైయర్లు అమర్చరాదని కాలం చెల్లిన వాటిని తొలగించాలన్నారు. లాయరు మోతీలాల్ యాదవ్ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యపిటీషన్ దాఖలు చేసిన నేపథ్యంలో అలహాబాదు హైకోర్టు అనధికార యాంప్లిఫైర్లపై కొరడా ఝుళిపించింది. హైకోర్టు సూచనల ప్రకారం జనవరి 7న 10 పేజీల ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లను అనుమతించవద్దని పేర్కొంది. శబ్దకాలుష్యంగా పరిగణించి అనధికార సర్వీసులను జనవరి 20 నుంచి తొలగిస్తామని ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. యాంప్లిఫైర్ల వినియోగ అభ్యర్థన పత్రాలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. పారిశ్రామికవాడలు, వ్యాపార, ఆవాసాల ప్రాంతాలుగా విభజించి ఆయా ప్రాంతాల్లో ఎన్ని డెసిబెల్ల శబ్దం ఉండాలో కోర్టు విశదీకరించింది. నివాసాల ప్రాంతాల్లో 10 బహిరంగ సభల్లో 5 డెసిబెల్స్ ఉండాలని నిర్ధారించింది.

గ్యాంగ్‌రేప్ : బాలిక ఆత్మాహుతి

హమీర్‌పూర్ : ఉత్తరప్రదేశ్‌లోని మజహ్‌గావలో ఇంట్లోనే ఇద్దరు వ్యక్తుల అత్యాచారానికి బలైన 16 ఏళ్ల బాలిక నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. ఆదివారం ఆమె అత్యాచారానికి గురైందని, వారిద్దరు అదే గ్రామానికి చెందిన వరుసకు సోదరులయ్యేవారేనని ఎస్పీ దినేష్ కుమార్ వెల్లడించారు. ప్రైవేట్ కంపెనీలో తండ్రి పనికి, తల్లి బంధువుల ఇంట్లో మకర సంక్రాంతికి వెళ్లగా ఈ ఘటన జరిగిందన్నారు. వేధనలో ఉన్న ఆమె మంగళవారం ఉదయం కిరోసిన్ ఒంపుకొని నిప్పంటించుకుందన్నారు. నిందితుల్లో ఒకరిని పట్టుకున్నామని, మరొకరు పారిపోయారన్నారు. నిప్పంటించు కుంటున్న సమయంలో ఆమె సోదరుడు ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేశాడని ఈ క్రమంలో అతనికి కూడా గాయాలయ్యాయని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు.

బీజేపీ 'ఎన్నికల సమావేశం'పై ఆరా తీయండి

ఈసీని కోరిన సీపీఎం

న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) త్రిపుర శాఖ మంగళవారం ఎన్నికల కమిషన్ (ఈసీ)ని ఆశ్రయించింది. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ హాజరైన బీజేపీ 'ఎన్నికల సమావేశం' వ్యవహారంలో ఆరా తీయాలని కోరింది. ఈనెల 14న కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారిక నివాసంలో ఆ సమావేశం జరిగింది. సీపీఎం (తిపుర) కార్యదర్శి బిజన్ ధార్ ఈ విషయమై ప్రధాన ఎన్నికల కమిషనర్ (ఈసీసీ)కి సోమవారం లేఖ రాశారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్య ప్రణాళికలపై చర్చించేందుకు ఎన్ఎస్ఏ దోవల్ బీజేపీ నేతృత్వ సమావేశానికి హాజరయ్యారని, కాషాయ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడమే కాకుండా రాజకీయ దురుద్దేశంతో నిబంధనలనూ ఉల్లంఘించిందని, ఈ పార్టీపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 'ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా అధికారాన్ని దుర్వినియోగానికి పాల్పడకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉంది. ఈ వ్యవహారంలో విచారణ చేపట్టాలంటూ సరైన యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వండి' అని బిజన్ ధార్ తన లేఖలో పేర్కొన్నారు. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి వ్యూహాన్ని రచించేందుకే బీజేపీ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు.

జైళ్లలో 3లక్షల మంది విచారణ ఖైదీలు

సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు



న్యూఢిల్లీ : దేశంలోని వివిధ కేసుల్లో విచారణలో ఉన్న ఖైదీలు 2016 చివరినాటికి దాదాపు 3 లక్షల మంది ఉన్నారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 436 ఏ కింద వీరు బెయిల్‌కు అర్హులే అయినప్పటికీ తగిన చైతన్యం లేక జైళ్లలో మగ్గుతున్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు ఉత్తర్వు ఉన్నప్పటికీ ఆయా ప్రభుత్వాలు ఎంతమాత్రం స్పందించడం లేదు. జైళ్లలో మితిమీరి ఖైదీలు ఉంటున్నారని మాట్లాడటమే గానీ ప్రభుత్వంలో ఉన్న బాధ్యులు వీరికి బెయిల్ వచ్చే అవకాశం ఉందని కూడా చెప్పడం లేదు. దేశంలోని వివిధ రాష్ట్రాల జైళ్లలో 2016 చివరినాటికి మొత్తం ఖైదీలు 4,33,003 మంది ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. విచారణలో దాదాపు 3 లక్షల ఖైదీలలో ఉత్తరప్రదేశ్, బీహార్ జైళ్లలోనే 96 వేలమందికి పైగా ఉన్నారు. విచారణలో ఉన్న ఖైదీలలో 96 శాతం పురుషులు. వీరిలోనూ ఉత్తరప్రదేశ్ మొదటిస్థానంలో, బీహార్ రెండవ స్థానంలో ఉన్నాయి. మూడు రాష్ట్రాలల్లో ఒక్కొక్క రాష్ట్రంలో 20 వేల మంది చొప్పున ఉండగా 11 రాష్ట్రాల్లో 10 వేల చొప్పున ఉన్నారు. 4 శాతం మంది (12,288) మహిళలున్నారు. మూడు రాష్ట్రాల్లో వేయిమంది చొప్పున మహిళా ఖైదీలుండగా, ఐదు రాష్ట్రాల్లో 500 మందికి పైగా ఉన్నారని గణాంకాలు తెలియజేస్తున్నాయి.

భారత శిక్షాస్మృతి సెక్షన్ 436ను 2005లో సవరించి 436 ఏ గా రూపొందించారు. ఈ సెక్షన్ కింద ఖైదీకి బెయిల్ పొందే హక్కు ఉంటుంది. అయితే గరిష్టంగా శిక్షకు గురయ్యే అవకాశం ఉన్న కాలంలో సగం గడువు పూర్తయి ఉంటేనే బెయిల్ హక్కు లభిస్తుందని పై సెక్షన్ చెబుతుంది. మరణదండన అవకాశం గల సెక్షన్ కింద కేసు నమోదై ఉంటే అలాంటి ఖైదీలకు పైన పేర్కొన్న సెక్షన్ కింద బెయిల్ హక్కు ఉండదు. బెయిల్ పొందే హక్కుపై అవగాహన లేకపోవడం లేదా తగిన న్యాయ సహాయం అందకపోవడం వల్ల బెయిల్ పొందలేకపోతున్నారు.

ఇలాంటి కేసులను పరిశీలించి తగు చర్యలు తీసుకునేందుకు రాష్ట్రాలు సమీక్షా కమిటీలు ఏర్పాటుచేయాలని 2013లోనే కేంద్ర హోంశాఖ కోరింది. హోంశాఖ మార్గదర్శకాలను ఇంతవరకు పట్టించుకున్న రాష్ట్రాలు లేవని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇలాంటి కేసులను న్యాయమూర్తులు వారానికి ఒకసారి జైలులో విచారణకు సిట్టింగ్ ఏర్పాటు చేయాలని 2014లో రాష్ట్రాలను ఆదేశించింది. 2014 అక్టోబరు నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించాలని కూడా కోర్టు ఆదేశించింది. అంతేకాదు ఇలాంటి కేసులపై సమీక్షకు హోంశాఖతో సమన్వయం చేసుకుని పనిచేయాలని 2015 మే నేలలో లీగల్ సర్వీసెస్ అథారిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. జైళ్లలో విచారణలో ఉన్న ఖైదీలలో 67 శాతం మంది బెయిల్ పొందలేనంతగా పేదరికంలో ఉన్నారని న్యాయమూర్తులు మదన్‌బిలోకూర్, యుయు లలిత్‌తో కూడా సామాజిక న్యాయ బెంచ్‌ను గుర్తించింది. 2014 సెప్టెంబరులో కూడా హోంశాఖ రాష్ట్రాలకు రెండవసారి సూచనలిచ్చింది. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. రాష్ట్రాలలో చలనం లేదు.

శబరిమలలో తిరుమల తరహా ఏర్పాట్లు



తిరువనంతపురం : శబరిమలై కొండపై తిరుమల తిరుపతి సౌకర్యాలను కల్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు కేరళ ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని దర్శించి, అధ్యయనం చేసేందుకు త్వరలో నిపుణుల కమిటీ పంపుతామని దేవస్థానం, పర్యాటకరంగ శాఖల మంత్రి కడకంపల్లి సురేంద్రన్ విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యయనం కోసం ఆహ్వానించారన్నారు. అయితే అయ్యప్ప ఆలయం ఏడాది పొడవునా భక్తులకోసం తెరచి ఉండదు. నవంబరు నుంచి జనవరి వరకు మాత్రమే ఆలయ ప్రవేశం ఉంటుంది. ఈ రోజుల్లోనే దేశవిదేశాల నుంచి భక్తులు వస్తారు. ఇది కాకుండా మలయాళం నెల్లో మరో ఐదు రోజులు ఆలయం తెరచి ఉంటుంది. అడవిలో ఉన్న ఆలయం, అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టే అభివృద్ధి కార్యక్రమాలు తలపెడతామన్నారు. ఈ ఏడాది ఆలయ ఆదాయం రూ. 255 కోట్లు ఉండగా, గతేడాదికంటే మరో రూ. 25 కోట్లు అదనంగా వచ్చిందన్నారు.

ఆలయ ఆదాయాన్ని ప్రభుత్వం ఉపయోగించుకుంటుందన్న వాదనలను ఖండిస్తూ, ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 38 కోట్లు ఖర్చు చేయాలనుకుంటోందన్నారు. ఈ ఏడాదే ఈ పనులను ప్రారంభిస్తామని, అక్కడ వేస్టు మేనేజిమెంట్ చేపట్టడమే సవాలుతో కూడుకుందన్నారు. శబరిమలైను ప్లాస్టిక్ రహితంగా ఉంచాలని ప్రభుత్వం, దేవస్థానం కోరుతు న్నాయన్నారు. ఆలయ ప్రాంతంలో తాగి పారేస్తున్నందున ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను ప్రభుత్వం నిషేధించిందన్నారు. వ్యర్థాలతో పంబా నదికి కూడా ముప్పు పరిణమించిందని మంత్రి వెల్లడించారు. ట్రెక్కింగ్ మార్గంలో భక్తులు విశ్రాంతి తీసుకునే ప్రాంతాల్లో కేరళ వాటర్ సంస్థ ఔషధ తాగు నీటిని అందిస్తోందని సురేంద్రన్ వెల్లడించారు.

ఖాప్ పంచాయితీలు చట్టవిరుద్ధం

పరువు హత్యలను అడ్డుకోండి : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : కులాంతర వివాహం చేసుకున్న మేజర్లకు ఖాప్ పంచాయితీ నిర్వహించడం చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పంచాయితీ నిర్వహణపై ఎటువంటి సమాచారం అందినా తెలియచేయాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా,జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, డీవై చంద్రచూడ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న యువతీ యువకులపై దాడి చేసి పరువు హత్యలను నిరోధించేందుకు అమికస్ క్యూరీ రాజు రామచంద్రన్ సహాయపడాలని కోర్టు నిర్ధేశించింది. మేజర్లయిన ఇద్దరు పెళ్లిని ఖాప్ లేదా వ్యక్తిగతంగా కూడా ఎవరూ ప్రశ్నించరాదని ఆదేశిస్తు, కేసును ఫిబ్రవరి 5కు వాయిదా వేశారు. స్వచ్ఛంద సంస్థ శక్తివాహిని పిల్ దాఖలు చేయడంతో సుప్రీంకోర్టు పై విధంగా స్పందించింది. కులం లేదా మతానికి చెందిన పెద్దలు నిర్వహించే ఖాప్ పంచాయితీల తీర్పులు దారుణంగా ఉంటాయి. కులాంతర, మతాంత పెళ్లిళ్లు చేసుకున్నవారిని మతాన్ని లేదా కులాన్ని భ్రస్టు పట్టించారన్న నెపంతో పరువు హత్యలను ప్రేరేపిస్తున్నారు. ఖాప్ పంచాయితీలను నిర్వహించేవారిని మొదట సుప్రీంకోర్టు ఆహ్వానించి దంపతులను, మహిళలను హింసించే ఆచారాన్ని వదులు కోవాలని నచ్చచెప్పింది. ఈ విషయంలో ఆయా గ్రామాల్లో పోలీసులు కూడా మహిళలను రక్షించలేక అసహాయంగా నిలిచిపోతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, హర్యానాల్లో పరువుహత్యలు, ఖాప్ పంచాయితీలపూ దృష్టి పెట్టాలని అమికస్ కూరీని కోరింది.



హర్యానాలో 'పద్మావత్'కి చోటులేదు

చండీఘర్ : సంజయ్‌లీలా బన్సాలీ దర్శకత్వం వహించిన పద్మావతి ఇంకా కష్టాల సుడిగుండాల్లోనే ఉంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించినా బీజేపీ పాలిత రాష్ట్రాలు మాత్రం ప్రదర్శించేదిలేదని భీష్మించుకున్నాయి. హర్యా నాలో పద్మావత్‌ను ప్రదర్శించబోమని ఆరోగ్య శాఖ మంత్రి అనిల్ విజ్ వెల్లడించారు. ఈ సినిమాను నిషేధించాలని మంత్రిమండలి కోరుతోంది. చరిత్రను వక్రీకరించి నందున ఈ సినిమాను అంగీకరించబోమన్నారు. కేంద్ర సెన్సారు బోర్డు సినిమా ప్రదర్శనకు అంగీ కరించినా రాష్ట్ర ప్రభుత్వం విడుదలకు ఒప్పు కోపడం లేదు. శాంతిభద్రతల దృశ్యా ఈ సినిమాను నిషేధించాలని విజ్ ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి ఖట్టర్ నేతృత్వంలో మంత్రి మండలి సమావేశమై హర్యానాలో నిషేధానికి నిర్ణయం తీసుకుందన్నారు. పద్మా వత్‌ను హర్యానాలో నిషేధిం చామని సీనియర్ మంత్రి ఒకరు ట్వీట్ చేశారు.

ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన దీపికా పదుకోణే, షాహిద్ కపూర్, రణవీర్ సింగ్‌లు రాజపుత్ వర్గాల నుంచి వ్యతిరేకతను చవిచూశారు. భారతీయతకు ప్రతిబింబమైన రాణి పద్మావతి పాత్రను అనుచితంగా చిత్రీకరించారని విజ్ వివరించారు. కేంద్ర సెన్సారుబోర్డు ఈ చిత్రం పేరు పద్మావతిని పద్మావత్‌గా మార్చాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ నెల 25న ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది.

బార్మర్ రిఫైనరీపై బీజేపీ, కాంగ్రెస్ వాదులాట



పచ్‌ప్రద (రాజస్థాన్): రాజస్థాన్‌లో రూ. 43,129 కోట్ల విలువైన బార్మర్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు ప్రారంభానికి తాము గొప్పంటే తాము గొప్పంటూ అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లు వాదులాడుకున్నాయి. 2013 సెప్టెంబరు 22న ఈప్రాజెక్టుకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ శంకుస్థాపన చేసారని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, కేవలం ప్రాజెక్టులకు పునాది రాళ్లు వేయడానికే కాంగ్రెస్ పరిమితమైం దంటూ బీజేపీ విమర్శిస్తోంది. మంగళవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ పునాదిరాళ్లను వేయడం ద్వారా వివిధ ప్రాజెక్టులు కట్టేస్తున్నామంటూ ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఏమారుస్తోందని విమర్శించారు. దీనికి కాంగ్రెస్ స్పందిస్తూ తాము పునాది వేసిన ప్రాజెక్టుకే తిరిగి పునాది వేయడం ద్వారా మోడీ గొప్పలకు పోతున్నారని ఎదురు విమర్శ చేసింది. రక్షణ సిబ్బందికి ఒకే ర్యాంకు- ఒకే పింఛ(ఓఆర్ఓపీ)ను నినాదాన్ని అమలు జరుపుతామన్న తమ వాగ్దానాన్ని విన్నంతనే 2014 మధ్యంతర బడ్జెట్లో కేవలం రూ.500ల కోట్లను కేటాయించి పథకం ప్రారంభించినట్లు కాంగ్రెస్ గొప్పలు పోతోందని మోడీ చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తరువాత ఓఆర్ఓపీ లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశామన్నారు కాంగ్రెస్ కేటాయించిన రూ.500ల కోట్లకు బదులుగా తాము రూ.12, 000ల కోట్లను కేటాయించినట్లు ఆయన తెలిపారు. 29న అల్వార్, అజ్మీర్ లోక్‌సభ స్థానాలకు, మందలఘర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగునున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడీ పాల్గొన్నారు.

పిటిషనర్లకు లోయా మృతి సమాచారం అప్పగించండి



న్యూఢిల్లీ: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ బీహెచ్ లోయా మృతికి సబం ధించిన సమాచారం మొత్తాన్ని పిటిషనర్లకు ఒక వారంలోగా అప్పగించాలని మహారాష్ట్ర ప్రభు త్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసును దర్యాప్తు చేస్తున్న జస్టిస్ లోయా తన సహచరుని కుమార్తె వివాహానికి హాజరైన సందర్భంలో 2014 డిసెంబరు1న అనుమానాస్పదంగా మరణించారు. జస్టిస్ లోయాది సహజ మరణం కాదని ఆరోపిస్తూ తగిన న్యాయం జరిపించాలని డిమాండ్‌తో పాత్రికేయుడొకరు, మరో కాంగ్రెస్ కార్యకర్త వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా గోప్యత పాటించామంటూ మహారాష్ట్ర ప్రభుత్వం తరపున వాదించిన న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. అందుకే కేసుకు సంబంధించిన సమాచారం మొత్తాన్నీ సీల్డుకవరులో సుప్రీంకోర్టుకు అందజేశామన్నారు. కేసు వివరాలను తెలుసుకునే హక్కు పిటిషనర్లకు ఉందని న్యాయమూర్తులు జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ శంతన గౌదర్‌లు పేర్కొన్నారు. పిటిషనర్లు కూడా సమాచారాన్ని బహిర్గత పరచరాదని వారి తరపు న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను పాటిస్తామని పిటిషనరు న్యాయవాది హామీ ఇచ్చారు.

25న మిలీనియం ఓటర్లకు సత్కారం

మేఘాలయ సీఈఓ



షిల్లాంగ్: దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములవుతున్న 133 మిలీనియం ఓటర్లను జాతీయ ఓటరు దినోత్సవం 25న సత్కరించడానికి మేఘాలయ ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. జాతీయ స్థాయిలో మొత్తం 74,000లపైగా మిలీని యం ఓటర్లు ఉన్నారు. మేఘాలయలో 133 మంది మిలీనియం ఓటర్లున్నారని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఆర్ కర్కోంగోర్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం రోజున వీరందరికీ కొత్త ఓటరు గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించిన ప్రచార నమూనాల్లో ఒక నమూనాగా ఎంపికైన నైరుతి ఖాసీ హిల్స్ జిల్లాకు చెందిన బాలిక గ్రేస్ మార్వీన్‌కు ఈసీ సావనీర్‌ను, ఓటరు గుర్తింపు కార్డును అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. 2000 జనవరి ఒకటవ తేదీన జన్మించి 18 సంవత్సరాలు నిండిన వారిని మిలీనియం ఓటర్లుగా వ్యవహరిస్తున్నారు. మిలీనియం ఓటర్ల నందరినీ గుర్తించేందుకు స్థానిక పాలనాయంత్రాంగం సహకారం తీసుకుంటున్నామన్నారు.

'ఎల్ఈడీ' తప్పనిసరి : మహారాష్ట్ర సీఎం

ముంబై(మహారాష్ట్ర) : వీధి లైట్ల కోసం అన్ని స్థానిక సంస్థలు ఎల్ఈడీ బల్బులనే వాడాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. పట్టణ అభివృద్ధి సంస్థ(యుయుడీ) ఇటీవల చేసిన తీర్మానం ప్రకారం ఇక నుంచి స్థానిక సంస్థలు ఖర్చులను తగ్గించుకునేందుకు ఎల్ఈడీ బల్బులను వీధి లైట్లకు అమర్చాలని ఆదేశాలు జారీ చేసింది. 2017 ఎనర్జీ కన్వర్జేషన్ విధానం అనుసరించి ఈ ఆదేశాలు జారీ చేశామని అధికారులు తెలిపారు.

పెరిగిన కిడ్నాప్ కేసులు

జమ్మూ(జమ్మూకాశ్మీర్) : జమ్మూకాశ్మీర్‌లో మహిళలు, బాలికల కిడ్నాపు కేసులు 2016 కంటే 2017లో అధికంగా నమోదైయాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. గత ఏడాది 877 అపహరణ కేసులు నమోదు కాగా, 2016లో 775 కేసులు నమోదైయాయని ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి, పీడీపీ సభ్యుడు అంజుం ఫజ్లీ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వ సమాధానంలో తెలిపారు. అపహరణ కేసుల్లో గత ఏడాది 534 మంది అరెస్టుకాగా, 2016లో ఇలాంటి కేసుల్లో 479 మందిని అరెస్టు చేసినట్టు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

టీచర్ మృతి: 12 మంది విద్యార్థులకు గాయాలు

ఫగ్వారా (పంజాబ్ : బస్సు ట్రక్కును ఢీకొన్న సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న స్కూలు టీచర్ మృతి చెందగా, 12 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటన ఫగ్వారాకు 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారి వద్ద గోరయలో జరిగింది. సంగ్రూర్ జిల్లాలోని తుంగన్‌లో ప్రభుత్వ సీనియర్ సెకండరీ స్కూల్లో ఆర్ట్‌క్రాఫ్ట్ టీచర్‌గా పని చేస్తున్న గురుచరణ్ సింగ్ ఈ దుర్ఘటన మరణించారని గోరయ పోలీసు అధికారి పర్మిందర్ సింగ్ తెలిపారు.

ఒడిశాలో అన్ని పంచాయతీలకు నీరు

భువనేశ్వర్ (ఒడిశా) : అన్ని గ్రామ పంచాయతీలకు మార్చి 2019 నాటికి పైపుల ద్వారా తాగు నీటిని సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఒడిశా ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 6,801 పంచాయతీల్లో 5586 పంచాయతీలకే ప్రస్తుతం పైపుల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని అధికార ప్రకటన తెలిపింది. 15,265 నివాసాలకు ప్రస్తుతం పాక్షికంగా పైపుల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, ఈ ఏడాది మే నాటికి సంపూర్ణంగా నీటి సరఫరా చేయనున్నట్టు ఆ ప్రకటన తెలిపింది.

ఫడ్నవీస్‌పై మళ్లీ ఆందోళన : ఎన్సీపీ

ముంబై(మహారాష్ట్ర) : మహారాష్ట్రలోని దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వంపై ఎన్సీపీ రెండవ విడత ఆందోళనను ఆరంభించింది. ఎన్సీపీకు చెందిన అగ్రనేతలు వీధుల్లో తిరుగుతూ ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. ఫడ్నవీస్ ప్రభుత్వం ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందంటూ ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఈ సందర్భంగా 'హల్లా బోల్' (దాడి) పేరుతో రెండవ విడత ఆందోళన కార్యక్రమాన్ని ఆరంభించారు. మరాఠ్వాడాలోని తుల్జాపూర్‌లో జరిగిన 'రెండవ విడత ఆందోళన బాట'లో పార్టీ అగ్రనేతలు పాల్గొన్నారు.

'మహాదయి' జలాలపై కర్ణాటక మోసం : గోవా

పనాజీ(గోవా): మహాదయి నది నీటిని తాగు నీటి అవసరాకు వాడుతున్నామని అంటూ, చెరకు తోటలకు వాడుతూ కర్ణాటక మోసం చేస్తుందని గోవా ఆరోపించింది. గోవా తాగు నీటి అవసరాలకు మహాదయి నదీ జలాలను పంచుకునేందుకు కర్ణాటకతో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధమని గత వారం గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు మహాదయి నదీ జలాలను గోవాకు మళ్లించాలని కోరుతు గోవా సీనియర్ కౌన్సిల్ ఆత్మరాం నదకర్ణీ మహాదయి వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్‌కు 531 పేజీల నివేదికను సమర్పించారు.

సముద్రస్నానానికి వెళ్లి నలుగురు మృతి

నాగపట్నం : తమిళనాడులో మంగళవారం జిల్లాలో వేదారణ్యంలోని సముద్ర స్నానంకు వెళ్లి నలుగురు మృత్యువాతపడ్డారు. 'తాయి అమావాస్య'ను పురస్కరించుకుని సముద్రంలో పవిత్రస్నానం చేస్తుండగా 10 మంది నీటమునిగారని, వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. వారిలో నలుగురు చికిత్స పొందుతూ మృతిచెందారని చెప్పారు. ప్రతి ఏటా వేలాదిమంది భక్తులు బంగాళఖాతంలో సిద్దార్‌ఘాట్‌లో పవిత్రస్నానం చేసి వేదారణ్యంలోని వేదనారాయణేశ్వర్ ఆలయాన్ని సందర్శిస్తుంటారు.

16 మంది తమిళ జాలర్లు అరెస్ట్

రామేశ్వరం : కచ్చతీవు దీవి సమీపంలోని తమ జలభాగాల్లోకి ప్రవేశించారన్న ఆరోపణలతో 16 మంది తమిళనాడు జాలర్లను శ్రీలంక నావికాదళం మంగళవారం అరెస్టు చేసింది. రామేశ్వరంలోని మండపంకు చెందిన 2,500 మందికి పైగా జాలర్లు సోమవారం సముద్రంలో చేపల వేటకు బయలుదేరివెళ్లారని, కచ్చతీవు సమీపంలో శ్రీలంక నావికాదళం వెంటనే చేరుకుని అక్కడ ఉన్న జాలర్లను అరెస్టు చేసిందని, వలలను, వంద బోట్లను స్వాధీనం చేసుకుందని మండపం జాలర్ల విభాగం అసిస్టెంట్ డైరక్టర్ తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీపై రెండు కేసులు

రాయ్‌బరేలి : ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ దీపక్ సింగ్, ఆయన అనుచరులపై రెండు కేసులు నమోదు చేసినట్టు అదనపు ఎస్పీ శశి శేఖర్ సింగ్ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పర్యటన సందర్భంలో సోమవారం విధులు నిర్వహిస్తున్న భద్రతాసిబ్బందితో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై ఒక కేసు సోమవారం రాత్రి నమోదు చేశామన్నారు. మరొకటి రాహుల్‌కు తన సమస్యలు చెప్పుకోవాలని ప్రయత్నించిన వ్యక్తిపై ఎమ్మెల్సీతోపాటు ఆయన అనుచరులు దాడి చేశారన్న ఫిర్యాదు మేరకు మరొక కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

జమ్మూ శాసనమండలి నుంచి ప్రతిపక్షం వాకౌట్

జమ్మూ : జమ్మూ, కాశ్మీర్‌లో శాసనమండలి నుంచి ఎన్సీ సభ్యుడు సాజద్ అహ్మద్ కిట్చోలూను మార్షల్స్‌తో బయటకు పంపించి వేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ సభ్యులు, కాంగ్రెస్ సభ్యులు మంగళవారం సభ నుంచి వాకౌట్ చేశారు. కిట్చొలూ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ గులాంనబీ మోంగా నాయకత్వంలో సభ్యులు లెజిస్లేటివ్ కాంప్లెక్స్ ప్రవేశద్వారం మెట్లపై కూర్చుని ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి, చైర్మన్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

లాలూ అల్లుడికి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ : రైల్వే హోటల్స్ కేటాయింపు అవినీతి కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ అల్లుడు రాహుల్‌యాదవ్‌కు ఈడీ సమన్లు పంపినట్లు మంగళవారం అధికారవర్గాలు తెలిపాయి. రాహుల్‌యాదవ్ ఆయన అత్త, లాలూ భార్య రబ్రీదేవికి నిధులు తరలించాడన్న ఆరోపణలను లాలూ కుటుంబం తాజా ఎదుర్కొంటుంది. రాహుల్ యాదవ్ లాలూ ప్రసాద్ నాల్గవ కుమార్తె భర్త. ఈ కేసులో ఈడీ ఇప్పటికే లాలూ మరొక అల్లుడు శైలేష్‌కుమార్‌ను విచారించింది.

మహారాష్ట్ర ప్రభుత్వానికి ఇదో హెచ్చరిక... : శివసేన

న్యూఢిల్లీ : పూనేలో శనివారం 56 ఏళ్ల వ్యాపారి దేవన్ షా హత్య జరిగిన నేప థ్యంలో ఈ ఘటన మహారాష్ట్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అని శివసేన మంగళ వారం పేర్కొంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ రాష్ట్రంలో శాంతి, భద్రతలను పర్య వేక్షించడంలో విఫలమయ్యారని విమర్శించింది. శనివారం రాత్రి పూనేలోని దక్కన్ జింఖానాలో దేవన్‌షాను ఆయన ఇంటి బయట ఇద్దరు గుర్తు తెలియని దుండగులు కాల్చిచంపారు.

బాడీగార్డును కొట్టిన ఎంపీ సీఎం

ధార్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ బాడీగార్డ్‌పై చేయి చేసుకుని వివాదంలో చిక్కుకున్నారు. చౌహాన్ సోమవారం ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఆ సమయంలో బాడీగార్డ్‌ను కొట్టి పక్కకు లాగేయడం వీడియోలో రికార్డైంది. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన సర్దార్‌పూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో ఈ ఘటన జరిగింది. చుట్టూ బాడీగార్డ్‌లు ఉండగా సాధారణంగా తన పద్ధతిలో గబగబా నడుచుకుంటూ వెళ్తున్న చౌహాన్ కోపంగా ఓ బాడీగార్డ్‌ను కొట్టి అక్కడి నుంచి వేరేవైపుకు పంపేసినట్లు వీడియోలో రికార్డైంది. కొట్టిన తర్వాత మళ్లీ మామూలుగా ముందుకు వెళ్తున్నట్లు కనిపించింది.

విశాలాంధ్ర



నేడు మంగళగిరిలో ఎన్‌ఆర్‌టీ టెక్ ఐటీ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరుజిల్లా మంగళగిరి ఆటోనగర్ సమీపం లోని ఐటీపార్కు ఆవరణలో నూతనంగా నిర్మించిన ఎన్‌ఆర్‌టీ టెక్ ఐటీ సంస్థను రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీశాఖా మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభిం చనున్నారు. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి, పట్టణపార్టీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావులు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ గోగినేని రామాంజనేయులుతో కలసి ఎన్‌ఆర్‌టీ ఐటీ సంస్థ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఐటీ కంపెనీ ప్రతినిధులతో భేటీఅయి మంత్రి లోకేష్ పర్యటనపై చర్చించారు. ఉదయం 9.30లకు మంత్రి లోకేష్ ఎన్‌ఆర్‌టీ టెక్ ఐటీ సంస్థను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు వారు ఇన్‌చార్జి చిరంజీవికి, డీఎస్పీ రామాంజనేయులుకు వివరించారు. ఇదే సందర్భంగా ఐటీపార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన మరో 15 ఐటీ కంపెనీలను కూడా మంత్రి లోకేష్ ప్రారంభించనున్నారు. కాగా ఈ నెలాఖరున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళగిరి ఐటీ పార్కును సందర్శించి నూతనంగా ఏర్పాటుచేసిన పలు ఐటీ కంపెనీలను పరిశీలించనున్నట్లు వారు తెలిపారు.

మూగ యువతిపై అత్యాచార యత్నం



విశాలాంధ్ర-ఈపూరు : మానవత్వం మంట కలిసింది. వావి వరుసలు మరిచిన ఓ కామాంధుడు మూగ యువతిపై అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన గుంటూరుజిల్లా ఈపూరు మండలంలోని వనికుంట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బచ్చనబోయిన వెంకట్రామయ్య (పెదనాన్న వరుస), యువతి తండ్రి బచ్చనబోయిన వెంకటేశ్వర్లు ఇద్దరూ కలిసి రాత్రి పొద్దుపోయే వరకు ఈపూరులో మద్యం సేవించి వనికుంటకు చేరారు. వెంకటేశ్వర్లు మద్యం మత్తులో రోడ్డుపై పడిపోగా దీనిని ఆసరాగా చేసుకున్న వెంకట్రామయ్య వెంకటేశ్వర్లు కుమార్తె ఒంటరిగా ఉండటాన్ని గ్రహించి ఇంటిలోకి ప్రవేశించి అత్యాచారం చేసేందుకు యత్నించాడు. భయంతో యువతి కిటికీలోంచి దూకి బయటికి రాగా అది గమనించిన వెంకట్రామయ్య తలుపు తెరిచి పరారయ్యాడు. యువతి ఇంటి పక్కనే ఉన్న బంధువులను నిద్రలేపి విషయాన్ని చెప్పలేక వెంకట్రామయ్య ఇంటి వద్దకు తీసుకెళ్ళి మూగ సైగలతో అతను చేసిన అఘాయిత్యాన్ని బంధువులకు చూపించింది. బంధువుల సమాచారంతో పోలీసుల ఘటన ప్రాంతానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయాలపాలైన బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పట్టాభిరామయ్య తెలిపారు. కాగా, యువతి తల్లి రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యం కారణంగా మృతి చెందగా తండ్రి, కూతురు మాత్రమే ఇంటిలో ఉంటున్నారు.

గాలిపటాలు ఎగురవేస్తూ

అపార్టుమెంట్‌పై నుంచి పడి విద్యార్థి మృతి



విశాలాంధ్ర- నందిగామ : గాలిపటాన్ని ఎగురవేస్తూ అపార్టుమెంట్ టెర్రస్‌పై నుండి ప్రమాదవశాత్తు కాలుజారి క్రిందపడి 10వ తరగతి విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన సంక్రాంతి నాడు సోమవారం జరిగింది. కృష్ణాజిల్లా చందర్లపాడు మండలం, ముప్పాళ్ల గ్రామానికి చెందిన నేలవెల్లి చంద్రశేఖర్, అంజలి దంపతుల కుటుంబం తమ పిల్లల చదువు నిమిత్తం నందిగామ వచ్చి అద్దెకు నివాసముంటున్నారు. సంక్రాంతి పండుగ కావటంతో సరదాగా సోమవారం సాయంత్రం చందర్లపాడురోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో నివాసంవుంటున్న తోటి స్నేహితునితో కలసి అపార్టుమెంట్ పైకివెళ్లి గాలిపటాలు ఎగురవేస్తున్నారు. ఈ నేపథ్యంలో అపార్టుమెంట్ టెర్రస్‌పై నుంచి కాలుజారి క్రిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో నితీష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి నేలవెల్లి చంద్రశేఖర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి ఇంటర్, చిన్న అబ్బాయి నితీష్ కుమార్ 10వ తరగతి చదువుతున్నాడు. నితీష్‌కుమార్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



బండలాగుడు పోటీల్లో

గన్నవరం ఎడ్లు ప్రథమం

విశాలాంధ్ర-గుడివాడ : గత మూడు రోజులుగా ఎంతో ఉత్కంఠగా, ఉత్సాహంగా సాగిన జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన, పోటీలు సోమవారం రాత్రి ఘనంగా ముగిశాయి. కృష్ణాజిల్లా గుడివాడ రూరల్ మండలం, లింగవరం గ్రామ కె.కన్వెన్షన్‌లో ఎన్‌టీఆర్ 2 వైయస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన, పోటీలు ఈ నెల 12వ తేదీ నుండి 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో కాసనేని పవన్‌చౌదరి, గగనాచౌదరి (గన్నవరం)కి చెందిన ఎడ్ల జత 2432.9 అడుగుల దూరం లాగి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోగా గుడివాడ శాసనసభ్యులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ప్రథమబహుమతిగా రూ.1 లక్ష నగదు, జ్ఞాపికను అందజేశారు. టీయస్‌ఆర్ ఇన్‌ఫ్రా డవలపర్స్, సాయిశ్రీ కన్‌స్ట్రక్షన్స్ (కొప్పురావూరు, గుంటూరు)కు చెందిన ఎడ్ల జత 2400 అడుగుల దూరం లాగి ద్వితీయస్థానం, ఇందిరాఫుడ్స్ (గుణదల)కు చెందిన ఎడ్ల జత 1947.7 అడుగుల దూరంతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

ద్వితీయ బహుమతిగా రూ.80వేలు నగదు, జ్ఞాపిక, తృతీయబహుమతిగా రూ.70వేలు, జ్ఞాపికలను వైసీపీ గన్నవరం ఇన్‌ఛార్జ్ యార్లగడ్డ వెంకట్రావ్, పెదన వైసీపీ ఇన్‌ఛార్జ్ ఉప్పాల రాంప్రసాద్‌ల చేతులమీదుగా అందజేశారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న మిగతా ఎడ్ల జతలకు కూడా కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఎన్‌టీఆర్, వైయస్‌ఆర్‌లు చరిత్రలో నిలిచిపోయే యుగపురుషులని అన్నారు. వారి కీర్తిప్రతిష్ఠలకు భంగం వాటిల్లకుండా రాబోయే రోజులలో తమ ట్రస్ట్ ముందుకు సాగుతుందన్నారు. ఎన్‌టీఆర్ 2 వైయస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే నాని అన్నారు. ఎడ్ల బండలాగుడు పోటీలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలకు పురుగుమందిచ్చి తండ్రి ఆత్మహత్యాయత్నం

చిన్నారుల పరిస్థితి విషమం



విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : అత్తగారింట్లో ఉన్న చిన్నారులను తీసుకువెళ్లడానికి వచ్చిన అల్లుడు తాను పురుగుల మందు తాగి తన ఇద్దరు పిల్లలకు కూడా తాగించిన ఘటన కర్నూలుజిల్లా కొలిమిగుండ్ల మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల మేరకు అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మునుస్వామి, లక్ష్మీదేవిలు తన కుమార్తె సౌభాగ్యను పదేళ్ల క్రితం అనంతపురం జిల్లా గుత్తి పట్టణానికి చెందిన కంబగిరి స్వామికి ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి మహీధర్ (5), గాయత్రి (7) అనే చిన్నారులు ఉన్నారు. అవ్వతాతలు గుత్తి పట్టణానికి వెళ్లి చిన్నారులను సంక్రాంతి పండుగకు మూడు రోజుల క్రితం తీసుకు వచ్చారు. కంబగిరి స్వామి అక్కడికి వచ్చి తన పిల్లలను ఊరికి తీసుకుపోతున్నానంటూ బైక్‌పై ఎక్కించుకుని వెళ్లాడు. గ్రామ శివారులో ఉన్న కూల్‌డ్రింక్ షాప్ వద్ద కూల్‌డ్రింక్ బాటిల్ కొనుగోలు చేసి బాటిల్‌లో పురుగులమందు కలిపాడు. చిన్నారులకు తాగించి, తానూ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు ముగ్గురిని తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చెన్నంపల్లి కోటలో తలారులపై దాడి

విశాలాంధ్ర-తుగ్గలి : కర్నూలుజిల్లా చెన్నంపల్లి కోటలో గుప్తనిధుల కోసం గత 32 రోజులుగా తవ్వకాలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా అధికారులు, పనివారు తమ ఊళ్లకు వెళ్లడంతో తవ్వకాలకు పండుగ విరామం ప్రకటించారు. కోటలో తవ్వకాలు జరుగుతున్న ప్రదేశంలో ఇద్దరు తలారులను రాత్రి వేళ కాపలాగా ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలారులపై రాళ్లతో దాడి చేశారు. తలారులు భయాందోళనకు గురై ఎత్తుగా ఉన్న కోట గోడ ఎక్కి కేకలు పెట్టడంతో గ్రామంలోని ప్రజలు పెద్దఎత్తున కోట వద్దకు చేరుకోవడంతో గ్రామస్తులను చూసి దుండగులు పారిపోయారు. సమాచారం తెలుసుకున్న సీఐ విక్రమసింహా తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. గుప్తనిధులను ఎత్తుకు పోవడానికి గుత్తి పట్టణానికి చెందిన వ్యక్తులు వచ్చి ఉంటారని సీఐ తెలిపారు. ఇద్దరు తలారులను కాపలా పెట్టడం సరికాదని, తలారులతోపాటు పోలీసులను కూడా కోటకు కాపలా ఉంచాలని గ్రామస్తులు సీఐని కోరారు. మరలా ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని సీఐ గ్రామస్తులకు తెలిపారు.

దళారులదే ఇష్టారాజ్యం

- అనుమతుల్లేకుండానే సంతల నిర్వహణ
- వ్యాపారులవద్ద అడ్డగోలు వసూళ్లు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగండి
- కనీస సదుపాయాలూ కరవు



విశాలాంధ్రబ్యూరో-విజయనగరం : గ్రామీణ ప్రజలకు నిత్యావసరాలను అందుబాటులో ఉంచే సంతలు ప్రయివేటు వ్యక్తుల చేతిలో ఇష్టారాజ్యంగా మారాయి. వారు ఆడింది ఆటగా మారింది. ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పాటించకుండానే అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏ సంతలో చూసినా కనీస సౌకర్యాలు గానీ, సదుపాయాలు గానీ లేకపోయినా, వ్యాపారులనుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. వారంవారం వేలాది రూపాయలు దోచుకుంటున్నా అధికారుల్లో కనీస చలనం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆధునిక మార్కెట్ సౌకర్యాలు విస్తృతమైనా, మల్టీ నేషనల్ కంపెనీలు షాపింగ్ మాల్స్‌తో విస్తరిస్తున్నా గ్రామీణ ప్రజల్లో అధికశాతం ఇప్పటికీ గ్రామాల్లో జరిగే సంతలపైనే ఆధారపడి ఉన్నారు. నిత్యావసరాలు, కూరగాయలు, ఇతర వస్తువులకోసం వారానికోరోజు తమకు సమీపంలో జరిగే సంతలకు వెళ్లడం ఇప్పటికీ ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల కొనుగోలు కోసం ఏకైక అవకాశం ఉన్న మార్కెట్ సంత మాత్రమే. ఒక్కో సంతలో ప్రతివారం లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వందలాది మంది గుమిగూడే అతిపెద్ద కూడలిగా జరిగే ఈ సంతలపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించడం లేదు. దీంతో ఇక్కడ దళారులు, అక్రమ వ్యాపారులదే ఇష్టారాజ్యంగా మారింది. ఇష్టానుసారం అధిక ధరలను వసూలు చేస్తున్నా, నాణ్యత లేకపోయినా, నకిలీ వస్తువులను, నాశిరకం వస్తువులను విక్రయిస్తున్నా ప్రశ్నించే వ్యక్తులే కరవయ్యారు. గిరిజన ప్రాంతాల్లోనైతే పరిస్థితి మరీ దారుణం. ఇక్కడ విక్రయించే వస్తువుల్లో 80శాతం ప్రముఖ కంపెనీల పేరుతో విక్రయించేది నకిలీ సరకులే. తూకంలో మోసం కూడా ఇక్కడ నిత్యకృత్యం. జిల్లాలో ఏదో ఒకచోట నిత్యం సంత జరుగుతునే ఉంటుంది. డజనుకు పైగా ప్రముఖ సంతలున్నాయి. వీటిలో కొన్ని సంతలైతే పశువుల విక్రయానికి ప్రసిద్ధి. చాలాచోట్ల లక్షలాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. అయితే వీటిపై ఎక్కడా పంచాయతీ అధికారులు గానీ, తూనికలు కొలతల అధికారులు గానీ, ఆహార తనిఖీ అధికారులు గానీ తనిఖీ చేసిన ఘటనలు చాలా స్వల్పం. కొన్ని సంతలైతే కేవలం పశువుల అక్రమ వధకు అడ్డాగా కూడా మారిపోయాయంటే, సంతలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ముఖ్యంగా చాలా సంతలు ప్రయివేటు వ్యక్తుల గుప్పెట్లో ఉన్నాయి. బొద్దాం, అలమండ, మోపాడ, పెదమానాపురం, అచ్యుతాపురం, వెంగాపురం, కందివలస తదితర సంతల్లో ప్రయివేటు వ్యక్తులదే పెత్తనం. వాస్తవానికి జిల్లాలోని చాలా సంతలకు ప్రభుత్వం నుంచి అనుమతులే లేవు. ఈ సంతల నిర్వహణకు పంచాయతీ శాఖ నుంచి అనుమతి ఉండాలి. కానీ ఏడాది నుంచి సంత నిర్వాహకులు అనుమతి తీసుకోవటం లేదు. అలాగే సంతల పర్యవేక్షణ కమిటీలు ప్రతి సంతకు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఎక్కడా ఈ కమిటీల జాడ లేదు. ఈఓపీఆర్‌డీదే ఈ సంతలపై పర్యవేక్షణాధికారం. పర్యవేక్షణ కమిటీలో ఆ ప్రాంత ఎస్‌ఐ, ఏఎంసీ కార్యదర్శి, మండల పశువైద్యాధికారి, జంతు సంక్షేమ సంఘం ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ముఖ్యంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి సంతలో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, పశువులకు నీటి సదుపాయం, ఇతర కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఏ సంతలో కూడా ఇవి మచ్చుకు కూడా కనిపించవు. ఇలాంటి నిబంధనలు, జీవోలు ఉన్నాయన్న విషయం అధికారులకే తెలియదు. అలాగే సంతల్లో విక్రయించే పశువులకు ఆశీలు కింద ఎంత వసూలు చేయాలో కూడా ప్రభుత్వం నిర్దేశించింది. మేకకు రూ.3, పశువుకు రూ.5, కోడికి రూ.2 చొప్పున మాత్రమే వసూలు చేయాలి. కానీ సంతల్లో ఈ పరిస్థితి లేదు. కొన్ని సంతల్లోనైతే పశువుకు రూ.50 నుంచి రూ.100, కోడికి రూ.30 వరకు వసూలు చేసి గ్రామీణులను అడ్డంగా దోచుకుంటున్నారు. పండిన పంటలు, కూరగాయలను విక్రయించడానికి సంతకు వచ్చేవారి వద్దనుంచి కూడా నిర్వాహకులు భారీగా దండుకుంటున్నారు. ప్రతి సంతకు వేలం పాట నిర్వహించి, పాడుకున్న వ్యక్తికి ఆశీలు వసూలు చేసుకొనే అవకాశం ఇవ్వాలి. కానీ ఏడాదిగా ఎక్కడా వేలంపాట నిర్వహించలేదు. ఆయా సంతల స్థలం యజమానులు, లేదా గతంలో వేలం పాడిన వ్యక్తులే ఇప్పుడు కూడా ఇష్టానుసారం వసూలు చేసుకుంటున్నారు. వీరు అడిగినంత మొత్తం చెల్లించకపోతే వ్యాపారులను, విక్రయానికి వచ్చిన వ్యక్తులను కనీసం సంతల్లో అడుగు కూడా పెట్టనివ్వరంటే వీరి దౌర్జన్యాలు ఎంత పెచ్చుమీరిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వారం వారం నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుంటూ, పంచాయతీశాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బంది, సంతల్లో జరుగుతున్న అక్రమాలపట్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరి అవినీతి కారణంగా ప్రభుత్వం వేలాది రూపాయల ఆదాయాన్ని కోల్పోతోంది. ఇకనైనా సంతలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తారని ఆశిద్దాం.

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

సీఎం చంద్రబాబునాయుడు



విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి : మన సంస్కృతీ సంప్రదాయాలు భగవంతుడిచ్చిన వరమని వాటిని మన ఆస్తిగా భావించాలని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి సందర్భంగా ఈ నెల 13 నుండి నాలుగు రోజుల పాటు స్వగ్రామం అయిన నారావారిపల్లెలో వేడుకలు జరుపుకొని మంగళవారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో టీటీడీ కళ్యాణ మండపంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

సంక్రాంతి వేడుకలు జన్మభూమి అయిన నారావారి పల్లెలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. కష్ట సుఖాలను పాలుపంచుకోవడానికి, జన్మభూమి రుణం తీర్చుకోవడానికి గతంలోకన్నా భిన్నంగా పండుగ వాతావరణం లో 2 నుండి నేటి వరకు జన్మభూమి - మా ఊరు, భోగి, సంక్రాంతి, కనుమలు జరుపుకొనే విధంగా కార్యక్రమాలని రూపొందించి అమలు చేసుకుంటున్నామని అన్నారు. ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని స్మార్ట్ విలేజి, స్మార్ట్ సిటీ పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. నారావారిపల్లెలో నేడు 30 పడకల ఆసుపత్రి ప్రారంభించామని. ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం ఒక ప్రయోగాత్మకంగా మోడల్‌గా నిర్మించామని. మూడు దయాలసిస్ యూనిట్‌లు, 40 మంది దాక్టర్లు ఉండే విధంగా రూపొందించామన్నారు. పూతలపట్టు- నాయుడుపేట 6 లైన్ల రహదారికి, బెంగుళూరు- చిత్తూరు-క్రిష్ణగిరి, పలమనేరు - మదనపల్లె, చిత్తూరు-రాణిపేట రహదారుల విస్తరణతో చిత్తూరు జిల్లా కేంద్రానికి మంచి అత్యాధునిక రహదారులతో అనుసంధానమవుతుందని అన్నారు. హంద్రీ-నీవా పుట్టపర్తి వద్ద చిన్న సమస్యల వల్ల ఆలస్యమైందని, త్వరలో వాటిని అధిగమించి మొదట మదనపల్లెకి, తరువాత పుంగనూరు, పలమనేరు, కుప్పంకు తాగునీరు, సాగునీరు అందిస్తామని, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్‌లు కూడా నిర్మించనున్నామని అన్నారు. గాలేరు-నగరికి సంబంధించిన మల్లె మడుగు, బాలాజీ రిజర్వాయర్‌ను పూర్తి చేసి సోమశిలతో వీటిని నింపి కరవు రహిత జిల్లాగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మదనపల్లె టమోటా హబ్‌గా మారనున్నదని దీనికోసం జపాన్ కంపెనీ ముందుకు వచ్చిందని, కూరగాయలకు కుప్పం కేంద్రంగా నిలవనున్నదని అన్నారు. అన్ని వర్గాలను సమతుల్యం చేస్తూ మామిడి, సెరీకల్చర్, డైరీ, హార్టీకల్చర్‌లకు ప్రాధాన్యతనిస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. చిత్తూరు జిల్లాలో ఉన్నన్ని దేవాలయాలు ఎక్కడా లేవని, టూరిస్ట్ హబ్‌గా రూపుదిద్దుకోను న్నదని తెలిపారు. మీడియా సమావేశంలో మం త్రులు నారా లోకేష్, కామినేని శ్రీనివాస్, జిల్లా పరిషత్ చైర్మన్ గీర్వాణి, చిత్తూరు ఎంపీ శివ ప్రసాద్, తుడా చైర్మన్ నరసింహ యాదవ్, చిత్తూరు మేయర్ కటారి అనురాధ, కలెక్టర్ పి.ఎస్. ప్రద్యుమ్న, జేసీ గిరిషా, జేసీ 2 చంద్రమౌళి, సబ్ కలెక్టర్ నిశాంత్ కుమార్, తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ పాల్గొన్నారు.



భీమవరంలో విదేశీ ఆక్వా సైంటిస్టులు

విశాలాంధ్ర-భీమవరం : భారతదేశంలో ఆక్వా రాజధానిగా పేరొందిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో విదేశీ ఆక్వా శాస్త్రవేత్తల బృందం మంగళ వారం పర్యటించింది. యూకే, బంగ్లాదేశ్, కెన్యా, వియత్నాం, ఇటలీ దేశాలకు చెందిన 22మంది సభ్యు లతో కూడిన విదేశీ ఆక్వా శాస్త్రవేత్తలు భీమవరానికి చెందిన ఆనంద ఫౌండేషన్-యూకేకి చెందిన స్టర్‌లింగ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలోని ఆక్వా చెరువులు, సీడ్ పెంచే హ్యాచరీలు, ఫీడ్ తయారు చేసే పరిశ్రమలను పరిశీలించారు. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తి అయ్యే నెల్లూరు జిల్లా నుంచి శ్రీకాకుళం వరకు పర్యటిం చిన బృందం మంగళవారం భీమవరానికి వచ్చింది. గత కొంతకాలంగా ఆక్వా రైతులను నష్టాలకు గురి చేస్తున్న వైట్ స్పాట్, ఈఎంఎస్, ఈఏహెచ్‌పీ తదితర వ్యాధుల నివారణపై ఈ శాస్త్రవేత్తల బృందం పరిశోధనలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆనంద ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ అండ్ ఓషన్ యూనివ ర్సిటీని భీమవరం ప్రాంతంలో ఏర్పాటు చెయ్యనున్న నేపథ్యంలో యూకేకి చెందిన స్టర్‌లింగ్ విశ్వ విద్యాలయంతో ఎంఓయూ చేసుకుంది. దీంతో ఆక్వా కల్చర్‌ను వేధిస్తోన్న వివిధ రకాల వైరస్‌లపై అధ్యయనం చేసేం దుకు ఇక్కడకు బృందం వచ్చింది. ఇప్పటికే వియత్నాం, చైనా, బంగ్లాదేశ్, కెన్యా వంటి దేశాల్లో ఈ వైరస్‌లపై నమూనాలను సేకరించి భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లో ఆనంద గ్రూప్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు ఆధ్వర్యంలో అధ్యయనం జరుగుతోంది. ఈసందర్భంగా స్టర్‌లింగ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ మొర్రె విలియమ్స్, ఇటలీకి చెందిన మహమూద్ మాట్లాడుతూ భారతదేశం, బంగ్లాదేశ్‌ల్లో వనామి, తిలాపియా సాగులో వైరస్‌లు, కెన్యాలోని తిలపియాలో వ్యాధులపై చాలా తీవ్రంగా పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ వైరస్‌ల ధాటికి సన్న, చిన్నకారు ఆక్వా రైతులు చాలా నష్టాలను, కష్టాలను చవిచూస్తున్నారని పేర్కొన్నారు. యాంటీ బయాటిక్స్ అవశేషాలు ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో రొయ్య పిల్లలను అందించే హేచరీ నుంచి ఫీడ్ మిల్లు వరకు యాంటీ బయాటిక్స్ లేవని స్పష్టం చేస్తూ ధ్రువీకరణ పత్రాలు కూడా అందించేం దుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. వైరస్‌లను నివారించేందుకు అన్ని రకాలుగా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వివరించారు.

నాయుడుపేటలో మంత్రి నారాయణ తనిఖీలు

విశాలాంధ్ర-నాయుడుపేట: నెల్లూరు జిల్లా నాయుడుపేట నగర పంచాయతీని మంగళవారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిలో మీటర్లు దూరం నాయుడుపేట రహదారులన్నీ కలియతిరిగారు. నాయుడుపేట నగర పంచాయతీ పాలనపై 80శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన 20 శాతం పారిశుధ్య లోపం ఉందని, దానిని మెరుగుపరుచుకోవాలన్నారు. నగర పంచాయతీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న నాయుడుపేట మార్కెటింగ్ కమిటీ చైర్మన్ శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డిని ప్రత్యేకంగా ప్రశంసించారు. మంత్రి నారాయణ అత్యంత గోప్యంగా నాయుడుపేట నగర నడిబొడ్డులో ఉన్న గడియారం స్థంభం సర్కిల్ వద్దకు మంగళవారం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మైలారి శోభారాణి, కౌన్సిలర్లు కందసూరు లీలావతి, చిట్టేటి రేవతి, చిరువెళ్ల రాజ్యలక్ష్మి తదితరులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. గత కమిషనర్ అవినేని ప్రసాద్ పాతపోలీస్‌స్టేషన్ భవనాన్ని తొలగించి అక్కడ సర్కిల్ నిర్మించేలా చేయడం, అక్కడే ఉన్న క్లాక్ టవర్‌ను ఆధునీకరించాలన్న విషయం, పోలీస్‌శాఖకు, మున్సిపాల్ శాఖకు సరైన సయోధ్య కుదరక పోవడంతో ఆ ప్రాంతం నిరుపయోగంగా అలాగే ఉండి పోయిన విషయం తెలిసిందే. విజయభాస్కర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా జిల్లా ఎస్పీ పీహెచ్‌డి రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి శాఖా పరమైన ఇబ్బందులు వెంటనే పరిష్కరించి ఆ ప్రాంతం ఆధునీకరణకు మున్సిపల్ శాఖకు అప్పగించాలని కోరారు.

గుంటూరు ఛానల్‌లో


మహిళ మృతదేహం



విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కాలనీకి దగ్గరలోని గుంటూరు ఛానల్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. పట్టణ సీఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మహిళ మృతదేహం గుంటూరు ఛానల్‌లో నీటిపై తేలియాడుతోందని స్థానికులు మంగళవారం తమకు సమాచారం అందించారని తెలిపారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతి చెందిన మహిళ వివాహితగా తెలుస్తోందని, పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు. ఆమె ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు భావిస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సివుందని సీఐ హరికృష్ణ తెలిపారు.

ఆదరణ లేని హెలీ టూరిజం

- మూడు రోజులుగా ఒక్క టికెట్టూ అమ్ముడుపోని వైనం
- అరకు వరకూ తిప్పేందుకు మరో యత్నం



విశాలాంధ్ర-విశాఖపట్నం : అట్టహాసంగా సీఎం చంద్ర బాబు నాయుడు చేతులు మీదుగా ప్రారంభమైన హెలీ టూరిజానికి ఆదరణ కరవైంది. ఉడా పార్కులో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో పర్యాటకులను ఎక్కించుకుని ఆకాశంలో తిప్పుతూ నగర అందాలను చూపించాలని వుడా పవన్ హెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి మనిషికి రూ.2,499 చొప్పున టికెట్టు ధరను నిర్ణయించింది. ఒకసారి కేవలం ఆరుగురు మాత్రమే ప్రయాణించే సింగిల్ ఇంజన్ హెలికాప్టర్‌ను ఏర్పాటుచేయడం, టికెట్టు ధర అధికమవడం, కేవలం తొమ్మిది నిమిషాలే తిప్పడంతో ఎవరూ మొగ్గు చూపడం లేదు. గత నెల 29, 30, 31, ఈ నెల 1,2 తేదీల్లో కాస్త పర్యాటకులు ఆకాశంలో విహారం చేసినా తరువాతి రోజుల్లో ఆశించిన మేర ఆదరణ లేదు. దీంతో బేరాల్లేక హెలికాప్టర్ వుడా పార్కుకే పరిమితమవుతోంది.

నగరంలో హెలికాప్టర్ అందుబాటులో ఉండటం ఒక రకంగా మంచిదే అయినప్పటికీ టికెట్టు ధర కాస్త ఎక్కువ కావడం ఇబ్బందికరంగా ఉందని పర్యాటకులు చెబుతున్నారు. సిక్కింలో కేవలం రూ.1800లకు 13 నిమిషాలు మేర తిప్పడం, ఇక్కడ రూ.2499 తీసుకుని కేవలం 9 నిమిషాలకే పరిమితం చేయడం కూడా ఆదరణ తగ్గడానికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు. వుడా పార్కులో హెలికాప్టర్ దిగేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేసేందుకు వుడా రూ.6లక్షలు ఖర్చుపెట్టింది. గత నెల 29 నుంచి నిరంతరం హెలికాప్టర్‌ను పర్యాటకులకు అందుబాటులో ఉంచుతున్నారు. అయితే తొలి నాలుగు రోజులు ఆదరణ బాగున్నా తరువాతి రోజుల్లో తగ్గుతూ వచ్చింది. ఈ నెల 8,9,10 తేదీల్లో కనీసం బోణీ కూడా పడకపోవడం ఆదరణ తగ్గిందనడానికి నిదర్శనం. ఇదిలా ఉండగా ఇక్కడ నుంచి అరకు వరకూ హెలికాప్టర్‌ను పంపించాలన్న ఆలోచనలో కూడా వుడా అధికారులున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. అరకు వెళ్లేందుకు కనీసం రూ. 6 వేలు ధర నిర్ణయించాలని వుడా భావిస్తున్నది. నగరంలో తిరగడానికి రూ.2499కే వెనుకడుగు వేస్తున్న పర్యాటకులు రూ.6వేలు వరకూ చెల్లించే అవకాశం ఉందా లేదా? అన్న ఆలోచనలో కూడా వుడా తర్జనభర్జన పడుతోంది. వాస్తవానికి నగరంలో హెలికాప్టర్ అందుబాటులో ఉంటే అన్ని రకాలుగా ఉపయోగపడే అవకాశం ఉంది. హెలికాప్టర్ అందుబాటులో ఉండ టం మంచిదే అయినా పర్యాటకులకు నిర్ణయించిన ధర కాస్త ఎక్కువన్న వాదన వినిపిస్తోంది. ఆ ధర కాకపోతే హెలికాప్టర్‌ను తిప్ప లేని పరిస్థితి కూడా ఉంది. ఈ రెండిం టిని బేరీజు వేసుకుని ప్రభుత్వం రాయితీ కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఢిల్లీకి నేడు సీఎం చంద్రబాబు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : సీఐఐ భాగస్వామ్య సదస్సు-2018 సన్నాహక సమావేశం వైజాగ్‌లో బుధవారం జరగనున్నది. దీనిని సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. అనంతరం ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం ఏపీకి కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ వ్యవహారంతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులను త్వరగా విడుదల చేయాలని ప్రధానిని కోరిన విషయం తెలిసిందే. దీనిపై ఆయా శాఖల వారీగా స్పందనను తెలుసుకునేందుకు సీఐఐ సమావేశం అనంతరం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్‌ప్రభుతో పాటు పలువురు కేంద్రమంత్రులను కలిసే అవకాశం ఉంది. తన స్వగ్రామం నారావారి పల్లెలో సంక్రాంతి సంబరాలు ముగించు కొని ఈ మధ్యాహ్నం చంద్రబాబు అమరావతికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అమరావతి వచ్చిన రాఘవేంద్రరావు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

హస్తకళా ప్రదర్శన



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ప్రభుత్వ రంగ సంస్థ, టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ నియంత్రణలోని సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను హ్యాండీక్రాఫ్ట్ ప్రమోషనల్ ఆఫీసర్, ఎం.పి. షాజీ ప్రారంభించారు. కలింగ బంజారాహిల్స్‌లోని కల్చరల్ ట్రస్టులో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో జాతీయ అవార్డు గ్రహీతలు, ఈ రంగం కోసం పనిచేస్తున్న ఆర్టిషియన్స్, నైపుణ్యం కలిగిన కళాకారులు రూపొందించిన హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించారు. సున్నితమైన శిల్పాలు, పెయింటింగ్స్, ఆర్ట్‌క్రాఫ్ట్స్, ఉడ్‌క్రాఫ్ట్స్, ఫర్నీచర్, ఫర్నీషింగ్స్, హోంలినెన్, శారీలు, రెడీ టు వేర్, యాక్ససరీలు, జ్యూవెలరీ, క్రాఫ్ట్ ఐటెమ్స్ ఉన్నాయి. ఈ నెల 21 వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన జరగనుంది.



పోలీసులతో చర్చిస్తున్న సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

సీపీఐ నాయకుల గృహనిర్బంధం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామ బాధితులను పరామర్శించడానికి వెళుతున్న సీపీఐ నాయకులను పోలీసులు మంగళవారం గృహనిర్బంధం చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గొట్టిపాడు బాధితులను పరామర్శించేందుకు ప్రయాణమైన సీపీఐ బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ కండే శ్రీనివాసులు ఆధ్వర్యంలో లాలాపేట, పాతగుంటూరు పోలీసుస్టేషన్‌ల సీఐలు, పోలీసు సిబ్బందితో మంగళవారం ఉదయం సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రిల నివాసాల వద్దకు చేరుకుని వారిని జీజీహెచ్‌కు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులను నిలువరించి స్థానిక కొత్తపేటలోని పార్టీ కార్యాలయానికి సీపీఐ నాయకులు చేరుకున్నారు. పోలీసులు సీపీఐ కార్యాలయం వద్ద పహారా ఏర్పాటు చేసి నాయకులను వెళ్లనీయకుండా గృహనిర్బంధం చేశారు. దీంతో అజయ్‌కుమార్ గుంటూరు అర్బన్ ఎస్పీ విజయరావును సంప్రదించి తాము జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గొట్టిపాడు బాధితులను పరామర్శించడానికి మాత్రమే వెళుతున్నామని దీనికి అనుమతి ఇవ్వాలని కోరారు. అనంతరం సీపీఐ నాయకులు జీజీహెచ్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు.

24న చలో గొట్టిపాడు జరిగి తీరుతుంది : సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల

ఎన్ని అవాంతరాలు సృష్టించినా ఈ నెల 24న న తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జరిపి తీరుతామని జంగాల అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, నానాటికీ దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గొట్టిపాడు సంఘటనలో బాధితులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. చలో గొట్టిపాడు కార్యక్రమానికి సీపీఐ జిల్లా సమితి తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని వెల్లడించారు.

'టెట్' పేపర్-3 సిలబస్ ఏదీ.?

- భాషాంశాల అభ్యర్థుల్లో టెన్షన్
- గత వెయిటేజీలపై అనుమానాలు..
- 20తో ఫీజు గడువుకు డెడ్‌లైన్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)లో భాషా పండితులకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన పేపర్-3 సిలబస్‌ను ఇంతవరకూ ప్రభుత్వం వెల్లడించలేదు.దీంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. అటు టెట్ పరీక్షలకు సమయం దగ్గర వ్వడంతో వారిపై మరింత ఒత్తిడి పెరుగుతోంది. టెట్ ఫీజు చెల్లింపు, దరఖాస్తు నమోదుకూ కొద్ది రోజుల వరకే గడువు ఉంది.టెట్‌లో 60 మార్కులకు కీలకంగా ఉండే భాషాంశాల సిలబస్‌ను చదవాలంటే రెండు నుంచి మూడ్నెల్ల వరకూ సమయం కావాలని అభ్యర్థులు పేర్కొంటున్నారు.టెట్‌లో పేపర్-1లో భాగంగా 30 మార్కులకు తెలుగు కామన్‌గా అందరికీ ఉంటుంది. ఇప్పటివరకూ అందరితోపాటు భాషాంశాల అభ్యర్థులూ టెట్ సిలబస్ ఆధారంగానే తెలుగు, మెథడాలజీని చదివారు. పేపర్-3లో అదనంగా 60 మార్కుల భాంషాంశ సిలబస్‌ను చదవాలి.ఇది 6 నుంచి 10 తరగతుల వరకూ రాష్ట్ర ప్రభుత్వ తెలుగు పాఠ్యపుస్తకాల నుంచి కంటెంట్ వచ్చే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. సిలబస్‌పై స్పష్టత లేనందున ఏయే అంశాలు చదవాలనేదీ అభ్యర్థులకు ప్రశ్నార్థకంగా మారింది. టెట్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభమవుతాయి. ఇవి ఆన్‌లైన్లోనా? ఆఫ్‌లైన్లోనా? అనేవీ ఇంకా ప్రభుత్వం వెల్లడించలేదు. దీనిపైనా అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది.భాషాంశాల అభ్యర్థుల కోసం పేపర్-3ని టెట్ పరీక్షలకు 20 రోజుల ముందే ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ఇప్పటివరకూ పేపర్-2లో భాగంగా సోషల్/మ్యాథ్స్/సైన్స్ సబ్జెక్టులను(60 మార్కులకు) భాషాంశాల అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. వారి కోసం పేపర్-3ని ప్రవేశపెట్టడంతో సిలబస్‌ను విస్తృ తంగా చదవాల్సి ఉంది. 20రోజుల వ్యవధిలో విస్తృతంగా ఉండే భాషాంశాల సబ్జెక్టులను (తెలుగు/హిందీ/ఇంగ్లీష్/సంస్కృతం) సిద్ధమవ్వ డం అసాధ్యమని వాపోతున్నారు. ఖచ్చితంగా మరో నెల రోజుల వరకూ సమయం ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

పేపర్-2 నుంచి పేపర్-3కి మార్పు అనివార్యం..

ఇప్పటికే పేపర్-2కు(సోషల్/మ్యాథ్స్/సైన్స్) ఆన్‌లైన్లో ఫీజు చెల్లించి, దరఖాస్తు నమోదు చేసిన భాషాంశాల అభ్యర్థులంతా తప్పనిసరిగా పేపర్-3కి మార్చుకోవాలి. లేకుంటే వారందర్నీ పేపర్-2గానే పరిగణిస్తారు.కొత్తగా దరఖాస్తు చేసే వారంతా నేరుగా పేపర్-3కే ఆన్‌లైన్లో ఫీజు చెల్లించి, దరఖాస్తు చేయాలి. ఈ పద్ధతుల్ని పాటించకుంటే ముందస్తుగా నమోదు చేసిన పేపర్-2కే వారంతా పరిమితమయ్యే ప్రమాదముంది.

టెట్ పేపర్-3లో భాషాంశాల సబ్జెక్టులు ఇలా..

టెట్‌లో పేపర్-3కి సైకాలజీ-30, తెలుగు/హిందీ-30, ఇంగ్లీషు-30, భాషాంశాల సబ్జెక్టుల కంటెంట్-60 మార్కులకు ఉంటాయి. మొత్తం 150 మార్కులలో భాషాంశాల అభ్యర్థులకు 90 మార్కులను కేటాయించారు. టెట్‌లో అత్యధిక స్కోరు సాధించాలంటే..90 మార్కుల భాషాంశాలే కీలకంగా మారాయి.ఆ తర్వాత సైకాలజీ, ఇంగ్లీషులపై అభ్యర్థులు దృష్టిపెట్టాలి.దాదాపు 20రోజుల వ్యవధిలో భాషాంశాల సిలబస్‌ను చదవడం తమకు భారంగా ఉందని అభ్యర్థులు వాపోతున్నారు.

పేపర్-3కి వెళ్తే గత టెట్ వెయిటేజీ యథాతథమేనా..?

గత టెట్ పరీక్షల్లో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది లాంగ్వేజీ పండిట్లు పేపర్-2 రాసి అర్హత పొందారు.వారంతా 2012 డీఎస్సీకి, 2014-టెట్ కమ్ టీఆర్టీ పరీక్షలకు హాజర య్యారు. భాషా పండిట్ల విజ్ఞప్తులతో పేపర్-3ని ప్రభుత్వం ప్రవేశపెట్టడాన్ని అందరూ స్వాగతిస్తు న్నారు. ఇప్పటికే 80 శాతం మంది పేపర్-2కు దరఖాస్తు చేశారు. వారందర్నీ పేపర్-3కి మార్చుకోవాలంటూ ప్రభుత్వం టెట్ వెబ్‌సైట్లో ఆప్షన్లు ప్రవేశపెట్టింది. దీంతో పేపర్-2 నుంచి పేపర్-3కి ఆప్షన్ మార్చుకున్న భాషాంశాల అభ్యర్థులకు గత టెట్ వెయిటేజీ మార్కులు ఉంటాయా? లేదా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది.

22వరకూ ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు

గతంలో ప్రకటించిన టెట్ షెడ్యూలు ప్రకారం (జీవో నంబరు91 ఆధారంగా)

..ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అభ్యర్థులు ఫీజు చెల్లించాలి. 22వ తేదీలోగా అభ్యర్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేయాలి. టెట్ పేపర్-2 నుంచి పేపర్-3కి మార్పుతోపాటు డీఎడ్, బీఈడీ చివరి ఏడాది అభ్యర్థులకూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఫీజు, దరఖాస్తుల నమోదు ప్రక్రియ, పరీక్షలకు కొంత సమయం పెంచాలని అభ్యర్థులు కోరుతున్నారు.

కేంద్ర ప్రాజెక్టులకు ఏయూ ఎంపికైతే రూ.1000 కోట్లు



విశాలాంధ్ర - విశాఖసిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం దేశంలోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు ఎంపిక కావడానికి సన్నద్ధమవుతోంది. ఈ నేపధ్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైౖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌కు దరఖాస్తు చేసింది. ఈ భారీ ప్రాజెక్టుకు ఎంపికైతే వర్సిటీకు వెయ్యి కోట్ల నిధులు అందుతాయి. దేశంలోని విశ్వవిద్యాలయాలను అన్ని విధాల బలోపేతం చేసి ప్రపంచంలోని విద్యా సంస్థలకు దీటుగా నిలబెట్టి మంచి ర్యాకింగ్ దేశీయ యూనివర్సిటీలకు కల్పించే ఆలోచనతో కేంద్రం ఈ తరహా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. దేశంలోని పది ప్రభుత్వ యూనివర్సిటీలు సహా ఇరవై వర్సిటీలను మాత్రమే దీని కోసం ఎంపిక చేయనున్నారు. వర్సిటీ నాక్ ర్యాకింగ్‌లలో 3.5 కి పైన పాయింట్లు సాధిస్తాయో ఆ వర్సిటీలు మాత్రం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఇలా దరఖాస్తుకు ఎంపికైన దేశంలోని పది ప్రభుత్వ యూనివర్సిటీలో ఒకటిగా ఏయూ నిలిచింది. రాష్ట్రం నుంచి మరో యూనివర్సిటీ కూడా ఈ ప్రాజెక్టుకు దరఖాస్తు చేసింది.

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ :

ప్రపంచంలోని పలు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలకు ఏటా ర్యాంకులు ప్రకటించే సమయంలో దేశంలోని విద్యా సంస్థలు ఏవీ కూడా 100 లోపు ర్యాంకింగ్‌ల దరి చేరడం లేదు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశంలోని విద్యాసంస్థలను అన్ని విధాల మెరుగైన విధంగా తీర్చిదిద్దేలా పలు పథకాలు ప్రవేశ పెట్టింది. వీటిలో ఒకటే ఈ ఎమినెన్స్ హోదా. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌కు ఎంపికైతే రానున్న ఐదేళ్లలో విడతల వారీగా వర్సిటీకు 1000 కోట్ల రూపాయలు నిధులు విడుదల అవుతాయి. ఈమేరకు ఇప్పటికే దరఖాస్తు చేసిన ఏయూ ఫ్యూచర్ ఎర్త్ సస్టైనబుల్ హ్యూమనోస్ఫియర్ పేరిట పరిశోధనలకు గాను సుమారు రూ.1200 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. వర్సిటీలో ఇంజినీరింగ్, ఫార్మసీ, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల పరిధిలోని పలు విభాగాలను ఈ ప్రాజెక్టులో భాగం చేసింది. హెల్త్‌కేర్ మేనేజిమెంట్, క్లైమేట్ ఛేంజ్ అండ్ ఫ్యూచర్ హెవిబిలిటీ ఎన్విరాన్‌మెంట్, వాటర్ అండ్ మినరల్ రిసోర్సెస్, ఫుడ్ సెక్యూరిటీ అండ్ మెరైన్ బయో డైవర్సీ, గ్రీన్ టెక్నాలజీస్, సోషియో ఎన్విరాన్‌మెంటల్‌లా తదితర అంశాలను ప్రధానంగా ఈ ప్రతిపాదనల్లో పొందుపరిచారు.

పెద్ద ఎత్తున నిధులకు ప్రణాళికలు:

ఇప్పటికే వర్సిటీకు యూజీసీ, డీఎస్టీ విభాగాల ద్వారా ప్రతీ యేటా రూ.70 కోట్లు పైనే నిధులు విడుదల అవుతున్నాయి. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఫిస్ట్ పథకంకి కూడా ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. వీటికి ఎంపికైనా కూడా కోట్ల రూపాయల నిధులు వర్సిటీకు విడుదల అవుతాయి. ఫిస్ట్ పథకంలో రెండు దశలుగా లెవల్-1, లెవల్-2 విభాగాలలో దరఖాస్తు చేశారు. ఈ పథకాల క్రింద మరో వంద కోట్ల రూపాయల నిధులు వర్సిటీకు అందే అవకాశాలు ఉన్నాయి. ఈ విధంగా పెద్ద ఎత్తున నిధులు సమీకరించి వర్సిటీలోని దాదాపు అన్ని విభాగాలను భారీస్థాయిలో అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు రచిస్తున్నారు.

మరో రెండు నెలల్లో ఎంపిక విధానం:

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ ఎంపిక విధానానికి తగిన కసరత్తును ఇప్పటికే కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రారంభించింది. ఎంపిక విధానానికి కమిటీలు కూడా నియమించింది. ఈ కమిటీలు పూర్తిస్థాయిలో పరిశీలన చేసి దరఖాస్తు చేసిన విద్యా సంస్థలను పిలిపిస్తారు. ఆ సమయంలో వర్సిటీలు అన్నీ తమ ప్రెజెంటేషన్ ఇవ్వవలసి ఉంటుంది. తదనంతరం ఎంపిక ప్రకియ పూర్తి చేసి ప్రకటన విడుదల చేస్తారు. సుమారు ఈ ప్రక్రియను వచ్చే రెండు నెలల్లో పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయి.

పట్టు కోసం బీజేపీ తహతహ...

(మొదటిపేజీ తరువాయి)

చట్టం 2014లో పొందుపరిచినట్లుగా ప్రత్యేకంగా గవర్నర్‌ను నియమించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలకు ఒకే గవర్నర్ ఉండటం వల్ల రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని హరిబాబు తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు కొత్తగా గవర్నర్‌ను నియమించాలని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా హైకోర్టును కూడా ఏర్పాటు చేయాలని లేఖలో ఆయన కోరారు. ఇటీవల గవర్నర్ ఆమోదించిన నాలా చట్టం కూడా వివాదస్పదమైంది. బీజేపీ ఒత్తిడితో నాలా చట్టానికి గవర్నర్ అనుమతించక పోవటంతో, సీఎం చంద్రబాబు స్వరం పెంచారు. దీంతో చట్టానికి గవర్నర్ నరసింహన్ ఆమోదం తెలపక తప్పలేదు. ఈ వ్యవహారంతో మరోసారి మిత్రపక్షాలు టీడీపీ, బీజేపీ మధ్య పొరపచ్చాలు బయటపడ్డాయి. ఈమధ్యకాలంలో మిత్రపక్షంగా ఉన్న బీజేపీ, టీడీపీ మధ్య మాటల తుటాలు పేలుతున్నాయి. సాక్షాత్తు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు వివాదస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. పలుమార్లు సీఎం చంద్రబాబు స్వయంగా జోక్యం చేసుకున్నా పొరపచ్చాలు పరిష్కారంకావటంలేదు. విభజన చట్టంలో ప్రత్యేక గవర్నర్, ప్రత్యేక హైకోర్టుతోపాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడ్డిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాజధాని నిర్మాణంతో పాటు అసెంబ్లీ, సచివాలయ భవనాల నిర్మాణానికి కేంద్రం సహకరించాల్సి ఉంది. కాని బీజేపీ నాయకులు ఇతర అంశాలను పట్టించుకోకుండా కేవలం గవర్నర్ నియామకం కోసమే పట్టుబట్టటం ఇపుడు పెద్ద చర్చనీయాంశ మైంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేదిలేదని, ప్రత్యేక ప్యాకేజీ మాత్రమే ఇస్తామని పలుమార్లు కేంద్ర మంత్రులు ప్రకటించారు. దీనికి సీఎం చంద్రబాబుతోపాటు టీడీపీకి కూడా అంగీకరించక తప్పలేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో ఎంపీ హరిబాబు గవర్నర్ నియామకం కోసం లేఖ రాసే సమయంలో ఇతర అంశాలను కూడా ప్రస్తావించి ఉంటే బాగుండేదని విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు.

బీజేపీ మాట చెల్లుబాటు కోసమేనా...

రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ బీజేపీ మాట చెల్లుబాటు చేసుకునేందుకే ఆ పార్టీ తాపత్రయం పడుతోంది. ఇప్పటికే గవర్నర్ వ్యవస్థను కేంద్రం నిర్వీర్యం చేసిందనే విమర్శలు ఉన్నాయి. గవర్నర్లను కేంద్రం నియమిస్తుంది. ప్రధాని ఏది చెబితే దానిని అమలు చేయటమే గవర్నర్ పని. దేశంలోని పలు రాష్ట్రాలలో పాలన అస్తవ్యస్తంగా మారటానికి కేంద్రం గవర్నర్లను ఏవిధంగా ఉపయోగించుకుందో అందరికీ తెలుసు. మణిపూర్, గోవా, తమిళనాడులో గవర్నర్ పాత్ర వివాదస్పదమైంది. రాష్ట్రంలోనూ చిచ్చుపెట్టే ఉద్దేశం తోనే ప్రత్యేకంగా గవర్నర్‌ను నియమించాలంటూ బీజేపీ పట్టుబడుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. టీడీపీ మిత్రపక్షమైనప్పటికీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు పెత్తనమే కొనసాగుతోంది. దక్షిణాది రాష్ట్రాల్లో పట్టుకోసం ఇప్పటికే బీజేపీ ప్రణాళికను సిద్ధం చేసింది. కర్నాటకలో ఇప్పటికే బీజేపీ యాత్ర చేపట్టింది.

తమిళనాడులో బీజేపీ మార్కు కోసం అక్కడి రాజకీయాలను శాసించే స్థాయికి పార్టీని తీసుకువెళ్లేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా అన్ని స్థానాలకు బీజేపీ పోటీ చేసేస్థాయికి వస్తుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలు వివాదస్పదమయ్యాయి. తాజాగా బీజేపీకి చెందిన మంత్రి మాణిక్యాలరావు, పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ ఛైర్మన్ బాపిరాజు మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ పావులు కదిపే క్రమంలోనే ప్రత్యేక గవర్నర్ నియామక అంశాన్ని తెరపైకి తెచ్చిందనే వ్యాఖ్యలు వ్యక్తమవుతున్నాయి. గవర్నర్ చెప్పినట్లుగా రాష్ట్రంలో పాలన సాగేలా ఆ పార్టీ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.

విభజన చట్టంలోని అన్నింటినీ అమలు చేయాల్సిందే : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విభజన చట్టంలోని అన్ని అంశాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. విభజన చట్టం అమలుకు మూడున్నర సంవత్సరాలుగా పట్టించుకోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ హరిబాబు ఇపుడు కేంద్రానికి లేఖ రాయటంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. పాలనలో గవర్నర్ వ్యవస్థ కీలకంకాదన్నారు. విభజన చట్టంలో ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాకు ప్యాకేజీ, హైకోర్టు, విశాఖకు రైల్వేజోన్ తదితర అనేకం ఉన్నాయన్నారు. ఇన్నాళ్లూ మిన్నకుండి ఇపుడు కేవలం గవర్నర్ నియామకానికి పట్టుబడటం సరికాదన్నారు. మొదటి నుంచి విభజన చట్టంలోని అంశాల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉంటే రాష్ట్రానికి ఎపుడో న్యాయం జరిగిఉండేదన్నారు. ఎంపీ హరిబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న విశాఖకు రైల్వేజోన్ ఇస్తామన్న కేంద్రం నేటికీ జోన్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. గవర్నర్ నియామకంతోపాటు చట్టంలోని ఇతర అంశాల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని రామకృష్ణ సూచించారు.

టీపీసీసీ ఆఫీస్ బేరర్ల సమావేశం రేపు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కొత్త పంచాయతీచట్టంపై చర్చించేందుకు టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, ముఖ్యనేతలతో ఈనెల 18న సమావేశం ఏర్పాటు చేసినట్లు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొస్తున్న ఈ బిల్లుపై సమావేశంలో విస్తృతస్థాయిలో చర్చించనట్లు వివరించారు. అనంతరం భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, ముఖ్యనేతలంతా హజరు కావాలని ఆయన కోరారు.

మళ్లీ భగ్గుమన్న పెట్రోల్

(మొదటిపేజీ తరువాయి)

అవుతున్న క్రమంలో ధరలు రెట్టింపయ్యే అవకాశముంది. భాగ్యనగరంలో పెట్రో ధరలు రికార్డు సృష్టించాయి. పెట్రోల్ రేటు ఎన్నడూ లేనంతగా గరిష్టంగా రూ.75కు చేరింది. ఇక డీజిల్ కూడా రూ.67 దాటింది. ధరల నియంత్రణ పెట్రో సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయాక పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. రోజువారీ ధరల నియంత్రణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఒక రోజు 5 పైసలు తగ్గితే మరుసటి రోజు 30 పైసలు పెరిగే పరిస్థితి ఉంది. హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 75 దాటడం ఇదే తొలిసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ.71.27, లీటర్ డీజిల్ ధర రూ. 61.88 కాగా, కోల్‌కత్తాలో పెట్రోల్ రూ.74, డీజిల్ రూ.64.9, ముంబైలో పెట్రోల్ రూ.79.15, డీజిల్ రూ.65.9, చెన్నైలో పెట్రోల్ రూ.73.89, డీజిల్ రూ.65.23 ఉంది. పెట్రోల్ ధర దేశ చరిత్రలోనే రూ.80కి చేరుకున్న సందర్భంగా కూడా ఉంది. 2013లో భారీగా పెరిగి రూ. 80.58కి చేరింది. అయితే అప్పట్లో ఆందోళనలు మిన్నంటడంతో ఒకటి, రెండు రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం ధరను తగ్గించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడమే దీనికి కారణమని పెట్రో సంస్థలు చెబుతున్నాయి. చమురుపై రాష్ట్రాలకు ప్రత్యేకంగా పన్ను విధించే అవకాశం ఉండడంతో దేశ వ్యాప్తంగా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా రేట్లు ఉంటున్నాయి.

ఆధార్ తప్పులతో తిప్పలు

విశాలాంధ్ర-అమరావతి : ఆధార్ కార్డుల్లో తప్పులు సరిచేసుకునేందుకు వారాలు, నెలలు పడుతుండటంతో లబ్ధిదారులు తిప్పలుపడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సైతం పొందలేకపోతున్నారు. ఆధార్ తప్పులను సవరించే కేంద్రాలు ఎక్కడున్నాయో తెలియని అయోమయంలో కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా, పింఛన్, పీఎఫ్, ఎరువుల విక్రయం ఇలా ప్రతిదానికి ఆధార్ లేనిదే పని కావడం లేదు. గతంలో ఆధార్ కార్డులో ఇంటి పేరు లేకపోయినా పాన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునే వీలుండేది. ప్రస్తుతం నిబంధనలు మార్చారు. ఇంటి పూర్తి పేరు ఆధార్ కార్డులో ఉంటేనే పాన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునే వీలుంది లేకపోతే దరఖాస్తు తిరస్కరణకు గురవుతోంది. పాన్‌కార్డుకు పుట్టిన తేదీ తప్పనిసరి. ఆధార్‌కార్డులో గతంలో పుట్టిన తేదీ లేకుండా పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదు చేశారు. ఇంటి నెంబరులో అక్షరం తప్పున్నా, పురుష, స్త్రీ ఇలా తప్పుగా ముద్రించినా, ఆధార్ నెంబరుకు చరవాణి నెంబరు అనుసంధానం కాకపోయినా, రేషన్ సరకులు తీసుకునే కార్డుదారులకు ఈపాస్ యంత్రంలో వేలిముద్రలు పడకపోయినా, పింఛన్ తీసుకునేవారికి బయోమెట్రిక్ యంత్రాల్లో వేలిముద్రలు సరిపోకపోయినా ఆధార్ కేంద్రానికి వెళ్లి సవరణలు చేసుకోవాల్సి వస్తోంది. ఆధార్ సేవలకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. నమోదు సమయంలో జరిగిన తప్పులు సరిదిద్దుకోవడానికి కాళ్లరిగేలా తిరగాల్సి రావడం తోడు కేంద్రాలు ఎక్కడున్నాయో తెలియడం లేదని, ఉన్నచోట అడిగినంత రుసుం చెల్లించాల్సి వస్తోందంటూ బాధిత ప్రజలు వాపోతున్నారు. మీసేవలు ఆధార్ సేవలను ప్రభుత్వ నిబంధనల మేరకు రుసుములు వసూలు చేసి అందించేవి. వీటిలో ఆధార్ సేవలకు స్వస్తి పలకడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రైవేటు నిర్వాహకులు కావాలనే అడ్డుకుంటున్నారని, అవసరార్థుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆధార్ సేవలకు నూతనంగా చాలా మంది మీసేవా నిర్వాహకులు దరఖాస్తు చేసినా అనుమతులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆధార్ నమోదును ప్రైవేటు వ్యక్తులు, ప్రైవేటు మీసేవా కేంద్రాలు ఇష్టారాజ్యంగా నమోదు చేయడంతో ప్రస్తుతం ఆధార్ సేవలు అందిస్తున్న మీసేవా కేంద్రాల నిర్వాహకులకు వరంగా మారింది. ఆధార్‌లో సవరణల కోసం వేలాదిమంది మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తుండగా పర్యవేక్షణ కరవైంది. గతంలో పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఉండేవి. అవి కాకుండా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేటు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని కొందరు మీసేవా నిర్వాహకులు తమ ఇష్టారాజ్యంగా ఆధార్ నమోదు, సవరణలకు రూ.100, రూ.150, రూ.200, రూ.500 వరకు ఆయా కేంద్రాల నిర్వాహకులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ యంత్రాంగం ఏ ఒక్క మీసేవా కేంద్రాన్ని, లేదా ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన దాఖలాలు లేవు.

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావం

25న బహిరంగ సభలో అధికారిక ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రాష్ట్రంలో మరో రాజకీయ ఫ్రంట్ ఆవిర్భావం కానున్నది. రాజకీయ సమీకరణల నేపథ్యంలో నూతన ఫ్రంట్‌కు రూపకల్పన జరుగుతోంది. వామపక్ష, ప్రగతిశీల, ప్రజాతంత్ర, ప్రజాస్వామిక లౌకికశక్తులతో ఈ ఫ్రంట్ అంకురార్పణ కానున్నది. అధికార పార్టీకి, ఇతర పక్షాలకు ధీటుగా ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించాలన్న సంకల్పంతో ఫ్రంట్ అడుగులు వేస్తోంది. వామపక్ష, ప్రగతిశీల శక్తులతో పాటు అంబేద్కర్‌వాదులు, బహుజనులు, దళిత సంఘాలు భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) పేరుతో నూతన రాజకీయ సంస్థ నిర్మాణం కానున్నది. ఈనెల 25న భారీ బహిరంగ సభలో ఫ్రంట్‌ను అధికారికంగా ప్రకటించనున్నారు. సభలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్, ఇతర వామపక్ష నేతలు పాల్గొనున్నారు. సీపీఎం, టీమాస్, ఎంసీపీఐయూ, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్, రాజ్యాధికార పార్టీ, బహుజన రాజ్యాధికార పార్టీ వంటి 28 రాజకీయ పార్టీలతో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిష్కారం కానున్నది. ఫ్రంట్‌లో భాగస్వామ్యం కావాలని సీపీఐ, సీపీఐ(ఎంఎల్) సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఇతర వామపక్ష పార్టీలతో చర్చలు జరుపుతు న్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపడంతో పాటు ప్రత్యామ్నాయశక్తిగా ఆవిర్భావం కావాలనే బహుజన లెఫ్ట్‌ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు.

పంచాయతీరాజ్ చట్టంపై అఖిలపక్షం: చాడ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : కొత్తగా తీసుకురానున్న పంచాయతీరాజ్ చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీల సూచనలను స్వీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ముఖ్యమంత్రికి మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన పంచాయతీరాజ్ ముసాయిదా చట్టంలో సర్పంచ్ ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించాలని భావిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయని, పరోక్ష ఎన్నికలంటే గ్రామాల్లో వార్డు మెంబర్‌ల కొనుగోలుకు తెరలేపినట్లే అవుతుందన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో రాజకీయ చిచ్చు రేపడమే కాకుండా గొడవలకు దారి తీయించనట్లవుతుందని, గతంలో మాదిరిగానే ప్రత్యక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నికలకు నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే జిల్లాల పునర్విభజన విషయంలో ఇష్టానుసారం వ్యవహరించి 31 జిల్లాలకు పెంచి, ఇప్పటి వరకు ఖాళీలను భర్తీ చేయలేదని, పంచాయతీరాజ్ చట్టాన్ని కూడా అదే మాదిరిగి ఆదరాబాదరాగా, అందరితో చర్చించకుండా తీసుకురావొద్దని కోరారు. దేశంలోనే ఆదర్శవంతంగా ఉన్న కేరళ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాన్ని గమనంలోకి తీసుకోవాలని, అక్కడ రాజ్యాంగంలోని 73,74వ అధికరణకు అనుగుణంగా అధికారాలను, నిధులను స్థానిక సంస్థలకే బదిలీ చేసారని, గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలన్న జాతిపిత గాంధీజీ కలల మేరకు విధులు, నిధులపై హక్కులను కల్పించినప్పుడే నిజమైన గ్రామీణ స్వరాజ్యం వస్తుందన్నారు. మరోవైపు ప్రభుత్వం ఫిబ్రవరి నెలలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఈ నెలలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చి, గడువు తీరకముందే హడావుడిగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే త్వరలో పదవీకాలం ముగియనున్న సహకార సంఘాలకు తొలుత ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేశారు. ఈ యోచనను విరమించుకొని, తక్షణమే కొత్త పంచాయతీరాజ్ చట్టంపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అనుమానాలు నివృత్తి చేయడంతో పాటు, సూచనలు స్వీకరించాలని చాడ తెలిపారు.



ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావుకు పితృవియోగం

విశాలాంధ్ర-వినుకొండ : అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు తండ్రి ఎం.బ్రహ్మం(58) సోమవారం ఉదయం కన్నుమూశారు. ఆయన వారి ఇంటి పైకప్పు ఎక్కి రిపేరు చేస్తుండగా కాలు జారి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స కోసం ఆయన్ని పట్టణంలోని హాస్పిటల్‌కు తీసుకువెళ్లేసరికి అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. బ్రహ్మం మృతి వార్త తెలిసి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాయకులు ఏ.మారుతివరప్రసాద్, సంద్రపాటి షైదా, ఉలవలపూడి రాము, పి.లాల్‌ఖాన్, ఎస్.కె.శిలార్, బి.సాగర్, ఎన్.అంబేద్కర్, ఎస్.రవి, ఎస్.కె.కరీం, ఎస్.కె.వలి, బి.వెంకటేశ్వరరెడ్డి, అరుణ్, ఎస్.కె.బాబు, చిరంజీవి, పట్టణంలోని ప్రముఖులు, విద్యార్థులు, యువకులు ఎం.సుబ్బారావు కుటుంబానికి సంతాపం, సానుభూతి తెలిపి ఆయనకు నివాళు లర్పించారు.

విశాలాంధ్ర
క్రీడలు

పాండ్య నిర్లక్ష్యపు రనౌట్..!

సెంచూరియన్: హార్దిక్ పాండ్య! భారతదేశం ఎప్పట్నుంచో గాలిస్తున్న ఫాస్ట్ బౌలర్ ఆల్‌రౌండర్! తొలి ప్రపంచకప్ సాధించి పెట్టిన హర్యానా హరికేన్ కపిల్‌దేవ్‌కు అతడే అసలైన వారసుడు! అతని ఆటలో ఎంతో పరిణతి కనిపిస్తోంది! తన బ్యాటింగ్, బౌలింగ్ ద్వారా జట్టుకు చక్కగా సమతూకం తెస్తున్నాడు! వైవిధ్యమైన టెంపర్‌మెంట్‌తో జట్టుకు 'ఎక్స్ ఫ్యాక్టర్'గా మారాడు. ఇవీ.. పాండ్యపై నిన్నామొన్నటి వరకు వినిపించిన ప్రశంసలు. నిజంగానే అందుకు తగ్గట్టే అతడు ఆటతీరు కనబరిచిన సందర్భాలున్నాయి. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో పాకిస్థాన్‌పై 43 బంతుల్లో 4 బౌండరీలు, 6 సిక్సర్లతో 76 పరుగులు చేశాడు. కష్టాల్లో ఉన్న జట్టును గెలిపించినంత పనిచేశాడు. పాక్‌ను భయపెట్టాడు. ఆ తర్వాత అరంగేట్ర టెస్ట్ సిరీస్‌లో శ్రీలంకపై బ్యాటు, బంతితో చక్కని ప్రదర్శన చేశాడు. తొలి మ్యాచ్‌లో అర్ధశతకం చేశాడు. పల్లెకెలె టెస్టులో 96 బంతుల్లోనే 108 పరుగులు చేసి ఆహా! అనిపించాడు. దక్షిణాఫ్రికాతో ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో భాగంగా కేప్‌టౌన్‌లో టీమిండియా 92 పరుగులకే 7 వికెట్లు చేజార్చుకున్న తరుణంలో అతడు చూపిన పట్టుదల క్రికెట్ పండితుల చేత శెభాష్ అనిపించుంది. తన ఇన్నింగ్స్‌లో 14 బౌండరీలు, 1 సిక్సర్ సాయంతో 95 బంతుల్లోనే 93 పరుగులు చేసి భారత్ పరువు కాపాడాడు. గెలుపు అవకాశాలు సృష్టించాడు. ప్రపంచమంతా అతడి ఆటను పొగిడింది. ఎందుకంటే ప్రత్యర్థి బౌలర్లు సామాన్యులు కారు! స్టెయిన్, రబాడ, ఫిలాండర్, మోర్కెల్ ఎంత కఠినగా బంతులు విసురుతారో అందరికీ తెలుసు. వారి బౌలింగ్‌ను తట్టుకొని ఆడిన ఇన్నింగ్స్ అతడి కెరీర్‌లోనే అద్భుతమని చెప్పాలి.

ఇదేనా పరిణతి!

విలువైన ఇన్నింగ్స్‌లతో తన విలువ పెంచుకున్న హార్దిక్ పాండ్య దక్షిణాఫ్రికాతో సెంచూరియన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో మాత్రం క్షమించరాని పొరపాటు చేశాడు! అతడు సాధించిన పరిణతిని అతనిలో ఉన్న దుందుడుకు స్వభావం అంతకు మించిన నిర్లక్ష్యం, బద్ధకం, తెంపరితనం తక్కువ చేస్తున్నాయి. కొన్నిసార్లు అనవసరంగా మైదానంలో విపరీతమైన చేష్టలు చేస్తాడు. అందుకు తగ్గట్టే మూడోరోజు కీలక సమయంలో అతడు ఔటైన తీరును కచ్చితంగా తప్పుపట్టాల్సిందే! ఇలాంటి మ్యాచ్‌లో అంత ఘోరమైన ఔట్ అంటే ఎవ్వరూ ఒప్పుకోరు! అందుకే దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ 'ఇది క్షమించరాని తప్పు' అని కామెంటరీ బాక్స్ నుంచి అనేశారు. దాదాపు అరిచేశారు! మిగతా వ్యాఖ్యాతలు ఆయనతో ఏకీభవించారు.

ఔటయ్యాడిలా..!

అప్పుడు జట్టు స్కోరు 209. అంతకుముందే కోహ్లి శతకం చేశాడు. ఈ క్రమంలో రబాడ వేసిన 67.1వ బంతిని పాండ్య ఎదుర్కొన్నాడు. బంతి మిడాన్‌లో ఫీల్డర్ వద్దకు చేరింది. ఓ త్వరిత పరుగు కోసం పాండ్య పిచ్ సగం వరకు వచ్చేశాడు. కోహ్లి 'అబే.. నహీ' అంటూ గట్టిగా అరవడంతో వెనక్కి వెళ్లాడు. కానీ.. చాలా మెల్లగా! ఈ లోపు ఫీల్డర్ విసిరిన బంతి అతడిని దాటేసి వికెట్లను గిరాటేసింది. బంతి వికెట్లకు తాకుతున్నప్పుడు పాండ్య బ్యాటు, ఒక కాలు క్రీజు దాటేశాయి. కానీ గాల్లో ఉన్నాయి. ఏదో ఒకటి నేలకు ఆనించి ఉంటే అతడు బతికేవాడు. భారత్ అప్పటికి ఇంకా 126 పరుగుల లోటుతో ఉంది. ఏదో చిన్న జట్టుపై అతనలా చెత్తగా ఆడివుంటే ఫర్వాలేదు కానీ దుర్భేద్యమైన బౌలర్లున్న ఆతిథ్య జట్టుపై ఈ తీరు సరికాదు! అందుకే గావస్కర్ అంతలా ప్రతిస్పందించారు. ఇప్పటికే ఒక మ్యాచ్ ఓటమి పాలయ్యాం. ఎంతో బాధ్యతగా ఆడాల్సిన మ్యాచ్‌లో ఇలా చేయడం ఏమిటి? కోహ్లి నిలిచాడు. అతడు అశ్విన్ అండగా ఉన్నాడు కాబట్టి సరిపోయింది. లేదంటే వికెట్లు టపటపా పడిపోయేవేగా!





న్యూగినియాపై యూ-19 విజయం

మౌంట్ మౌంగానుయ్ : అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-బిలో భాగంగా పసికూన పపువా న్యూగినియాపై జరిగిన మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినియా భారత బౌలర్ల దాటికి చేతులెత్తేసింది. పట్టుమని 22 ఓవర్లు కూడా బ్యాట్స్‌మెన్లు ఆడలేకపోయారు. 21.5 ఓవర్లలో 64 పరుగులకు ఆలౌట్ అయ్యారు. భారత బౌలర్లలో సుధాకర్ రాయ్ 5, శివమ్ మావి 2 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించారు. నాగర్‌కోటి, అర్ష్‌దీప్ సింగ్ చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం 65 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన యువభారత్ వికెట్లు నష్టపోకుండా కేవలం 8 ఓవర్లలోనే లాంఛనాన్ని పూర్తిచేశారు. ఓపెనర్లు పృథ్వీషా 57, మన్‌జ్యోత్ కల్రా 9 పరుగులు చేశారు. తొలి మ్యాచ్‌లో పటిష్ట ఆస్ట్రేలియాపై భారత్ వంద పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

అందుకే... ఐపీఎల్..!



న్యూఢిల్లీ : 'గత రెండు సంవత్సరాల్లో టీ20 క్రికెట్ పెద్దగా ఆడలేదు. రెండేళ్లలో ఐసీసీటీ20 ప్రపంచకప్ ఉంది. ఈ ఏడాది ఐపీఎల్ ఆడితే నాకు కొంత సన్నాహకంగా ఉంటుంది. అందుకే ఐపీఎల్ ఆడాలనుకుంటున్నా'అని తన మనసులోని మాటను వెల్లబుచ్చాడు ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్. వివిధ దేశాల నుంచి ఇప్పటికే సుమారు 1,122 మంది ఆటగాళ్లు తాము ఐపీఎల్ వేలానికి అందుబాటులో ఉంటామని బీసీసీఐకి తెలిపారు. ఈ నేపథ్యంలో రూట్ తానెందుకు ఐపీఎల్ ఆడాలని అనుకుంటున్నాడో వెల్లడించాడు. 'గత రెండేళ్లలో నేను పొట్టి క్రికెట్ ఎక్కువగా ఆడలేదు. మరో రెండేళ్లలో టీ20 ప్రపంచకప్ టోర్నీ ఉంది. ఇలాంటప్పుడు ఐపీఎల్ ద్వారా నాకొక మంచి వేదిక దొరికింది. ఈ టోర్నీ ఆడటం ద్వారా నా ఆటలో లోటుపాటులను గుర్తించి వాటిని సరిదిద్దుకోవాలనుకుంటున్నా. ఒకేసారి పలు దేశాలకు చెందిన ఆటగాళ్లతో ఆడే అవకాశం దొరుతుంది. ఇది ఎంతో లాభదాయకమైనది. అందుకే ఈ ఏడాది ఐపీఎల్ ఆడాలనుకుంటున్నా' అని రూట్ తెలిపాడు. వేలంలో పాల్గొనాలనుకున్న రూట్ తన కనీస మద్దతు ధరను రూ.1.5కోట్లగా తెలిపాడు. ఈనెల 27, 28 తేదీల్లో బెంగళూరులో ఐపీఎల్-2018 కోసం వేలం జరగనుంది.

భారత్ ఎదురీత

- 4 వికెట్లతో రాణించిన షమీ
- డివిలియర్స్ సెంచరీ మిస్
- సహనాన్ని పరీక్షించిన డు ప్లెసిస్



సెంచూరియన్ : టీమిండియాతో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా తన రెండో ఇన్నింగ్స్‌లో 258 పరుగుల వద్ద ఆలౌటైంది. 90/2 ఓవర్ నైట్ స్కోరుతో నాలుగో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీలు.. మరో 168 పరుగులు జోడించి మిగతా ఎనిమిది వికెట్లు కోల్పోయారు. దాంతో భారత్‌కు 287 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం ఆటలో డివిలియర్స్(80, 121 బంతుల్లో 10 ఫోర్లు), డీన్ ఎల్గర్ (61, 121 బంతుల్లో 8 ఫోర్లు, 1సిక్సర్), డీకాక్(12, 5 బంతుల్లో 3 ఫోర్లు)లను స్వల్ప వ్యవధిలో అవుట్ కాగా, డు ప్లెసిస్(48, 141 బంతుల్లో 4 ఫోర్లు) బాధ్యతాయుతంగా ఆడి జట్టు స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. డు ప్లెసిస్‌కు ఫిలిండర్(26, 85 బంతుల్లో 2 ఫోర్లు) నుంచి చక్కటి సహకారం లభించింది. ఈ జోడీ ఆరో వికెట్‌కు 46 పరుగుల్ని భాగస్వామ్యాన్ని సాధించగా, అటు తరువాత డు ప్లెసిస్- రబడా(29 బంతుల్లో 4) ల జోడి 30 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేసింది. టీమిండియా బౌలర్లలో మొహ్మద్ షమీ నాలుగు వికెట్లు సాధించగా, బూమ్రా మూడు వికెట్లు తీశాడు. ఇక ఇషాంత్ శర్మ రెండు, అశ్విన్ ఒక వికెట్ తీశారు.



అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఎనిమిదో ఓవర్‌లోనే షాక్ తగిలింది. తొలి ఇన్నింగ్స్‌లో నిలిచిన ఓపెనర్ మురళీ విజయ్ (9, 25 బంతుల్లో 1×4) ఔటయ్యాడు. రబాద ఇన్‌స్వింగర్‌గా వేసిన 7.5వ బంతికి ఇన్‌సైడ్ ఎడ్జ్ రూపంలో పెవిలియన్ చేరాడు. కొద్దిసేపటికి లోకేష్ రాహుల్ (4, 29 బంతులు) వెనుదిరిగాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన సారథి విరాట్ కోహ్లి కొద్దిసేపు పోరాడినా, అతడిని ఎంగిడి ఎల్‌బీడబ్ల్యూ రూపంలో పెవిలియన్‌కు పంపాడు. దీంతో నాలుగోరోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 3 వికెట్లు చేజార్చుకుని 35 పరుగులు చేసింది. మ్యాచ్‌ను ఒదులుకోకుండా డ్రా చేయాలంటే బుధవారం అంతా భారత్ బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే దక్షిణాఫ్రికా బౌలర్ల బౌన్సర్లను టీమిండియా బ్యాట్స్‌మెన్ ఎంత మేరకు అడ్డుకుంటారనేది వేచి చూడాల్సిందే.

8 ఏళ్ల తర్వాత జట్టులోకి కార్తీక్



సెంచురియన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో టీం ఇండియాలో ప్రతి మ్యాచ్‌కి కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. తొలి టెస్ట్ మ్యాచ్‌లో అజింక్యా రహానే లేకుం డానే బరిలోకి దిగిన భారత జట్టు.. రెండో టెస్ట్‌లో భువనేశ్వర్, సాహా, ధవన్‌లను పక్కన పెట్టి వాళ్ల స్థానంలో ఇశాంత్, పార్థీవ్, రాహుల్‌లకు జట్టులో స్థానం కల్పించిన విషయం తెలిసిందే. ఇందుకోసం కెప్టెన్ విరాట్ కోహ్లిని క్రికెట్ దిగ్గజాల నుంచి అభిమానుల వరకూ అందరూ విమర్శించారు. తాజా మూడో టెస్ట్ కోసం జట్టులో మరో మార్పు చోటు చేసుకొనుంది. 16 ఏళ్ల తర్వాత విదేశాల్లో జట్టులో స్థానం దక్కించుకున్న కీపర్ పార్థీవ్ పటేల్‌ను తప్పించి అతని స్థానంలో కీపర్ బ్యాట్స్‌మెన్ దినేష్ కార్తీక్‌ని తీసుకుంటున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. తొలి టెస్ట్‌లో సాహాకు గాయం కావడంతో అతని స్థానంలో పార్థీవ్‌ను తీసుకున్నారు. ఇప్పుడు పార్థీవ్‌ను తప్పించి కార్తీక్‌ను సాహా స్థానంలో తీసుకుంటున్నట్లు బీసీసీఐ తెలిపింది. దీంతో జోహెన్స్‌బర్గ్‌లో జరిగే మూడో, ఆఖరి టెస్ట్‌లో దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత టెస్ట్ జట్టులో కార్తీక్‌కు స్థానం దక్కనుంది.

మొదట ఫిట్‌నెస్ : శ్రీకాంత్

న్యూఢిల్లీ : గత ఏడాది ఎవరూ ఊహించని విధంగా నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు నెగ్గి భారత్ తరపున ఆ ఘనత సాధించిన మొదటి క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించాడు తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్. తాజాగా శ్రీకాంత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'మొదట పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించడంపై దృష్టి పెట్టా. ఆ తర్వాత సూపర్ సిరీస్ టోర్నమెంట్లలో విజయం సాధించడంపై దృష్టిపెట్టాను. అదృష్టవశాత్తూ అకాడమీలో కోచ్‌లు, సహాయక సిబ్బంది సాయంతో గత ఏడాది అద్భుత విజయాలు సాధించాను. తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించడంలో వారి పాత్ర చాలా ఉంది' అని తెలిపాడు శ్రీకాంత్.

కోహ్లి కంటే ధర ఎక్కువే..!



న్యూఢిల్లీ : ఐపీఎల్-2018 వేలానికి ముందే టీమిండియా సారథి విరాట్ కోహ్లి కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అత్యధిక ధర చెల్లించిన సంగతి తెలిసిందే. రిటెన్షన్ విధానం ద్వారా కోహ్లిని సొంతం చేసుకున్న ఆర్‌సీబీ రూ.17కోట్లు చెల్లించింది. ఈనెల 27, 28 తేదీల్లో ఈ ఏడాది ఐపీఎల్ కోసం ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నారు. ఈ వేలంలో కోహ్లి కంటే ఎక్కువ ధరకు అమ్ముడుపోయే ఆటగాళ్లు ఉన్నారని అంటున్నాడు భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్. ఐపీఎల్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌కు సెహ్వాగ్ మెంటార్‌గా బాధ్యతలు నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా సెహ్వాగ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'ఈ ఏడాది ఐపీఎల్ కోసం నిర్వహించే వేలంలో ఇద్దరి నుంచి ముగ్గురు ఆటగాళ్లు కోహ్లి కంటే ఎక్కువ ధర పలికేవాళ్లు ఉన్నారు. ఏదైనా ఫ్రాంఛైజీ ఒక ఆటగాడిని తామే దక్కించుకోవాలని భావిస్తే అతడి కోసం రూ.20 కోట్లయినా చెల్లించేందుకు సిద్ధంగా ఉంది. గత ఏడాది ముంబై ఇండియన్స్ వద్ద తగినంత డబ్బులేక ఇంగ్లండ్ ఆటగాడు బెన్ స్టోక్స్‌ను వదిలేసుకుంది. రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్ అత్యధికంగా రూ.14 కోట్లు వెచ్చించి అతడిని సొంతం చేసుకుంది. ఈ ఏడాది స్టోక్స్.. కోహ్లి కంటే ఎక్కువ ధర పలకొచ్చు. చెప్పలేం' అని సెహ్వాగ్ తెలిపాడు. ఈనెల 4న నిర్వహించిన ప్లేయర్ రిటన్షన్ ద్వారా కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఒకే ఒక్క ఆటగాడు అక్షర్ పటేల్‌కు అత్యధికంగా రూ.6.75కోట్లు చెల్లించింది. దీనిపై ఆయన మాట్లాడుతూ..'ఈ ఏడాది ఐపీఎల్ వేలంలో భారత ఆటగాళ్లకు ఎక్కువ ధర పలుకుతారు. మూడేళ్ల క్రితం అక్షర్ పటేల్‌ను రూ.30లక్షలు వెచ్చించి మేము తీసుకున్నాం. అప్పుడు అతను భారత్‌కు ఆడటం లేదు. ఎప్పుడైతే పంజాబ్ జట్టులోకి వచ్చాడో అప్పటి నుంచి అతడు భారత్‌కు ఆడుతున్నాడు. అతడిని వేలానికి వదిలేస్తే రూ.8కోట్ల నుంచి రూ.10 కోట్లు పలకడం ఖాయం. ఒక మ్యాచ్‌లో అతడు నాలుగు ఓవర్లు వేయగలడు. అలాగే అద్భుతంగా బ్యాటింగ్ చేయగలడు. అతడో గొప్ప హిట్టర్. గత రెండేళ్ల నుంచి అతడి బ్యాటింగ్‌ను మరింత మెరుగుదిద్దుతున్నాం. త్వరలో అతడు పర్‌ఫెక్ట్ ఆల్‌రౌండర్ అవుతాడు. ఈ ఏడాది వేలంలో మా ఫ్రాంఛైజీ మూడు ఆర్టీఎమ్ కార్డులను ఉపయోగించుకుం టోంది' అని సెహ్వాగ్ వివరించాడు.

బ్రాడ్‌మన్ రికార్డు సమం



సెంచూరియన్: ఆసీస్ మాజీ క్రికెటర్ డాన్ బ్రాడ్‌మన్ రికార్డును భారత పరుగుల యంత్రం విరాట్ కోహ్లి సమం చేశాడు. భారత్-దక్షిణాఫ్రికా మధ్య సెంచూరియన్‌లో జరుగుతోన్న రెండో టెస్టులో కోహ్లి 153 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు టెస్టుల్లో 9సార్లు 150కి పైగా పరుగులు సాధించాడు. అందులో ఎనిమిదిసార్లు కెప్టెన్‌గా ఆ ఘనతను అందుకున్నాడు. కెప్టెన్‌గా డాన్ బ్రాడ్‌మన్ మాత్రమే ఇప్పటి వరకు టెస్టుల్లో అత్యధికంగా 8సార్లు 150కి పైగా పరుగులు చేశాడు. ఇప్పుడు ఈ ఘనతను కోహ్లి అందుకున్నాడు. 65 మ్యాచుల్లో బ్రాడ్‌మన్ రికార్డును సమం చేశాడు. ఆసీస్ మాజీ సారథి మైకెల్ క్లార్క్ ఏడుసార్లు 150కిపైగా పరుగులు సాధించి ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. జయవర్ధనే(శ్రీలంక), లారా(వెస్టిండీస్), గ్రేమ్ స్మిత్(దక్షిణఫ్రికా) కూడా కెప్టెన్లుగా ఏడుసార్లు టెస్టుల్లో 150కి పైగా పరుగులు సాధించిన వారి జాబితాలో ఉన్నారు. ఆసియా దేశాలకు చెందిన సారథి సఫారీ గడ్డపై శతకం సాధించడం ఇది రెండోసారి మాత్రమే. 1997లో కెప్టెన్‌గా సచిన్ తెండూల్కర్ కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో 169 పరుగులు సాధించిన సంగతి తెలిసిందే. సెంచూరియన్‌లోని స్పోర్ట్ పార్క్ మైదానంలో అత్యధిక పరుగులు, శతకం సాధించిన తొలి విదేశీ సారథి కూడా కోహ్లినే కావడం విశేషం. 2010లో ధోనీ సాధించిన 90 పరుగులే ఇప్పటి వరకు ఈ మైదానంలో అత్యధిక పరుగులు సాధించిన విదేశీ కెప్టెన్.

అమరావతిలో నమూనా ఎగ్జిబిషన్..

- ఏడెకరాల్లో ప్రదర్శనశాల....
- స్టార్టప్ ఏరియాలో ఏర్పాటుకు సన్నాహాలు....

విశాలాంధ్ర-అమరావతి : ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం జరుపుకుంటున్న అమరావతి తన ఖ్యాతిని చాటుకునేందుకు సిద్ధమవుతోంది. అమరావతి వింతలు, విశేషాలు తెలుసుకునే విధంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. రాజధానిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనలో ఉన్న సర్కార్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా ప్రారంభించాలని యోచిస్తోంది. సీడ్ క్యాపిటల్ నిర్మాణం జరిగే ప్రాంతంలోనే ఈ విశేషాలు తెలియచేసే ప్రక్రియకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. దీన్లోభాగంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రానున్న పదిహేనేళ్లలోపు రాజధాని అమరావతి ఎలా ఉండబోతుందో ఈ ఎగ్జిబిషన్ ద్వారా తెలియచేసే ప్రయత్నం చేస్తోంది ప్రభుత్వం.

ఎలా ఉంటుంది..



అమరావతి రాజధాని నిర్మాణం ఏలా ఉండబోతుంది, ఏ భవనాలు ఎక్కడ రాబోతున్నాయి, పార్కులు, పర్యాటక ప్రాంతాలు, శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు ఇలా ప్రతి ఒక్క నిర్మాణం ఆకృతిని తెలియచేసే రీతిన ఈ ఎగ్జిబిషన్ ఉండనున్నది. అయితే పూర్తిగా ప్రభుత్వం నిర్మించబోయే నమూనా రాజధానిగా ఇది నిర్మితమవుతుంది. కాగా స్విస్ ఛాలెంజ్ విధానంలో నిర్మించే అమరావతి రాజధాని నమూనా ఎగ్జిబిషన్ కూడా సింగపూర్ కంపెనీలైన అసెండాస్-సిన్ బ్రిడ్జి, సేమ్బ్ కార్ప్‌ల డిమాండ్ మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో రాజధాని అమరావతిపై పూర్తి అవగాహన కల్పించటంతో పాటుగా సింగపూర్ నిర్మాణాలు ఎంతటి ప్రాముఖ్యతని కలిగి ఉంటాయో సందర్శకులకు తెలుస్తుందన్నదే సింగపూర్ కంపెనీల ఆలోచన. పలు రూపాలలో పెట్టుబడి పెట్టేందుకు వస్తున్న విదేశీ కంపెనీలకు సైతం నమూనా రాజధాని ఉత్సాహాన్ని అందిస్తుందని సర్కార్ భావిస్తోంది. అదే క్రమంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులను సైతం ఈ ఎగ్జిబిషన్ ద్వారా వివరించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోంది.

33 వేల ఎకరాల వివరాలు....

అమరావతి రాజధానిలో ఇప్పటికే ప్రభుత్వం పలు సంస్థలకి భూములు కేటాయించింది. అయితే వాటి ద్వారా జరిగే అభివృద్ధి పనులు రాష్ట్రానికి ఒనగురుతున్న లబ్ధి ఒకే చోట ప్రదర్శించి ప్రపంచస్థాయి రాజధాని ఖ్యాతిని దిశా దశల చాటి చెప్పేందుకు ఈ ప్రయత్నాన్ని ఉపయోగించుకోవాలని సర్కార్ ఆశిస్తోంది. 4,080 చదరపు మీటర్లలో నమూనా రాజధాని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ప్రదర్శనకు ఉంచనున్నారు. నమూనా రాజధానిలోనే కమ్యూనిటీ జోన్లు అభివృద్ధి చేసే విధానం వివరించనున్నట్లు సమాచారం. ఇటీవల సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ముఖ్యమంత్రి చంద్రబాబుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. భవిష్యత్ రాజధానికి సింబల్‌గా ఉండేలా ఈ నమూనా రాజధానా నిర్మాణం జరుపుకోనుంది. రాజధాని స్టార్టప్ ఏరియాలో ఈ నమూనా ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ఏడెకరాల స్థలం కేటాయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీఆర్డీఏ ఈ దిశగా కీలక పనులు ప్రారంభించే పనిలో ఉన్నట్లు పాలక వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నిధుల దుర్వినియోగంపై సర్వత్రా విమర్శలు....

తాత్కాలిక ఏర్పాట్లతో భారీ స్థాయిలో నిధుల దుర్వినియోగం జరుగుతుందని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అటు ప్రజలనుంచి, ఇటు ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. తాత్కాలిక సచివాలయం పేరిట కోట్ల రూపాయలను కుమ్మరించి, నేటికి మరమ్మతులు చేయడం సర్వత్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. అటు నివాసం వద్ద సీఎం తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేయడం సైతం విమర్శలకు తావు ఇచ్చినట్లైంది. ప్రతి చోట తాత్కాలికం పేరుతో నిధుల దుర్వినియోగం జరగటం మళ్లీ మళ్లీ అదే కార్యక్రమాలు వైపు ప్రభుత్వం మొగ్గు చూపడం కొంత ఇబ్బందికర అంశంగా మారింది. మరి ప్రస్తుతం ఏర్పాటు చేయబోయే రాజధాని నమూనా ఎగ్జిబిషన్‌కు ఏ స్థాయిలో నిధులు ఖర్చు చేయనున్నారో అనేది సందిగ్ధంగా మారింది. అలాగే సింగపూర్ కంపెనీ పర్యవేక్షణలో జరిగే నమూనా ఏర్పాట్లు అంటే ఖర్చు భారీగానే ఉంటుందని సాక్షాత్తూ అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అటు కేంద్రం సైతం విచ్చలవిడి ఖర్చులపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ప్రస్తుత తరుణంలో సర్కార్ ఈ ఎగ్జిబిషన్ విషయంలో ఎలా ముందుకు వెళ్లనున్నది అనేది ఆసక్తికరంగా మారింది.

కుప్పకూలిన షోయబ్ మాలిక్



హామిల్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డే మ్యాచ్‌లో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ షోయబ్ మాలిక్ మైదానంలో కుప్పకూలిపోయాడు. పాకిస్థాన్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో 32వ ఓవర్‌లో పరుగు తీసేందుకు మాలిక్ ప్రయత్నించాడు. అయితే ఫీల్డర్ మున్రో విసిరిన బంతి మాలిక్ తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే స్పందించిన వైద్య సిబ్బంది మాలిక్‌ను గ్రౌండ్ నుంచి తీసుకెళ్లి అతనికి ట్రీట్‌మెంట్ అందించారు. దీంతో కోలుకున్న అతను మూడు బంతుల అనంతరం తిరిగి బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ ఘటనపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు స్పందిస్తూ.. మాలిక్ గాయం జరిగిన వెంటనే తొలుత అపస్మారక స్థితిలోకి వెళ్లాడని, వైద్యం అందుకున్న తర్వాత అతను కోలుకొని తిరిగి బ్యాటింగ్‌కి వచ్చాడని తెలిపింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.